
పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,పక్షవ్యాధులతోపాటు అన్ని రకాల రోగులకు పసమూలికలతో వైద్యచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరామాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar | సంపుటి :25 | సంచిక :59 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు | గురువారం 09 జూలై 2026 | పేజీలు :12 | వేల రూ5 /-




## మావోయిస్టులే నయం

### డ్రగ్స్ పెడ్లర్స్‌పై డీజీపీ సీవీ ఆనంద్

**హైదరాబాద్:** తెలంగాణ డ్రగ్ పెడ్లర్స్ కంటే మావోయిస్టులే నయమని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. గతంలో మావోయిస్టులు గంజాయికి వ్యతిరేకంగా ఉన్నారని, ఇప్పుడు మావోయిస్టుల ప్రభావం తగ్గడంతో గంజాయి రవాణా విస్తరించిందని తెలిపారు. క్రైమ్ రివ్యూ నిర్వహించిన ఆయన, నట్టింట్లోకి, స్కూళ్ల దగ్గర చాక్లెట్ల రూపంలో డ్రగ్స్ చేరుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పుడే డ్రగ్స్ను అరికట్టకుంటే భవిష్యత్తులో ప్రమాదం తప్పదని, గంజాయి నిర్మూలనకు అందరం కలిసి యుద్ధం చేద్దామని పిలుపునిచ్చారు.

### తెలంగాణలో రూ.300 కోట్ల

## గోద్రేజ్ ఆయిల్ పామ్ ప్రాజెక్ట్..

### సీఎం రేవంత్‌తో కీలక భేటీ...

**హైదరాబాద్, జులై 8 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఎంసీఆర్‌హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో గోద్రేజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ప్రెసిడెంట్( కార్పొరేట్ వ్యవహారాలు) రాకేశ్‌స్వామి, గోద్రేజ్ అగ్రోవెట్ ఆయిల్ పామ్ బిజినెస్ సీఈఓ సౌగతో నియోగి ఈరోజు (బుధవారం) కలిశారు. గోద్రేజ్ అగ్రోవెట్ కంపెనీ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణపైన ముఖ్యమంత్రికి నివేదిక అందజేశారు రాకేశ్ స్వామి. తెలంగాణలోనే మొట్టమొదటి ప్రైవేట్ సమీకృత ఆయిల్ పామ్ కాంప్లెక్స్ త్వరలో ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో పలు కీలక అంశాలపైన సీఎం చర్చించారు. ఖమ్మం జిల్లాలో రూ.300 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా 700 మందికి పైగా ఉపాధి లభించనుంది. ఆయిల్ పామ్ ప్రాసెసింగ్, నర్సరీ, ఆర్ అండ్ డీ కేంద్రం, సీడ్ గార్డెన్ ఏర్పాటు కోసం ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గుబ్బగుర్తి గ్రామంలో 113.5 ఎకరాల భూమిని గోద్రేజ్ అగ్రోవెట్ సంస్థకు రాష్ట్ర ప్రభుత్వం



కేటాయించింది. సీడ్ గార్డెన్ కోసం అదనంగా 35 నుంచి 40 ఎకరాల భూమిని కేటాయించాలని ప్రభుత్వాన్నిఈ సంస్థ కోరింది. ప్రాసెసింగ్ మిల్ కోసం రోడ్డును విస్తరించాలని ముఖ్యమంత్రిని ఈ సంస్థ ప్రతినిధులు కోరారు. టీజీఐఐసీ ఆధ్వర్యంలో రోడ్డు విస్తరణ చేపట్టాలని సంబంధిత అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు.

### దేశవ్యాప్తంగా ఎన్ఐఏ

## భారీగా సోదాలు



**ఇంటర్నెట్ డెస్క్, జులై 8 :** దేశవ్యాప్తంగా ఎన్ఐఏ అధికారులు ఈరోజు (బుధవారం) భారీగా సోదాలు చేపట్టారు. ఐసీస్ , ఏక్యూఐఎస్ ఉగ్రవాద కార్యకలాపాల ప్రచారంపై సోదాలు చేశారు. భారత్‌లో హింసాత్మక జిహాద్ ద్వారా ఇస్లామిక్ స్టేట్ ఏర్పాటు కుట్రపై దర్యాప్తు ముమ్మరం చేశారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణతో పాటు 10 రాష్ట్రాలు, ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతంలోని మొత్తం 20 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో పలు డిజిటల్ పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న పరికరాలను ఫోరెన్సిక్ పరీక్షలకు పంపనున్నట్లు ఎన్ఐఏ అధికారులు తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు 11 మంది నిందితులు, ఓ బాలుడిని జువెనైల్ నుంచి అదుపులోకి తీసుకున్నామని అధికారులు వెల్లడించారు. విజయవాడ పోలీసులు మార్చిలో నమోదు చేసిన కేసును మేలో ఎన్ఐఏకు బదిలీ చేసిన విషయం తెలిసిందే. ప్రధాన నిందితుడు రెహ్మతుల్లా షరీఫ్ మహ్మద్ నివాసంలో గతంలో ఐసీస్, ఏక్యూఐఎస్‌కు సంబంధించిన అభ్యంతరకర ప్రచార సామగ్రి లభ్యమైంది. గతంలో స్వాధీనం చేసుకున్న డిజిటల్ పరికరాల సాంకేతిక విశ్లేషణ ఆధారంగా ఎన్ఐఏ అధికారులు ఇవాళ సోదాలు నిర్వహించారు. అరెస్టైన నిందితులు దేశంలోని యువతను జిహాదీ భావజాలం వైపు మళ్లించే ప్రయత్నాలు చేసినట్లు అధికారుల దర్యాప్తులో వెల్లడైంది. విదేశీ హ్యాండ్లర్లతో ఆన్‌లైన్ ద్వారా సంబంధాలు కొనసాగిస్తూ ఉగ్ర భావజాలాన్ని వ్యాప్తి చేసినట్లు ఎన్ఐఏ అధికారులు గుర్తించారు. దేశాన్ని అస్థిరపరిచి 'ఖలీఫత్' స్థాపనకు కుట్ర పన్నిన వారిని గుర్తించే దిశగా దర్యాప్తు కొనసాగుతోందని ఎన్ఐఏ అధికారులు పేర్కొన్నారు.

### బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆషాడ బోనాల ఉత్సవాలు, కళ్యాణోత్సవాన్ని

## దేదీప్యమానంగా నిర్వహించాలి

### బల్కంపేట అమ్మవారి దయతో రాష్ట్రం సుభిక్షంగా వుండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో వర్ధిల్లాలని అమ్మవారికి మొక్కుకున్న మంత్రి కొండా సురేఖ

ఆషాడ బోనాల ఉత్సవాల్లో భాగంగా నిర్వహించే బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవాన్ని అత్యంత శోభాయమానంగా, కన్నుల పండువగా నిర్వహించాలని దేవాదాయ ధర్మాదాయ శాఖామాత్యులు శ్రీమతి కొండా సురేఖ గారు అధికారులను ఆదేశించారు. ఏడు వందల సంవత్సరాల చరిత్ర కలిగిన ఎల్లమ్మ అమ్మవారు బల్కంపేటలో కొలువై వుండటం తెలంగాణ రాష్ట్రానికి మంగళప్రదం అని మంత్రి అన్నారు. ఈ నెల 20, 21, 22 తేదీల్లో నిర్వహించనున్న బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి



వార్షిక కళ్యాణోత్సవ సమన్వయ సమావేశంలో - మిగతా3లో

## 'కొత్త కేటాయింపు కాదు'..

### తాడిచర్ల కోల్ బ్లాక్ కేటాయింపుపై భట్టి క్లారిటీ

**హైదరాబాద్, జులై 8**: సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ - 2 కేటాయించినట్లు కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి చెప్పారని.. కానీ వాస్తవాలు దాచిపెట్టి వేరేలా చిత్రీకరించడం సరికాదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. ఈరోజు(బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. 2013 సెప్టెంబర్ 16న ఈ కోల్ బ్లాక్‌ను ఆనాటి యూపీఏ ప్రభుత్వం సింగరేణికి కేటాయించిందని గుర్తుచేశారు. ఇప్పుడు కొత్తగా కోల్ బ్లాక్ కేటాయించినట్లు చెప్పడం ఏంటి అని ప్రశ్నించారు. మైనింగ్ లీజుకు దరఖాస్తు చేస్తే ఇన్నాళ్లూ పెండింగ్‌లో పెట్టారని.. ఎమ్ఎమ్‌బీఆర్ యాక్ట్ రాకముందే ఈ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించారని తెలిపారు. కేంద్ర మంత్రులను కలిసి చరిత్ర మొత్తం వివరించామని భట్టి అన్నారు. రాష్ట్రం నుంచి కొట్లాడి ఈ మైనింగ్ లీజుకు తెచ్చుకున్నామన్నారు. ట్రైబల్ ఏరియాలో ట్రైబల్స్ లేదా ప్రభుత్వ సంస్థలు మాత్రమే పని చేయాలని.. ప్రైవేట్ కంపెనీలు పని చేయడానికి అవకాశం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా సత్తుపల్లి బ్లాక్ 3, కోయగూడెం



బ్లాక్3కు టెండర్ వేశారని అన్నారు. బీఆర్ఎస్ బినామీలు ఆక్షన్‌లో పాల్గొని వాటిని దక్కించుకున్నారన్నారు. ఇన్నాళ్లూ సింగరేణికి తాడిచర్ల కోల్ బ్లాక్ లీజుకు ఇవ్వకపోవడం వల్ల వేల కోట్ల నష్టం జరిగిందని చెప్పుకొచ్చారు. గోదావరి పరిసరాల్లోని కోల్ బ్లాక్స్ అన్నింటినీ సింగరేణికి కేటాయించాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క డిమాండ్ చేశారు.

### అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు

## మళ్లీ తారాస్థాయికి...



### భగ్గుమన్న ముడిచమురు ధరలు

అమెరికా, ఇరాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు మరోసారి తారాస్థాయికి చేరాయి. దాంతో అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఇక ఇరాన్‌తో కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిపోయిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేయడంతో ఇవాళ చమురు ధరలు ఆరు శాతానికిపైగా ఎగబాకాయి. పశ్చిమాసియా నుంచి ఇంధన సరఫరాపై నెలకొన్న ఆందోళనలే ఈ ధరల పెరుగుదలకు ప్రధాన కారణంగా నిలిచింది. అంతర్జాతీయ బెంచ్‌మార్క్ - మిగతా3లో

### గ్రేటర్ ఎన్నికల నేపథ్యంలో

## ఓవైసీ వ్యూహం..



**హైదరాబాద్, జూలై 8:**ఎం ఐ ఎం చీఫ్... అసదుద్దీన్ ఓవైసీ చాలా రోజుల తర్వాత హైదరాబాద్ లో చిచ్చు రాజేశాడు. సోషల్ మీడియా వేదికగా సౌత్, వెస్ట్ హైదరాబాద్ నుంచి అనేక ప్రభుత్వ కార్యాలయాలను ఇతర ప్రాంతాలకు మార్చడం అన్యాయమని, ఇది సాధారణ ప్రజల్లో తప్పుడు సంకేతాలు పంపుతోందని వ్యాఖ్యానించారు. గుడిమాల్కాపూర్ మార్కెట్ తరలింపును ఆధారంగా చేసుకుని, నగరంలోని వివిధ జోన్ల మధ్య వివక్ష ఉందనే పెద్ద అంశాన్ని తెరపైకి తెచ్చారు. పాతనగరం సౌత్ పరిధిలోకి, మెహదీపట్నం-కార్వాన్ పరిసరాలు వెస్ట్ పరిధిలోకి వస్తాయి. ఈ నిర్ణయాలు ప్రాంతాల మధ్య అసమానతను పెంచుతున్నాయని, స్థానికుల భావోద్వేగాలను రెచ్చగొట్టాడు.ఇటీవలి సంవత్సరాల్లో ట్రాఫిక్ రద్దీని తగ్గించడం, శాంతిభద్రతను మెరుగుపరచడం, శివారు ప్రాంతాల సమగ్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం కొన్ని ముఖ్యమైన కార్యాలయాలు, విభాగాలను రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోని కొత్త భవనాలకు, తూర్పు-ఉత్తర శివార్లకు మార్చింది. ఇందులో - మిగతా3లో

### సెంటి మెంట్ తో

## కమలం వ్యూహం...

**హైదరాబాద్, జూలై 8:**తెలంగాణ బీజేపీ గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలపై పట్టు సాధించేందుకు వ్యూహాలను సిద్ధం చేసుకుంటోంది. పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ తెలంగాణ పర్యటన తర్వాత కొంత నేతల్లో సమన్వయం కనిపిస్తుంది. అలాగే సెంటిమెంట్ ను రగిలించాలని బీజేపీ నేతలు ఈ ఎన్నికలకు సమాయత్తమవుతున్నట్లు అర్థమవుతుంది. తాజాగా బీజేపీ రాష్ట్ర నేతలు ఎంఐఎం, హైడ్రా ను లక్ష్యంగా చేసుకుని విమర్శలు చేస్తున్నారు. బీజేపీ చేస్తున్న విమర్శలకు ఎంఐఎం ప్రతి విమర్శలు చేస్తూ కమలం పార్టీ ట్రాప్ లో పడినట్లు కనిపిస్తుంది. గత కొన్ని రోజులుగా జరుగుతున్న పరిణామాలను చూస్తుంటే పతంగి పార్టీ విమర్శలతో బీజేపీ ఓటు బ్యాంకును గణనీయంగా పెంచుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.. హైడ్రాను ముందర పెట్టి బీజేపీ విమర్శలకు గత కొద్ది రోజలుగా దిగుతోంది. హైడ్రా కేవలం సామాన్యులు, పేదలు జోలికి మాత్రమే పోతుందని, ఎంఐఎం నేతల ఆక్రమణల జోలికి వెళ్లడం లేదని ఆరోపిస్తుంది. బీజేపీ చీఫ్ రామ్ చందర్ రావు తో పాటు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ లు కూడా హైడ్రాపై వ్యాఖ్యలు చేశారు. హైడ్రా ఏకపక్షంగా




వ్యవహరిస్తుందని, ఎంఐఎంకు చెందిన ఆక్రమణల - మిగతా3లో

### తెలంగాణలో పెట్టుబడులకు

## కెనడా ఆసక్తి..

### సీఎం రేవంత్‌తో హైకమిషనర్ భేటీ

**హైదరాబాద్, జులై 8 :** కెనడా హైకమిషనర్ క్రిస్ కూటర్‌తో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈరోజు (బుధవారం) సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. సీఎం నేతృత్వంలోని తెలంగాణ బృందం కెనడాలో పర్యటించాలని ప్రతినిధులు ఆహ్వానం పలికారు. తెలంగాణ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు కెనడా కంపెనీలకు సీఎం ఆహ్వానం పలికారు. తెలంగాణలో పెట్టుబడులు పెంచేందుకు కెనడా ప్రతినిధులు ఆసక్తి చూపించారు. మూసీ రివర్‌ఫ్రంట్, మెట్రో విస్తరణ, ఫ్యూచర్ సిటీపై కెనడా ప్రతినిధులతో సీఎం కీలక చర్చలు జరిపారు. హరిత ఆర్థిక వ్యవస్థ, సౌర విద్యుత్ రంగాల్లో కెనడా సహకారం కోరారు సీఎం. హైదరాబాద్‌లో కెనడా యూనివర్సిటీల మల్టీ-క్యాంపస్



ఏర్పాటు ప్రతిపాదన చేశారు. ఐటీ, లైఫ్ సైన్సెస్, డిఫెన్స్, ఏరోస్పేస్‌లో తెలంగాణ - మిగతా3లో

వార్తాతరంగాలు



## సంపాదకీయం

# ఆరేళ్లలో 67 లక్షల సైబర్ నేరాలు

ప్రపంచం మొత్తం మీద డిజిటల్ డేటాలో భారతదేశం ఇప్పుడు 20 శాతానికి చేరుకుంది. డిజిటల్ చెల్లింపులు, స్మార్ట్‌ఫోన్ వినియోగం విపరీతంగా పెరగడంతో సైబర్ నేరాలు కూడా భారీగా పెరుగుతున్నాయి. సైబర్ నేరగాళ్లు కృత్రిమ మేధస్సు (ఎఐ), డీప్‌ఫేక్ టెక్నాలజీ ఉపయోగించి వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌లతో ప్రజలను మోసగిస్తున్నారు. కొన్ని కోట్లు కొల్లగొడుతున్నారు. 2019- 2025 వరకు 67.32 లక్షల సైబర్ నేరాల కేసులు నమోదయ్యాయి. వీటిలో రెండింట మూడొంతులు అంటే 43.22 లక్షల కేసులు గత రెండేళ్ల లోనే నమోదు కావడం గమనార్హం. గత ఆరేళ్లలో సైబర్ మోసాల ద్వారా సుమారు రూ. 55,000 కోట్లు బాధితులు నష్టపోయారు. అంటే ప్రతి ఐదు రూపాయల్లో నాలుగు రూపాయలు సైబర్ మోసాల ఖాతాకే చేరాయి. అంతేకాదు అశ్లీల పదజాలం కూడా ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లద్వారా వ్యాప్తి చెందుతోంది.రేప్ వీడియో, చైల్డ్ వీడియో ద్వారా పిల్లలకు సంబంధించిన అసభ్యకరమైన పదజాలంతో పెయిడ్ యాడ్స్ కనిపించాయని వాటిని క్లిక్ చేసిన వినియోగదారులు టెలిగ్రామ్ ఛానెళ్లకు మళ్లించి ఆ వీడియోలను విక్రయిస్తున్నారని ఓ మీడియా సంస్థ బయటపెట్టగా ప్రభుత్వం స్పందించి ఆ కంటెంట్‌ను వెంటనే తొలగించాలని సంబంధిత మెటా సంస్థను గట్టిగా హెచ్చరించింది. ఇలాంటి సంఘటనలు చాలా పెద్ద సమస్యలో ఓ చిన్నభాగం మాత్రమే. రోజురోజుకూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతుండగా, అంతకన్న వేగంగా సైబర్ నేరాలు పెరుగుతున్నాయి. వీటి నియంత్రణకు ప్రత్యేక నియంత్రణ చట్టాన్ని పరిశీలిస్తోంది. ఇప్పటివరకు డీప్‌ఫేక్స్, ఇతర సమస్యలను నివారించడానికి ప్రభుత్వం ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ (ఐటి)చట్టంపై ఆధారపడుతూ వచ్చింది అయితే ఎఐ వ్యవస్థలు కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి, సాంకేతికతను సురక్షితంగా మార్చడానికి ప్రత్యేకమైన చట్టాన్ని తీసుకు రావాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రపంచం లోనే అతిపెద్ద డిజిటల్ పర్యావరణ వ్యవస్థ మనకు ఏర్పాటైంది. ఇందులో ఆధార్, యుపిఐ, ఓఎన్‌డిసి వ్యవస్థలు ఇమిడి ఉన్నాయి. ఆధార్ వల్ల ప్రజల గుర్తింపు స్థిరీకరణ జరగడమే కాక, ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు నేరుగా చేరడానికి ఉపయోగపడుతుంది. యుపిఐ అన్నది తక్షణ చెల్లింపుల వ్యవస్థ. స్మార్ట్‌ఫోన్ ద్వారా చిల్లర వ్యాపారం నుండి పెద్దపెద్ద లావాదేవీల వరకు సెకన్లలో డబ్బులు పంపడానికి, స్వీకరించడానికి తోడ్పడుతోంది. ఓఎన్‌డిసి వాణిజ్య రంగాన్ని వికేంద్రీకరించడానికి ప్రభుత్వం అమలు చేస్తున్న ఓపెన్ నెట్‌వర్క్. దీని ద్వారా చిన్న వ్యాపారులు, స్థానిక విక్రేతలు, కూడా డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు విక్రయించవచ్చు. ఈ ప్లాట్‌ఫారాలన్నీ సామాన్యుల దైనందిన జీవితాన్ని ఎంతో సులభతరం చేశాయి. ఇవి పాలనా వ్యవహారాలను, ఆర్థిక సదుపాయాలను అందుబాటులోకి తీసుకొచ్చాయి.ఈ సౌకర్యాలు ఎలా ఉన్నా డిజిటల్ దాడులు విస్తరించే ప్రమాదాలు కూడా పెరిగాయి. కృత్రిమ మేధస్సు సహాయంతో జరిగే సైబర్ దాడులను గుర్తించడం, వాటిని నివారించడం చాలా కష్టంగా మారుతోంది. ఈ దాడులు బ్యాంకింగ్, టెలికమ్యూనికేషన్స్, రక్షణ (డిఫెన్స్), విద్యుత్, ఆరోగ్య భద్రతరంగాలకు తీవ్రమైన ముప్పును కలిగిస్తున్నాయి. కృత్రిమ మేధస్సు ఆధారంగానే సైబర్ నేరగాళ్లు అత్యంత నమ్మదగిన ఫిషింగ్ ఈ మెయిల్స్, డీప్‌ఫేక్ వీడియోలు, నకిలీ గుర్తింపులు, అధునాతన మాల్వేర్‌ను సృష్టిస్తున్నారు. సైబర్ సెక్యూరిటీ కనిపెట్టలేని విధంగా నిరంతరం తమ కోడ్‌ను మార్చుకునే మాల్‌వేర్‌ను సృష్టిస్తున్నారు. ఇప్పుడు అందుబాటులో ఉన్న ఎఐ టూల్స్ సహాయంతో హ్యాకర్లు సాఫ్ట్‌వేర్‌లో లోపాలను అందరికన్నా ముందుగానే పసిగట్టి దాడులకు పాల్పడుతున్నారు. వీటిని నివారించడం సైబర్ సెక్యూరిటీ నిపుణులకు పెద్ద సవాలుగా మారింది. సైబర్ ముప్పులను నివారించడానికి ప్రభుత్వం అనేక ఆవిష్కరణలను ప్రవేశపెట్టింది. ఇండియా ఎఐ మిషన్‌తోపాటు ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సిఇఆర్‌టి ఇన్) వ్యవస్థను బలోపేతం చేసింది. జీరో ట్రస్ట్ అనే పద్ధతిని స్వీకరించింది.సాధారణ భద్రత విధానాల్లో ఒకసారి నెట్‌వర్క్ లోకి ప్రవేశించిన ఎవరినైనా లేదా ఏదైనా పరికరాన్ని నమ్ముతారు. కానీ జీరో ట్రస్ట్ విధానంలో, నెట్‌వర్క్ లోపల ఉన్నా లేదా బయట ఉన్నా ఎవరినీ గుడ్డిగా నమ్మరు. ఆ వినియోగదారుడి పనికి అవసరమైన డేటా, ఫైల్స్ లేదా అప్లికేషన్‌కు మాత్రమే అనుసంధానం కలుగుతుంది. దీనివల్ల డేటా రక్షణ కలుగుతుంది. సైబర్ దాడుల నుండి డేటాను కాపాడుకోడానికి ప్రభుత్వ ఏజెన్సీలు సిఇఆర్‌టి ఇన్ వంటి సంస్థలు భద్రతా లోపాలను గంటల వ్యవధి లోనే పరిష్కరించాలన్న నిబంధనలు తీసుకు వస్తున్నారు. భారత్ ఏ దేశంపై ఆధారపడకుండా ఇప్పుడు స్వంతంగా కృత్రిమ మేధస్సు సాంకేతికతను అభివృద్ధి చేస్తోంది. రూ.10,300 కోట్లకు పైగా బడ్జెట్‌తో కేంద్ర ప్రభుత్వం ఇండియా ఎఐ మిషన్‌ను ప్రారంభించింది. లక్షలాది మందికి ఉపయోగపడేలా జిపియు కంప్యూటింగ్ (గ్రాఫింగ్ ప్రాసెసింగ్ యూనిట్), స్టార్టప్ ఫండింగ్ వ్యవస్థలను అందుబాటు లోకి తెస్తోంది. ఏదేమైనా ఈ ప్రయత్నాలన్నీ విచ్ఛిన్నంగానే ఉంటున్నాయి. 2024లో దేశవ్యాప్తంగా మొత్తం 1,01,118 సైబర్ నేరాలు నమోదయ్యాయి. కాగా తెలంగాణలో వాటి సంఖ్య 27,230. అంటే తెలంగాణ వాటానే 27%గా నమోదయింది. రాష్ట్రంలో రోజుకు సగటున 75 సైబర్ నేరాల కేసులు నమోదవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. ఇదే తరహాలో కర్ణాటకలో 21,993 కేసులు నమోదై రెండోస్థానంలో నిలిచింది. సైబర్ నేరాల్లో ఆర్థిక మోసాల బారిన పడుతున్న బాధితుల్లో తెలంగాణ వాసులు దేశంలోనే మొదటిస్థానంలో ఉన్నట్టు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.క్రైమ్‌రేట్ ఏకంగా 71.1 : ఒకవైపు సైబర్ నేరగాళ్ల ముఠాలు తెలంగాణ వాసుల్నే లక్ష్యంగా చేసుకొని ఆర్థిక దోపిడీకి పాల్పడుతుంటే మరోవైపు అభియోగాల నమోదు రేటు అధమ స్థానంలో ఉండటం విస్తుగొలుపుతోంది. జనాభా ఆధారంగా రాష్ట్రంలో క్రైమ్‌రేట్‌ను పరిగణనలోకి తీసుకుంటే ఏకంగా 71.1గా నమోదు అయింది. రెండోస్థానంలో ఉన్న కర్ణాటకలో అది 32.2. దేశవ్యాప్త సగటు 7.4 మాత్రమే ఉంది. రాష్ట్రంలో సైబర్ నేరాల తీవ్రత విషయంలో పోలీస్‌శాఖ వాదన మరోలా వినిపిస్తోంది. తమకు అందుతున్న ప్రతీ ఫిర్యాదుపై కేసు నమోదు చేస్తుండటంతోనే కేసుల సంఖ్య ఎక్కువగా కనిపిస్తోందని పోలీసులు చెబుతున్నారు. ఏదేమైనా కేసుల నమోదులో ప్రథమ స్థానంలో ఉన్న తెలంగాణ పోలీసులు అభియోగపత్రాల నమోదు రేటులో మాత్రం ఘోరంగా విఫలమవుతున్నట్లు గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. రాష్ట్రంలో ఈ సగటు కేవలం 16.2 కాగా దేశవ్యాప్త సగటు ఏకంగా 31.6గా నమోదయింది.వీటికి సంబంధించిన ఏజెన్సీలు వేటికి అవే స్వతంత్రంగా పనిచేస్తున్నాయి తప్ప సమన్వయం కనిపించడం లేదు. ఇండియన్ సైబర్ క్రైమ్ కో ఆర్డినేషన్ సెంటర్ (14 సి)ను బలోపేతం చేయడం ద్వారా కేంద్రానికి రాష్ట్రాలకు మధ్య సమన్వయం పెరిగి సైబర్ బెదిరింపుల ముప్పును ఎదుర్కోగలుగుతారు. భారత దేశం తన ఎఐ వ్యూహంలో కేవలం సాంకేతికతను అభివృద్ధి చేయడమే కాక, దానిని సైబర్ దాడుల నుండి రక్షించుకునే సామర్థ్యాన్ని కూడా పెంపొందించుకోవడం తప్పనిసరి

# ఉగ్రామ్ అద్భుతం...

### తెలంగాణ స్టార్టప్ రెడీ

**హైదరాబాద్, జూలై 8:**తెలంగాణకు చెందిన రక్షణ స్టార్టప్ 'ద్వీప డిఫెన్స్' డీఆర్డీవోతో కలిసి అద్భుతం చేసింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత స్వదేశీ ఆయుధాల తయారీపై డీఆర్డీవో దృష్టి పెట్టింది. ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా కేంద్రం కూడా రక్షణ బడ్జెట్ పెంచింది. ఈ నేపథ్యంలో తెలంగాణకు చెందిన స్టార్టప్ 7.62ఐ51 ఎంఎం క్యాలిబర్‌లో ఉగ్రం(ఖ+=ూవీ) అనే దేశీ రైఫిల్‌ను అభివృద్ధి చేసింది. ఈ ప్రాజెక్టును కేవలం 100 రోజుల్లోనే డిజైన్ చేసి, నమూనా తయారు చేయడం రక్షణ రంగంలో వేగాన్ని పెంచింది. సాధారణంగా ఆయుధాల అభివృద్ధికి సంవత్సరాలు పట్టే పరిస్థితుల్లో ఈ వేగం ఆత్మనిర్భర భారత్ లక్ష్యానికి బలం చేకూర్చుతోంది.ఉగ్రమ్ రైఫిల్ భారత సైన్యం, కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నిర్వహించిన కఠినమైన పరీక్షలను విజయవంతంగా పూర్తి చేసింది. దీంతో కేంద్ర సాయుధ పోలీసు బలగాలు ఈ రైఫిల్‌ను తమ ఆయుధభండారంలో చేర్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాయి. సాధారణంగా విదేశీ ఆయుధాలపై ఆధారపడే సీఏపీఎఫ్‌కు దేశీ రైఫిల్ అందుబాటులోకి రావడంతో ఖర్చు



తగ్గడం, సరఫరా భద్రత పెరగడం, నిర్వహణ సౌలభ్యం వంటి ప్రయోజనాలు ఏర్పడతాయి.డీఆర్డీవోకి చెందిన ఆయుధ పరిశోధన, అభివృద్ధి సంస్థతో స్టార్టప్ సంయుక్తంగా పని చేయడంతో ఈ వేగం సాధ్యమైంది. ప్రైవేట్‌రంగ స్టార్టప్‌లు తమ సౌలభ్యం, ఆవిష్కరణ సామర్థ్యం, త్వరిత నిర్ణయాలతో డీఆర్డీవో సాంకేతిక నైపుణ్యాన్ని మిళితం చేస్తున్నాయి. ఇది రక్షణ రంగంలో ప్రైవేట్ భాగస్వామ్యం ఎంత ముఖ్యమో చాటుతోంది. 100 రోజుల్లో డిజైన్ నుంచి నమూనా వరకు పూర్తి చేయడం భవిష్యత్తులో అత్యవసర అవసరాలకు త్వరితంగా స్పందించే సామర్థ్యాన్ని నిరూపిస్తోంది.ఈ విజయం రక్షణ రంగంలో దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. సీఏపీఎఫ్‌కు వంటి పెద్ద సంఖ్యలో ఆయుధాలు అవసరమయ్యే బలగాలకు స్థానికంగా ఉత్పత్తి అయ్యే రైఫిల్‌లు అందుబాటులోకి రావడం వల్ల దేశీయ ఉత్పత్తి, ఉపాధి అవకాశాలు పెరుగుతాయి. తెలంగాణ వంటి రాష్ట్రాల్లో రక్షణ స్టార్టప్‌లు వృద్ధి చెందడం దేశవ్యాప్తంగా రక్షణ తయారీ పర్యావరణ వ్యవస్థను బలపరుస్తోంది.ఉగ్రం విజయం తర్వాత ఇలాంటి స్టార్టప్‌లు మరిన్ని ఆయుధాలు, సామగ్రి అభివృద్ధిలో ముందుకు రావడానికి మార్గం సుగమం అవుతోంది. డీఆర్డీవోతో సహకారం కొనసాగితే, భారత్ రక్షణ రంగంలో ప్రపంచ స్థాయి ఆవిష్కరణలు సాధించే అవకాశాలు పెరుగుతాయి. ఈ మోడల్ ఇతర రంగాల్లో కూడా ప్రైవేట్ రంగం, ప్రభుత్వ సంస్థల మధ్య సహకారానికి ఆదర్శంగా నిలుస్తుంది.

# కాక్ రోచ్ ఈజ్ బ్యాక్

**హైదరాబాద్, జూలై 8:**సోషల్ మీడియాలో సంచలనం సృష్టించిన 'కాక్రోచ్ జనతా పార్టీ ఎక్స్ ఖాతాను పునరుద్ధరించాలని ఢిల్లీ హైకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సీజేపీ ఎక్స్ ఖాతాను బ్లాక్ చేస్తూ కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేస్తూ న్యాయస్థానం కీలక తీర్పు వెలువరించింది. నీట్ పునఃపరీక్ష పూర్తయిన నేపథ్యంలో ఖాతాను బ్లాక్ చేయాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది.ఈ కేసును జస్టిస్ స్వర్ణ కాంత శర్మ విచారించారు. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ, నీట్ రీ-ఎగ్జామినేషన్ సందర్భంగా విద్యార్థులు, తల్లిదండ్రుల్లో గందరగోళం తలెత్తకుండా ఉండేందుకే సీజేపీ ఎక్స్ ఖాతాను తాత్కాలికంగా బ్లాక్ చేసినట్లు కోర్టుకు తెలిపారు. లక్షలాది మంది విద్యార్థులు హాజరయ్యే జాతీయ స్థాయి పరీక్ష సమయంలో సోషల్ మీడియాలో వ్యాప్తి చెందే పోస్టులు పరీక్ష నిర్వహణపై ప్రభావం చూపే అవకాశం ఉందని కేంద్రం భావించిందని వివరించారు.కేంద్రం జారీ చేసిన బ్లాకింగ్ ఉత్తర్వును సవాల్ చేస్తూ సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే హైకోర్టును ఆశ్రయించారు. ఆయన తరఫు న్యాయవాదులు, సోషల్ మీడియా ఖాతాను నిలిపివేయడం భావ ప్రకటన స్వేచ్ఛకు విరుద్ధమని వాదించారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు, ప్రస్తుత పరిస్థితుల్లో ఖాతాను బ్లాక్ చేయడానికి ఎలాంటి కారణం లేదని తేల్చింది. నీట్ పునఃపరీక్ష ఇప్పటికే పూర్తయినందున కేంద్రం వ్యక్తం చేసిన ప్రాథమిక ఆందోళనకు ఇప్పుడు ప్రాధాన్యం లేదని పేర్కొంది.

**కొనసాగుతున్న సోనమ్ వాంగ్‌చుక్ దీక్ష**

మరోవైపు, విద్యా వ్యవస్థలో పారదర్శకత కోసం సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ చేపట్టిన నిరవధిక నిరాహార దీక్ష కూడా కొనసాగుతోంది. జంతర్ మంతర్ వద్ద సీజేపీ ఆధ్వర్యంలో నిరసనలు కొనసాగుతున్నాయి. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలన్న డిమాండ్‌తో నిరసనకారులు తమ ఉద్యమాన్ని కొనసాగిస్తున్నారు. నిరాహార దీక్ష ప్రారంభించిన తర్వాత సోనమ్ వాంగ్‌చుక్ ఆరోగ్యం క్షీణించినట్లు వైద్యులు వెల్లడించారు. ఆయన బరువు 7.3 కిలోలు తగ్గినట్లు తాజా వైద్య నివేదికల్లో పేర్కొన్నారు. రక్తపోటు 102/61 ఎంఎంహెచ్‌జీగా, రక్తంలో గ్లూకోజ్ స్థాయి 68 ఎంజీ/డీఎల్‌గా నమోదైనట్లు తెలిపారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తోందని నిర్వాహకులు వెల్లడించారు.దీర్ఘకాల నిరాహార దీక్ష ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉన్నప్పటికీ, తమ డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని నిరసనకారులు స్పష్టం చేశారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలు, పరీక్షల నిర్వహణలో పారదర్శకత, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని వారు మరోసారి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. హైకోర్టు తాజా తీర్పుతో సీజేపీ ఎక్స్ ఖాతా పునరుద్ధరణకు మార్గం సుగమం కాగా, భావ ప్రకటన స్వేచ్ఛ,




ప్రభుత్వ నియంత్రణ అధికారాలపై మరోసారి చర్చ ప్రారంభమైంది.కాగా సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోర్టుకు వివరించిన ప్రకారం, జూన్ 21న జరిగిన నీట్ రీ-టెస్ట్‌కు ముందు విద్యార్థుల్లో అనవసర ఆందోళనలు, అపోహలు వ్యాపించే అవకాశం ఉందనే ఉద్దేశంతోనే కేంద్రం ఈ చర్య తీసుకుంది. పరీక్ష నిర్వహణకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని ఆయన తెలిపారు. దాంతో మే 21న దాని అసలు ఎక్స్ ఖాతాను భారతదేశంలో నిలిపివేశారు. అనంతరం ఈ బృందం »Cockroach Is Back' పేరుతో మరో కొత్త ఎక్స్ ఖాతాను ప్రారంభించింది. ప్రస్తుతం ఆ ఖాతాకు రెండు లక్షల 27 వేలకుపైగా ఫాలోవర్లు ఉన్నారు.

# పవన్ వీరాభిమాని మృతి...

**వరంగల్, జూలై 8:**అభిమానిని కలవడానికి స్టార్ హీరోగా కాదు.. ఆప్తుడిలా అతడి ఇంటి గుమ్మం దాటారు పవన్ కళ్యాణ్. మంచానికే పరిమితమైన ఆ బాలుడి చేతిని పట్టుకుని ధైర్యం చెప్పారు. "మనిద్దరం కలిసి ూ+ సినిమా చూద్దాం.. ూ+ 2 వస్తే నువ్వే నా స్పెషల్ గెస్ట్" అని ప్రేమగా మాటిచ్చారు. కానీ ఆ కల నిజమయ్యేలోపే.. ఆ అభిమాని ఈ లోకాన్ని విడిచిపెట్టాడు.హనుమకొండ హనుమాన్ నగర్‌కు చెందిన 17 ఏళ్ల పొనుగంటి నిరంజన్ గత కొంతకాలంగా అరుదైన న్యూరోమస్క్యులర్ జన్యు వ్యాధితో పోరాడుతున్నాడు. చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో చేరిన అతడి ఆరోగ్యం రోజురోజుకూ క్షీణించింది. వైద్యుల ప్రయత్నాలు ఫలించక బుధవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచాడు. ఈ వార్తతో కుటుంబ సభ్యులతో పాటు స్థానికులు, పవన్ కళ్యాణ్ అభిమానులు తీవ్ర దిగ్భ్రాంతికి గురయ్యారు.నిరంజన్‌కు పవన్ కళ్యాణ్ అంటే ప్రాణం. పవన్ పాటలు, డైలాగ్‌లతో చేసిన అతడి వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఆ విషయం పవన్ దృష్టికి చేరింది. వెంటనే జూన్ 17న స్వయంగా అతడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. కొద్దిసేపు అతడి పక్కనే కూర్చుని మాట్లాడారు. ప్రేమగా హత్తుకుని ధైర్యం చెప్పారు. "అందరూ నన్ను 'చోటా గబ్బర్ సింగ్' అని పిలుస్తారు" అని నిరంజన్ చెప్పినప్పుడు పవన్ కూడా చిరునవ్వుతో ఆనందం వ్యక్తం చేశారు.వెళ్లే ముందు బహుమతులు, తిరుమల శ్రీవారి ప్రసాదాలను అందిస్తూ త్వరలో మళ్లీ కలుద్దామని చెప్పారు. తనకు కుక్కపిల్లను పెంచుకోవాలని ఉందని నిరంజన్ చెప్పగా.. ఆరోజే కుక్క పిల్లను అందించారు. అయితే ఆ ఆప్యాయ భేటీ జ్ఞాపకంగా మిగిలిపోగా.. కొన్ని రోజులకే నిరంజన్ మృతి చెందడం ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది. ఒక అభిమాని చివరి కోరికను నెరవేర్చాలని కోరుకున్న హీరో.. ఇప్పుడు అదే అభిమానిని కోల్పోవాల్సి రావడం అభిమానులను తీవ్ర భావోద్వేగానికి గురిచేస్తోంది.

# ఎస్ఐఆర్ కార్యక్రమం పై కలెక్టర్ సమావేశం

**ఖమ్మం:**ఖమ్మంకలెక్టరేట్ మిటింగ్ హాల్ నందు జిల్లాకలెక్టర్ దివాకర టిఎస్, అదనపు కలెక్టర్ పి.శ్రీజ, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ లతో కలిసి బుధవారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం పై సమావేశం నిర్వహించారు.ప్రతి అర్హమైన పౌరుడి ఓటు హక్కును పరిరక్షిస్తూ, ఓటరు జాబితాలను మరింత పారదర్శకంగా, ఖచ్చితంగా రూపొందించడమే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. జిల్లాలోని ప్రతి ఓటరుకు ఎన్యూమరేషన్ ఫారాలను దాదాపు పంపిణీ పూర్తి చేశామని, వాటిని తిరిగి సేకరించి ఆన్లైన్లో నమోదు చేసే డిజిటైజేషన్ ప్రక్రియను చేపట్టామని వెల్లడించారు. ఈ కార్యక్రమం విజయవంతం కావాలంటే రాజకీయ పార్టీలు, బూత్ లెవల్ ఏజెంట్లు (దీూాం), బూత్ లెవల్ అధికారులు (దీూాం), ప్రజలు సమిష్టిగా సహకరించాలని కోరారు.గ్రామ పంచాయతీలు, మున్సిపల్ వార్డుల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ప్రతి ఓటరికి ఎస్ఐఆర్ ప్రక్రియపై పూర్తి సమాచారం చేరేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఓటర్లు ఇంటి వద్ద




అందుబాటులో ఉండి తమ వ్యక్తిగత వివరాలను సక్రమంగా అందించడం ద్వారా ఎన్నికల జాబితాల శుద్ధీకరణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.అన్మ్యాప్డ్ ఓటర్లు నిర్దేశించిన 11 ధృవీకరణ పత్రాల్లో ఏదో ఒక పత్రాన్ని సమర్పించాలని, అవసరమైన పత్రాలు సమర్పించిన వారి దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించేలా ఎన్నికల యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు. ముసాయిదా ఓటరు జాబితాలో పేరు లేకపోయినా, వివరాల్లో పొరపాట్లు ఉన్నా తప్పనిసరిగా అభ్యంతరాలు నమోదు చేయాలని, లేనిపక్షంలో ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉంటుందని ప్రజలకు సూచించారు. అర్హత కలిగిన ప్రతి ఓటరు జాబితాలో ఉండేలా, ఎవరి ఓటు హక్కు కోల్పోకుండా చూసే బాధ్యత అందరికీ ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు.రాజకీయ పార్టీలు తమ ప్రతి బీఎల్ఏ సంబంధిత పార్టీ జారీ చేసిన గుర్తింపు కార్డు కలిగి ఉండాలని తెలిపారు. బీఎల్వోలు, బీఎల్ఏలు పరస్పర సమన్వయంతో పనిచేసి సమస్యలు, సందేహాలను వెంటనే ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో బీఎల్వోలకు అదనపు సహాయక సిబ్బందిని కూడా నియమించినట్లు వెల్లడించారు.ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా పునాది అని, ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు, రాజకీయ పార్టీలు, ఎన్నికల సిబ్బంది అందరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ పిలుపునిచ్చారు.

# మిట్టపల్లి బాలికల పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

**సిద్దిపేట:**రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు వడ్డించాలని జిల్లా కలెక్టర్ కె. హైమావతి గురుకుల యాజమాన్యాలను ఆదేశించారు.సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామ శివారులోని తెలంగాణ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల మరియు జూనియర్ కళాశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్నం, వెజిటేబుల్ బిర్యానీ, ఆలుగడ్డ తమాట, ఫ్రైడ్ గుడ్డు కూర, సాంబారు, పెరుగు లను పరిశీలించారు. వెజిటేబుల్ బిర్యాని నాణ్యత పరిశీలిస్తూ బిర్యానీ నాణ్యత చాలా బాగుందని అభినందించారు. ఇలాగే రోజు వారిగా కామన్ డైట్ మెనూ పాటిస్తున్నారా, చేసిన ప్రతి వంటకం రుచిగా ఉంటుందా అనీ ఆరా తీశారు. విద్యార్థుల హాజరు ప్రకారం కూరగాయలు, వంట సరుకులు కొలత ప్రకారం తీసుకోవాలని, ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, సాయంత్రం స్నాక్స్, రాత్రి భోజన ప్రక్రియను ప్రిన్సిపల్ లేదా ఒక ఉపాధ్యాయులు పర్యవేక్షణ చెయ్యాలని ఆదేశించారు. వంటగది, డైనింగ్ హాల్ పరిసర ప్రాంతాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా గురుకుల ప్రాంగణం మొత్తం పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఎక్కడ కూడా నీటి నిలువలు ఉండకుండా, దోమలు ఈగలు రాకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి సీజనల్ వ్యాధుల బారిన పడకుండా అవగాహన కల్పించాలని ప్రిన్సిపల్ మరియు ఉపాధ్యాయులను ఆదేశించారు.

వార్తాతరంగాలు


# అలక పాన్పు ఎక్కిన కొండా



**వరంగల్, జూలై 8:** తెలంగాణ అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలు, ఉమ్మడి వరంగల్ జిల్లా నేతల మధ్య దశాబ్దాలుగా నడుస్తున్న రాజకీయ వైరం ఇప్పుడు అధికారికంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దకు చేరింది. లంగాణ మంత్రి కొండా సురేఖ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. తన శాఖలో ఎమ్మెల్యేల జోక్యాన్ని కొండా సురేఖ ఆమె ప్రస్తావించారు. తాను పర్యవేక్షిస్తున్న దేవాదాయ శాఖ లో ఎమ్మెల్యే కడియం శ్రీహరి సమీక్షలు చేయడం ఏంటని లేఖలో ప్రశ్నించారు. మంత్రిత్వ శాఖలో ఎమ్మెల్యేల జోక్యం ఏమిటని కొండా సురేఖ నిలదీశారు. దీనిపై క్రమశిక్షణ కమిటీ చేత విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆమె కోరారు. కడియం శ్రీహరి సమీక్షలు చేస్తూ... ఇతరులు సమీక్షలు చేయడం వల్ల మంత్రిత్వ శాఖలో గోప్యత ఉండదని, దాని వల్ల మంత్రులకే కాకుండా ప్రభుత్వానికి కూడా ఇబ్బందిగా మారతాయని కొండా సురేఖ రేవంత్ రెడ్డికి రాసిన లేఖలో పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను ఆదిలోనే తుంచి వేయకపోతే ప్రతి ఒక్కరూ ప్రతి మంత్రిత్వ శాఖలోజోక్యం చేసుకునే ప్రమాదం ఉందని కూడా కొండా సురేఖ ఆందోళన వ్యక్తం చేశారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రిగా ఉన్న తనను పూర్తిగా విస్మరించి, తన శాఖా పరిధిలో స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అధికారిక సమీక్షా సమావేశం నిర్వహించడంపై మంత్రి కొండా సురేఖ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మేరకు జూలై 7, 2026 నాటి అధికారిక లేఖ ద్వారా ఆమె సీఎం రేవంత్ రెడ్డికి నేరుగా ఫిర్యాదు చేస్తూ.. కడియం శ్రీహరిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయడం రాష్ట్ర రాజకీయాల్లో సంచలనం రేపుతోంది. ఈ వివాదానికి అసలు కారణం.. జూలై 6వ తేదీన హైదరాబాద్ బొగ్గులకుంటలోని దేవాదాయ శాఖ కమిషనర్ కార్యాలయంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి నిర్వహించిన ప్రత్యేక సమావేశమే. మంత్రి సురేఖకు గానీ, ఆమె కార్యాలయానికి గానీ ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా.. కడియం శ్రీహరి నేరుగా దేవాదాయ శాఖ డైరెక్టర్, ఇతర ఉన్నతాధికారులను పిలిపించుకుని పలు దేవాలయాల అభివృద్ధిపై సమీక్ష జరిపారు. అంతేకాకుండా, మాస్టర్ ప్లాన్ల రూపకల్పన, ప్రత్యేక అధికారుల బృందం ఏర్పాటు, ఒక నెల రోజుల్లో సమగ్ర నివేదిక సమర్పించాలంటూ అధికారులకు ఎమ్మెల్యే స్థాయిలోనే ఆదేశాలు జారీ చేయడంపై కొండా సురేఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. మాస్టర్ ప్లాన్లు, అధికారుల కమిటీల ఏర్పాటు వంటివి పూర్తిగా శాఖా మంత్రి స్థాయిలో నిర్ణయించాల్సిన అంశాలు. ఒక ఎమ్మెల్యే ఇలా సమీక్ష చేయడం ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థలో అనుచిత సంప్రదాయం. ఇది కేవలం పరిపాలనా లోపం కాదు, నా రాజ్యాంగబద్ధ అధికారాలను బహిరంగంగా ప్రశ్నించే ప్రయత్నం అని కొండా సురేఖ లేఖలో సీఎంకు కుండబద్దలు కొట్టారు.

నా దేవాదాయ శాఖలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి జోక్యం సరికాదు

**నాకు సమాచారం ఇవ్వకుండా అధికారులతో కడియం శ్రీహరి సమీక్ష జరిపాడు**

**ప్రభుత్వ పరిపాలన వ్యవస్థ విశ్వసనీయతకు సంబంధించిన అంశం కాబట్టి...**

ఈ లేఖ ద్వారా వరంగల్ జిల్లా కాంగ్రెస్‌లో ఉన్న పాత గ్రూపు రాజకీయాలు మరోసారి బట్టబయలయ్యాయి. గతంలో కూడా తన వ్యక్తిగత, రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు కడియం శ్రీహరి ఉమ్మడి వరంగల్ జిల్లా నేతలను రెచ్చగొట్టి నాపై దుష్ప్రచారం చేయించారని, ఆ కుటిల ప్రయత్నాలు విఫలమయ్యాయని సురేఖ నేరుగా సీఎంకు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి వచ్చిన కడియం శ్రీహరికి పార్టీలో విపరీతమైన ప్రాధాన్యత ఇస్తూ.. కనీసం సీనియర్ మంత్రి అయిన తన శాఖలోనే జోక్యం చేసుకునేలా ప్రోత్సహించడంపై ఆమె తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది. దేవాదాయ శాఖ మంత్రికి సమాచారం లేకుండా ఎమ్మెల్యే ఎలా సమీక్ష నిర్వహిస్తారనే దానిపై కడియం శ్రీహరి నుంచి వివరణ కోరాలని, ప్రజాప్రతినిధులకు స్పష్టమైన మార్గదర్శకాలు ఇవ్వాలని ఆమె కోరారు. ఈ ఫిర్యాదుకు సంబంధించిన ప్రెస్ నోట్, ఫోటోలు, దినపత్రిక క్లిప్పింగులను కూడా సీఎంకు జతపరిచారు. ఒకవైపు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ ఎన్నికలు దగ్గరపడుతున్న వేళ.. సీనియర్ లీడర్లు అయిన కొండా సురేఖ, కడియం శ్రీహరి మధ్య ఈ లేఖాస్త్రాల యుద్ధం ఎటు దారితీస్తుందో, దీనిపై సీఎం రేవంత్ రెడ్డి ఎలా స్పందిస్తారో అన్నది ఇప్పుడు కాంగ్రెస్ వర్గాల్లో ఉత్కంఠ రేపుతోంది.

## గ్రేటర్ ఎన్నికల నేపథ్యంలో ఓవైసీ వ్యూహం..

- మొదటి పేజీ తరువాయి

కలెక్టరేట్ సంబంధిత విభాగాలు, వక్ఫ్ బోర్డ్ ప్రాంతీయ కార్యాలయాలు, పోలీస్ నిర్వహణ కార్యాలయాలు, మార్కెటింగ్ శాఖ నోడల్ కార్యాలయాలు ఉన్నాయి. పాతనగరంలోని ఇరుకైన రోడ్లు, అధిక జనసాంద్రత వల్ల రోజూ ట్రాఫిక్ జామ్‌లు ఏర్పడుతున్నాయి. కొత్త ప్రాంతాల్లో విశాలమైన రోడ్లు, మెరుగైన కనెక్టివిటీ, ఆధునిక సౌకర్యాలు ఉండటం వల్ల పరిపాలన సౌలభ్యం పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది. శివార్ల అభివృద్ధి ద్వారా నగరం మొత్తం సమతుల్యంగా వృద్ధి చెందాలనేది లక్ష్యంఓవైసీ ఇలా జోన్ల వారీగా అసంతృప్తిని బయటపెడుతున్నారనేది బలమైన రాజకీయ కారణాలు ఉన్నాయి. పాతనగరం ఎంఐఎంకు ఎప్పటి నుంచో బలమైన ఆధారం. అయితే వెస్ట్ జోన్‌లో ఐటీ కారిడార్ విస్తరణ వల్ల మెహదీపట్నం, కార్వాన్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి వంటి ప్రాంతాల్లో జనాభా మార్పులు పార్టీకి కొత్త సవాళ్లను తెస్తున్నాయి. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన ఉద్యోగులు, కుటుంబాలు నివసించడం వల్ల స్థానిక సంప్రదాయ ఓటర్ల నిష్పత్తి మారుతోంది. ఈ ప్రాంతాల నుంచి ప్రభుత్వ కార్యాలయాలు లేదా వ్యాపార కేంద్రాలు శివార్లకు తరలిపోతే, స్థానిక మైనారిటీల ఆర్థిక వనరులు దెబ్బతినడమే కాక, చిన్న వ్యాపారులు, రోజువారీ కూలీలు ప్రభావితమవుతారు. గుడిమాల్కాపూర్ వంటి సాంప్రదాయ మార్కెట్లు స్థానిక ఆర్థిక వ్యవస్థకు ముఖ్యమైనవి. అందుకే ప్రభుత్వం సౌత్, వెస్ట్ హైదరాబాద్‌ను ఉద్దేశపూర్వకంగా నిర్లక్ష్యం చేస్తోందనే భావోద్వేగ అంశాన్ని ఉపయోగిస్తున్నారు. సాధారణ పరిపాలనా మార్పులను కూడా ప్రాంతీయ వివక్షగా చిత్రీకరించడం ద్వారా, పాతనగరంలోని కొత్త ఓటర్లను, వెస్ట్ హైదరాబాద్‌లోని వ్యాపార వర్గాలను కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏకం చేయాలనేది ఓవైసీ ప్రధాన ప్రణాళిక. నగర అభివృద్ధి అంతా హైటెక్ సిటీ లేదా ఉత్తర హైదరాబాద్ వైపు మాత్రమే జరుగుతోందని, సౌత్-వెస్ట్ ప్రాంతాలను పాలకులు వదిలేస్తున్నారని బలంగా ప్రచారం చేసి, రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికల్లో తమ ఓటు బ్యాంకును రక్షించుకోవడానికి ఈ భౌగోళిక వ్యూహాన్ని అనుసరిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ విధానం ద్వారా స్థానిక సంఘాల్లో ఐక్యతను పెంపొందించి, ప్రత్యర్థి పార్టీల ప్రభావాన్ని తగ్గించాలనేది ఓవైసీ లక్ష్యంగా కనిపిస్తోంది. ఈ వివాదం మరింత రాజకీయ దుమారానికి దారితీసే అవకాశం ఉంది. స్థానిక సంఘాల నుంచి నిరసనలు, ప్రజా ఉద్యమాలు రావచ్చు. ఇదే సమయంలో ప్రభుత్వం మరోవైపు నగరం మొత్తం అభివృద్ధిని నొక్కి చెప్పి, తరలింపు నిర్ణయాలను సమర్థించవచ్చు. ఓవైసీ ఈ అంశాన్ని ఎక్కువగా ఉపయోగిస్తే, ఎన్నికల సమయంలో ఓటర్ల మధ్య చర్చలు ఎక్కువవుతాయి. ఈ చర్చ నగర అభివృద్ధి, ప్రాంతీయ సమతుల్యత, రాజకీయ వ్యూహాల మధ్య సంబంధాన్ని స్పష్టం చేస్తోంది.

# ఆ ఒప్పందం బయటపెడితే రాజీనామాకు సిద్ధం..

**సీఎం రేవంత్‌కు హరీశ్ సవాల్**



**హైదరాబాద్, జులై 8:** కాళేశ్వరం ప్రాజెక్ట్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నెగిటివ్ మైండ్‌సెట్‌తో ఉన్నారని మాజీ మంత్రి హరీశ్ రావు వ్యాఖ్యానించారు. ఈరోజు(బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. సీఎం, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై విరుచుకుపడ్డారు. కన్నెపల్లి మోటార్లు ఆన్ చేయమంటే ఎన్‌డీఎస్ఏ( ) సాకు చెబుతున్నారని.. మరి సమ్మక్క బ్యారేజీ మోటార్లు ఎందుకు ఆన్ చేయడం లేదని ప్రశ్నించారు. ఈ నిమిషానికి సమ్మక్క బ్యారేజీ దగ్గర లక్ష క్యూసెక్కుల ప్రవాహం ఉందని చెప్పుకొచ్చారు. గోదావరి నీళ్లు తీసుకోవాలన్న కనీస సోయి లేదని విరుచుకుపడ్డారు. చెరువులు నింపుకునే అవకాశం ఉన్నా.. నింపడం లేదన్నారు. వరంగల్ జిల్లాలో 90 శాతం చెరువులు ఎండిపోయాయని, దేవాదుల మోటార్లు పూర్తిస్థాయిలో నడపడం లేదని తెలిపారు. మోటార్లు ఆన్ చేయకుండా.. నీళ్లను దిగువకు వదులుతున్నారని అన్నారు. గురుదక్షిణగా తెలంగాణ నీటిని ఏపీకి వదులుతున్నారని ఆరోపించారు. అబద్ధాల్లో రేవంత్‌ను మించినవారు లేరు.. కాంగ్రెస్‌ది నేరపూరిత నిర్లక్ష్యమని మాజీ మంత్రి విమర్శలు గుప్పించారు. నీళ్లు ఉండి కూడా లిఫ్ట్ చేయకపోవడం క్రిమినల్ నెగ్లిజెన్స్ అంటూ వ్యాఖ్యానించారు. క్రిమినల్ నెగ్లిజెన్స్‌కు పాల్పడిన రేవంత్, ఉత్తమ్‌ను ఉరితీసినా తప్పులేదన్నారు. అబద్ధానికి ప్యాంటు షర్ట్ వేస్తే సీఎం రేవంత్ అని.. అబద్ధాల్లో ఆయనను మించినవారు లేరంటూ దుయ్యబట్టారు. నిన్నటి రేవంత్ ప్రసంగంలో సొల్లు తప్ప.. నిజం లేదని అన్నారు. తుమ్మిడిహెట్టికి అనుమతులున్నాయని అబద్ధాలు చెప్పారని.. అనుమతులుంటే తట్టెడు మట్టి ఎందుకు తీయలేదని నిలదీశారు. 8 ఏళ్లు కేంద్రం, రాష్ట్రం, మహారాష్ట్రలో అధికారంలో ఉండి ఎందుకు కట్టలేదని ప్రశ్నించారు. పనులు చేయకుండా తుమ్మిడిహెట్టి పేరిట రూ.2,328కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. నీటి పారుదల మంత్రిగా ఉత్తమ్, సీఎంగా రేవంత్ విఫలం అంటూ వ్యాఖ్యానించారు.

**సీఎం రేవంత్‌కు సవాల్**

'తుమ్మిడిహెట్టికి మహారాష్ట్ర అనుమతి ఇచ్చి ఉంటే అగ్రిమెంట్ బయటపెట్టాలి. ఒప్పందం బయటపెడితే రాజీనామాకు సిద్ధం. లేకపోతే సీఎం రేవంత్ ప్రజలకు క్షమాపణ చెప్పాలి' అని సీఎం రేవంత్ రెడ్డికి హరీశ్ రావు సవాల్ విసిరారు.

## తెలంగాణలో పెట్టుబడులకు కెనడా ఆసక్తి..

- మొదటి పేజీ తరువాయి

పురోగతిని ముఖ్యమంత్రి వివరించారు. తెలంగాణపై కెనడా కంపెనీల విశ్వాసం పెరుగుతోందని సీఎం రేవంత్, క్రిస్ కూటర్ తెలిపారు. ఉద్యోగాల కల్పన, పెట్టుబడుల ఆకర్షణలో తెలంగాణను హైకమిషనర్ ప్రశంసించారు. ఇంధనం, పట్టణాభివృద్ధి, డిఫెన్స్ రంగాల్లో కెనడా ట్రేడ్ డెలిగేషన్ త్వరలో తెలంగాణకు రానుందని వివరించారు. తెలంగాణ అభివృద్ధికి అన్నివిధాలా సహకరిస్తామని కెనడా ప్రతినిధులు హామీ ఇచ్చారు.

**సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన అంతర్జాతీయ ప్రతినిధులు**

సీఎం రేవంత్‌రెడ్డిని అంతర్జాతీయ ప్రతినిధులు కలిశారు. నిలి గిల్బర్ట్ : బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ బోర్డు సలహాదారు, మహేశ్ కొండూరు అమెరికా ప్రభుత్వ సలహాదారు మొమెంటం టెక్నాలజీస్ సీఈఓ, అమిత్ మెహ్రా ఆక్సన్ టెక్నాలజీస్ సీఈఓ, దిలెక్ , నార్వే మాజీ స్టేట్ సెక్రటరీ, థామస్ ఫ్రోలిక్, దక్షిణాఫ్రికా పార్లమెంట్ సభ్యుడు, సెంథిల్ తొండమాన్, సిలోన్ వర్కర్స్ కాంగ్రెస్ అధ్యక్షుడు( శ్రీలంక) సీఎంని కలిసిన వారిలో ఉన్నారు.

## సెంటి మెంట్ తో కమలం వ్యూహం...

- మొదటి పేజీ తరువాయి

జోలికి వెళ్లడం లేదని బీజేపీ నేతలు ఆరోపించారు. ఫాతిమా కళాశాలను ఆక్రమించి నిర్మించారని, దానిని కూల్చివేయడంలో హైడ్రా అధికారులు ఎందుకు మీనమేషాలు లెక్కపెడుతున్నారని ప్రశ్నించారు. కేవలం పేదల ఇళ్లను కూల్చివేయడానికే హైడ్రాను ఏర్పాటు చేసినట్లుందని అభిప్రాయపడ్డారు. హైడ్రా కొందరి నిర్మాణాలనే కూల్చివేస్తుందని, హైకోర్టు ఎన్ని తీర్పులు చెప్పినా హైడ్రా మాత్రం తన వైఖరిలో మాత్రం మార్పు తీ రావడం లేదని బీజేపీ నేతలు అంటున్నారు.. దీనికి ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ ఘాటుగా స్పందించారు. తమను భయపెట్టాలని కొందరు చూస్తున్నారని ఎమ్మెల్యే అక్బరుద్దీన్ ఒవైసీ అన్నారు. బెదిరింపులకు లొంగేది లేదని అన్నారు. ఎంఐఎంకు చెందిన విద్యాసంస్థలను కూల్చివేస్తామని కొందరు బెదిరిస్తున్నారని, కానీ ఇలాంటి బెదిరింపులకు తాము భయపడేది లేదని తెలిపారు. ఫాతిమా కళాశాలపై ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ స్పందించారు. తమ విద్యాసంస్థను ఎలా కాపాడు కోవాలో తమకు తెలుసునని అన్నారు. ఒక విద్యాసంస్థను కూల్చివేస్తే వంద విద్యాసంస్థలు నిర్మిస్తామని అక్బరుద్దీన్ ఒవైసీ చెప్పారు. తమను బెదిరించి లొంగదీసుకోవాలని భావించడం అవివేకమని అన్నారు. దీంతో గ్రేటర్ ఎన్నికల వేళ సెంటిమెంట్ రగిలి హైదరాబాద్ మున్సిపల్ నగర పరిధిలో ఎక్కువ ఓటు బ్యాంకును సొంతం చేసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరి బీజేపీ ఈ వ్యూహంతో ఎన్ని స్థానాల్లో విజయం సాధిస్తుందన్నది చూడాల్సి ఉంది.


# బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి ఆషాడ బోనాల ఉత్సవాలు, కళ్యాణోత్సవాన్ని దేదీప్యమానంగా నిర్వహించాలి

- మొదటి పేజీ తరువాయి

మంత్రి సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ అమ్మవారి దర్శనం చేసుకుని, పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. వారి ఆధ్వర్యంలో సాగిన ఈ సమావేశంలో ఆషాడ బోనాల ఉత్సవాల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్ల పై వివిధ శాఖలకు అధికారులకు మంత్రి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ డైరక్టర్ హనుమంతరావు, జలమండలి ఎండి అశోక్ రెడ్డి, ఐ అండ్ పిఆర్ ప్రత్యేక కమిషనర్ ముకుంద రెడ్డి, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక అల, అడిషనల్ సిపి ఇక్బాల్, సాంస్కృతిక శాఖ డైరక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, ఆర్ అండ్ బి సిఈ నర్సింహారావు, దేవాదాయ, టిజిఎస్పిడిసిఎల్, జిహెచ్ఎంసి, పోలీస్, ట్రాఫిక్, అగ్నిమాపక, వైద్యారోగ్య శాఖ తదితర శాఖలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, బల్కంపేట ఎల్లమ్మ అమ్మవారి బోనాల ఉత్సవాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. బల్కంపేట దేవస్థానంలో ఈ నెల 20వ తేదీన సాయంత్రం 5 గంటలకు ఎదుర్కోలు ఉత్సవంతో వార్షిక కళ్యాణోత్సవాలు ప్రారంభమవుతాయని, 21వ తేదీన ఉదయం 9 గంటలకు అత్యంత వైభవంగా అమ్మవారి కళ్యాణోత్సవం నిర్వహించనున్నారని, 22వ తేదీన సాయంత్రం 6 గంటలకు రథోత్సవం అత్యంత ఘనంగా నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. బోనాల సందర్భంగా లక్షలాది మంది భక్తులు తరలివచ్చే నేపథ్యంలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. భక్తులు వచ్చిపోయే మార్గలతో పాటు, క్యూలైన్లలో తోపులాట జరగకుండా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలని మంత్రి నిర్దేశించారు. గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని విఐపి, వివిఐపిలకు కేటాయించిన ఎంట్రెన్స్ ల దగ్గర భద్రత పెంచడంతో పాటు వారికి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని మంత్రి సురేఖ సూచించారు. టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా భక్తుల సందేహాలను తీర్చాలని సూచించారు. ఆలయానికి వచ్చే భక్తులు ప్రశాంతంగా, సురక్షితంగా అమ్మవారిని దర్శించుకునేలా అత్యున్నత ప్రమాణాలతో ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి శాఖ తనకు కేటాయించిన బాధ్యతలను సమయానికి పూర్తి చేసి ఉత్సవాలను విజయవంతం చేయాలని స్పష్టం చేశారు. దేవాదాయ శాఖ ఆలయ పరిసరాల్లో ప్రత్యేక పుష్ప, విద్యుత్ దీపాలంకరణ, కళ్యాణ మండపం, రథోత్సవ ఏర్పాట్లు, ప్రసాదాల పంపిణీ, వాలంటీర్ల నియామకం, భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పించాలని మంత్రి ఆదేశించారు. ప్రచార కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టి ఉత్సవాల విశిష్టతను ప్రజలకు తెలియజేయాలని సూచించారు. పోలీసు, ట్రాఫిక్ శాఖలు పటిష్టమైన బందోబస్తుతో పాటు ట్రాఫిక్ మళ్లింపు, ప్రత్యేక పార్కింగ్ స్థలాలు, రద్దీ నియంత్రణ, క్యూ లైన్ నిర్వహణ, మహిళలు, వృద్ధులు, చిన్నారుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. మహిళలు, వృద్ధులు, శివసత్తులు, చిన్నారులు, దివ్యాంగులకు ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు దిశగా శ్రద్ధ పెట్టాలని సూచించారు. జీహెచ్ఎంసీ ఆలయ పరిసరాల్లో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, రోడ్ల మరమ్మతులు, చెత్త తొలగింపు, దోమల నివారణ, స్ట్రీట్ లైట్లు, తాత్కాలిక మరుగుదొడ్లు, మొబైల్ టాయిలెట్లు, శానిటేషన్ ఏర్పాట్లను ముందస్తుగా పూర్తి చేయాలని సూచించారు. జలమండలి నిరంతర తాగునీటి సరఫరాతో పాటు వాటర్ ట్యాంకర్లు, తాగునీటి పంపిణీ కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భక్తులకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలని జలమండలి ఎండి అశోక్ రెడ్డికి మంత్రి సురేఖ సూచించారు. విద్యుత్ శాఖ నిరంతర విద్యుత్ సరఫరాతో పాటు బ్యాకప్ ట్రాన్స్‌ఫార్మర్లు, జనరేటర్లు సిద్ధంగా ఉంచాలని, అత్యవసర పరిస్థితులకు ప్రత్యేక సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో కరెంటు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని టిజిఎస్పిడిసిఎల్ అధికారులకు మంత్రి దిశానిర్దేశం చేశారు. వైద్య ఆరోగ్య శాఖ తాత్కాలిక వైద్య శిబిరాలు, 108 అంబులెన్స్‌లు, అత్యవసర వైద్య బృందాలు, ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. బోనాల ఉత్సవాలు, కళ్యాణోత్సవం జరిగే మూడు రోజుల్లో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని మంత్రి సూచించారు. అగ్నిమాపక శాఖ అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు పూర్తి స్థాయిలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఆర్టీసీ భక్తుల రాకపోకలకు ప్రత్యేక బస్సులు నడపాలని, సాంస్కృతిక శాఖ బోనాల వైభవాన్ని ప్రతిబింబించే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని, సమాచార పౌరసంబంధాల శాఖ ఉత్సవాల తేదీలు, కార్యక్రమాలు, ట్రాఫిక్ మళ్లింపులు, భక్తులకు సూచనలు తదితర సమాచారాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి ఆదేశించారు. సమావేశంలో పాల్గొన్న అధికారులు తమ శాఖల వారీగా చేపడుతున్న ఏర్పాట్లను మంత్రికి వివరించగా, నిర్దేశించిన గడువులో అన్ని పనులు పూర్తి చేసి భక్తి, భద్రత, పరిశుభ్రత, సౌకర్యాల కల్పన అనే నాలుగు అంశాలకు ప్రాధాన్యమిస్తూ ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించాలని మంత్రి కొండా సురేఖ పునరుద్ఘాటించారు. ఆర్టీసీ భక్తుల రాకపోకలకు ప్రత్యేక బస్సులు నడపాలని, సమాచార పౌరసంబంధాల శాఖ ఉత్సవాలకు సంబంధించిన సమాచారాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి సూచించారు. సాంస్కృతిక శాఖ తరఫున చేపడుతున్న కార్యక్రమాల పై మంత్రి కొండా సురేఖ ఆరా తీశారు. ఎదుర్కోలు, కళ్యాణోత్సవం, రథోత్సవం సందర్భంగా ఆ శాఖ తరఫున చేపడుతున్నట్లు ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. బోనాల ఉత్సవాల నిర్వహణలో పోలీసు శాఖ పాత్ర అత్యంత ప్రాధాన్యత కలిగినదని మంత్రి అన్నారు. లక్షలాదిగా భక్తులు బల్కంపేట అమ్మవారి దర్శించుకునే పరిస్థితుల నేపథ్యంలో అనుమానితుల ఫోటోలు ప్రత్యేకంగా వాల్ పోస్టర్లుగా ప్రదర్శించాలని, తప్పిపోయిన పిల్లల జాడ తెలుసుకునేందుకు ప్రత్యేక కార్యచరణను చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి ఆషాడ బోనాల జాతర, ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణోత్సవం పోస్టర్ లను మంత్రి సురేఖ ఆవిష్కరించారు.

## అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు మళ్లీ తారాస్థాయికి..

- మొదటి పేజీ తరువాయి




బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 6.52 శాతం (4.69 డాలర్లు) పెరిగి బ్యారెల్‌కు దాదాపు 80 డాలర్ల వద్దకు చేరింది. అదేవిధంగా అమెరికా బెంచ్‌మార్క్ వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ ధర కూడా 6 శాతం (4.85 డాలర్లు) పెరిగి బ్యారెల్‌కు 75 డాలర్ల సమీపంలో ట్రేడయ్యింది. ఓ అంతర్జాతీయ మీడియా సంస్థ తన కథనంలో ఈ వివరాలను వెల్లడించింది. టర్కీలోని అంకారాలో జరుగుతున్న నాటో సదస్సు సందర్భంగా ట్రంప్ మీడియాతో మాట్లాడుతూ.. ఈ సంచలన వ్యాఖ్యలు చేశారు. హార్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులకు ప్రతిగా తమ సైన్యం రాత్రికిరాత్రి ఇరాన్‌పై కొత్త దాడులు చేసిందని ఆయన తెలిపారు. "నా వరకు ఇరాన్‌తో ఒప్పందం ముగిసిపోయింది. వాళ్లతో ఇకపై చర్చలు జరపను. వాళ్లు రోగగ్రస్తులు, హింసావాదులు. అణుబాంబు దొరికితే దాన్ని వాడటానికి కూడా వెనుకాడరు. వాళ్లతో చర్చలు జరపడం అంటే సమయం వృథా చేసుకోవడమే. వాళ్లు అబద్ధాల కోరులు" అంటూ ఇరాన్ నేతలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ పరిణామం భారత మార్కెట్లపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం చూపింది. ముడి చమురు ధరల పెరుగుదలతో మధ్యాహ్నం 3 గంటల సమయానికి సెన్సెక్స్ 1,900 పాయింట్లు (2 శాతానికి పైగా) నష్టపోయి 76,259 వద్ద ట్రేడ్ అయింది. నిఫ్టీ కూడా దాదాపు 600 పాయింట్లు పతనమై 23,805 వద్ద నిలిచింది.

వార్తాతరంగాలు

గురువారం 09 జూలై 2026

# రేవంత్ రెడ్డికి వేముల ప్రశాంత్ రెడ్డి కౌంటర్



**హైదరాబాద్:**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. కన్నెపల్లి పంప్ హౌస్ వద్ద ప్రస్తుత పరిస్థితిని వివరించారు.ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ కన్నెపల్లి పంప్ హౌస్లో 92 మీటర్ల వద్ద నీళ్లు ఉంటే లిఫ్ట్ చేసే అవకాశం ఉంటుంది. కానీ ఇప్పుడు 102 మీటర్ల వద్ద నీళ్లు ఉన్నాయి. గోదావరిలో నీళ్లు లేకపోయినా, ప్రాణహిత నది కలిసే చోటు నుంచి తీవ్ర వరద ప్రవాహం ఉంది. ప్రాణహిత నది నుంచి ఏ కాలంలో అయినా నీళ్లు తీసుకునే అవకాశం ఉంటుంది కాబట్టే కేసీఆర్ కాళేశ్వరం ప్రాజెక్టును ఈ విధంగా నిర్మించారు. బీఆర్ఎస్ పార్టీ మీద కోపంతో అసలు నీళ్లే లేవని చెప్పి రైతులను ఆగం చేయడం సరికాదని అన్నారు.ఇప్పటికైనా కన్నెపల్లి పంప్ హౌస్ మోటార్లు ఆన్ చేసి నీళ్లు లిఫ్ట్ చేసి ప్రజలకు సాగు, తాగునీరు అందించండని అన్నారు.

## ఉయ్యాలవాడ గురుకుల పాఠశాలను తనిఖీ చేసిన మంత్రి పొన్నం



**నాగర్ కర్నూలు:**నాగర్ కర్నూల్ జిల్లా బిజినిపల్లి మండలం ఉయ్యాలవాడ మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం నాడుఆకస్మిక తనిఖీ చేసారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ,జిల్లా కలెక్టర్, ఎస్పీ , అధికారులు తదితరులు పాల్గొన్నారు.విద్యార్థులు పాఠశాలలు పునఃప్రారంభం అయినప్పటి నుండి ఇప్పటి వరకు జరిగిన పాఠ్యాంశాల పై మంత్రి ఆరా తీసారు. విద్యార్థుల సమస్యల పై అడిగి తెలుసుకుని ..విద్యార్థులు స్నానాలు చేయడానికి వేడి నీరు రావడానికి సోలార్ ప్లాంట్ మంజూరు చేసారు. విద్యార్థులు బాగా చదువుకోవాలని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. విద్యార్థులకు అందుతున్న మెనూ అందుతున్న బోజన వివరాలు అడిగి తెలుసుకుని స్టోర్ రూమ్ లో వంట సరుకుల నాణ్యత పరిశీలించారు. వంట గది లో వండిన ఆహార పదార్థాలను పరిశీలించి కూరగాయలు పరిశీలించారు.. తాజా కూరగాయలు వంటల్లో ఉపయోగించాలని సూచించారు.

## జలాశయాలు, చెరువుల్లో
# చేపల వేట నిషేధం

**జూలై, ఆగస్టు నెలల్లో చేపలు పట్టవద్దని ఆదేశాలు**

**ఉల్లంఘిస్తే లైసెన్సులు రద్దు**



జగిత్యాల: జగిత్యాల జిల్లాలోని జలాశయాలు, చెరువులు, కుంటల్లో మత్స్యకారులు చేపలు పట్టవద్దని మత్స్య శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీన్ని ఉల్లఘించి ఎవరైనా చేపలు పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. జూలై, ఆగస్టు నెలల్లో చేపల పునరుత్పత్తి ప్రక్రియ ఉంటుంది. దీంతో మత్స్యకారులు చేపల వేటకు వెళ్లి చేపల పునరుత్పత్తి ప్రక్రియను దెబ్బతీయవద్దని అధికారులు సూచిస్తున్నారు. జిల్లాలోని గోదావరి పరివాహక ప్రాంతాల్లో, ఎల్లంపల్లి బ్యాక్ వాటర్ జలా శయంలో మానిటరింగ్ కమిటీ ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

**జిల్లాలో మత్స్య శాఖ పరిస్థితి ఇలా..**

జిల్లా వ్యాప్తంగా 275 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో 19,220 మంది సభ్యులున్నారు. ఇందులో 88 మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలలో 4,217 మంది మహిళలు, 187 మత్స్య పారిశ్రామిక సహకార సంఘాలలో 15,003 మంది పురుష మత్స్య కారులు సభ్యులుగా ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా 511 గ్రామ పంచాయతీ చెరువులకు 3,130 హెక్టార్ల విస్తీర్ణం, 185 డిపార్ట్మెంట్ చెరువులకు 15,162 హెక్టార్ల విస్తీర్ణం ఉంది. ఒక రెండు కిలోల చేప నుంచి సుమారు రెండు లక్షలకు పైగా పిల్లలు పునరుత్పత్తి అవుతాయని మత్స్య శాఖ అధికారులు పేర్కొంటున్నారు.అందులో 10 శాతం బతికినా 20వేల చేపలు ఉత్పత్తి అవుతాయి. ఈ రెండు నెలల్లో ఒక్క చేపను కోల్పోయినా దాని నుంచి వచ్చే చేప పిల్లలను కోల్పోయి నట్లేనని అధికారులు చెబుతున్నారు. ఈ మేరకు జలాశయాల్లో చేప పిల్లల సంఖ్యను పెంచేందుకు మత్స్య శాఖ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. చేపల పునరు త్పత్తి ప్రక్రియను దెబ్బతీస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు మత్స్యకారులను హెచ్చరిస్తున్నారు.

## మనకు వర్షాలు లేకపోయినా
# ఉగ్రరూపం దాలుస్తున్న గోదావరి..

**ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలు**

**గోదావరి నదిలోకి భారీగా చేరుతున్న వరద నీరు**

**పోలవరం స్పిల్ వే గేట్లను ఎత్తివేసిన అధికారులు**



తెలుగు రాష్ట్రాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. ప్రతి ఏటా ఈ సమయానికి కురవాల్సిన సాధారణ వర్ష శాతం కంటే తక్కువ శాతం వర్షాలు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో కురిశాయి. ఇదంతా ఒకవైపు. మరోవైపు గోదావరి నది నీటిమట్టం అంతకంతకు పెరుగుతోంది. క్రమంగా గోదావరి ఉగ్రరూపం దాలుస్తోంది. దీనికి కారుణం... ఎగువన మహారాష్ట్ర, ఒడిసా, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల్లో దంచికొడుతున్న వర్షాలే. భారీ వర్షాలతో గోదావరి ఉపనదులు పొంగిపొర్లుతూ గోదావరిలోకి వచ్చి చేరుతున్నాయి. దీంతో వరద ప్రవాహం భారీగా పెరిగింది. పోలవరం ప్రాజెక్టుకు ఏకంగా లక్ష క్యూసెక్కుల నీరు ఉరకలెత్తుతోంది. దీంతో, అలర్ట్ అయిన జలవనరుల శాఖ అధికారులు 48 గేట్లను ఎత్తివేసి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. అయితే, స్పిల్‌వే నుంచి వరద నీరు ఊహించని వేగంతో దూసుకురావడంతో.. స్పిల్ చానల్ మధ్య 902 హిల్ నుంచి మహానందీశ్వరస్వామి టెంపుల్ వరకు ఉన్న మట్టి, రాతి రవాణా కాజ్‌వేకు గండిపడింది. ప్రాజెక్టు పనుల కోసం వాహనాలు తిరిగేలా నిర్మించిన ఈ కాజ్‌వే వరద తాకిడికి కొట్టుకుపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఇటు దిగువన ధవళేశ్వరం కాటన్ బ్యారేజ్ వద్ద కూడా గోదావరి నీటిమట్టం శరవేగంగా పెరుగుతోంది. ప్రవాహం ఇంతకంటే ఎక్కువైతే, బ్యారేజ్ గేట్ల ఎత్తి నీటిని నేరుగా దిగువకు వదిలేస్తారు. కిందకు వదిలిన నీరంతా సముద్రంలో కలవనుంది.

# భారీగా పెరగనున్న ఆస్తి పన్ను




**హైదరాబాద్, జూలై 8:**హైదరాబాద్ మహానగర మున్సిపల్ పరిపాలనా వ్యవస్థలో గత ఏడు దశాబ్దాలలోనే ఎన్నడూ లేనంతటి అతిపెద్ద సంస్కరణకు తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. 1955 నాటి పాత జీహెచ్ఎంసీ చట్టాన్ని పూర్తిగా రద్దు చేస్తూ.. మారుతున్న కాలం, వేగంగా విస్తరిస్తున్న నగర అవసరాలకు అనుగుణంగా సరికొత్త చట్టాన్ని తీసుకురాబోతోంది. ఇందులో భాగంగా ది డ్రాఫ్ట్ కోర్ అర్బన్ రీజియన్ బిల్, 2026 ముసాయిదాను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా విడుదల చేసింది. క్యూర్ బిల్లుగా పిలుస్తున్న ఈ మార్పును హైదరాబాద్ మెట్రోపాలిటన్ ప్రాంతంలో పౌర సేవలను మరింత వేగవంతం చేయడానికి, పరిపాలనను ఆధునీకరించడానికి ఈ చారిత్రాత్మక బిల్లును రూపకల్పన చేసినట్లుగా చెబుతున్నారు.హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్ పరిధిలోకి వచ్చే జీహెచ్ఎంసీ , సైబరాబాద్ , మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్లను ఒకే సమగ్ర పరిపాలనా చట్టం కిందికి తీసుకురావడం. ప్రస్తుతం నగరంలో అర్బన్ ప్లానింగ్, రోడ్లు, తాగునీటి సరఫరా, డ్రైనేజీ, రవాణా, ప్రజారోగ్యం, విపత్తు నిర్వహణ వంటి సేవలను వేర్వేరు విభాగాలు చూస్తుండటంతో సమన్వయ లోపం ఏర్పడుతోంది. ఈ కొత్త చట్టం ద్వారా ఈ విభాగాలన్నింటినీ అనుసంధానించనున్నారు. తద్వారా ప్రాజెక్టుల అమలు వేగవంతం కావడమే కాకుండా పౌరులకు నాణ్యమైన సేవలు అందుతాయని అధికారులు చెబుతున్నారు.ప్రస్తుతం అమల్లో ఉన్న యాన్యువల్ రెంటల్ వాల్యూ ఆధారిత ఆస్తి పన్ను విధానానికి ఈ బిల్లు స్వస్తి పలకనుంది. దీని స్థానంలో మార్కెట్ రేట్లకు అనుగుణంగా ఉండే క్యాపిటల్ వాల్యూ ఆధారిత సరికొత్త ఆస్తి పన్ను అసెస్‌మెంట్ నమూనాను ప్రవేశపెట్టాలని ప్రతిపాదించారు. ఒక స్మార్ట్ గవర్నెన్స్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని బిల్లులో ప్రతిపాదించారు. వీటితో పాటు జీఐఎస్ ఆధారిత అర్బన్ ప్లానింగ్, భూగర్భ యూటిలిటీల సమగ్ర నిర్వహణ, ఒకే డిజిటల్ ప్లాట్‌ఫామ్ ద్వారా పౌర సేవలు, సులభతర వాణిజ్యం లో భాగంగా సింగిల్ ట్రేడ్ లైసెన్స్ విధానం, సరళీకృత భవన నిర్మాణ అనుమతుల ప్రక్రియ వంటి కీలక సంస్కరణలను ఇందులో పొందుపరిచారు. పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే భవనాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు, సకాలంలో పన్నులు చెల్లించే వారికి రిబేటులు కూడా ఇవ్వనున్నారు.ఈ డ్రాఫ్ట్ జఖ=జు బిల్-2026 ను ప్రజల అభిప్రాయాల కోసం పబ్లిక్ డొమైన్‌లో ఉంచారు. హైదరాబాద్ నివాసితులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లు, నిపుణులు, పారిశ్రామిక రంగానికి చెందిన ప్రముఖులు ఈ ముసాయిదాను పరిశీలించి, తమ విలువైన సలహాలు, సూచనలను జూలై 24, 2026 లోగా సమర్పించాలని జీహెచ్ఎంసీ కోరింది. అధికారిక జీహెచ్ఎంసీ వెబ్‌సైట్ ద్వారా ప్రజలు తమ ఫీడ్‌బ్యాక్‌ను పంపవచ్చని, వచ్చిన సూచనలను నిశితంగా పరిశీలించిన తర్వాతే బిల్లుకు తుది రూపునిచ్చి అసెంబ్లీలో ప్రవేశపెడతామని ప్రభుత్వ ఉన్నతాధికారులు స్పష్టం చేశారు. ఈ బిల్లు నగర పాలనలో కొత్త మార్పు తీసుకు రానుంది.

## హైదరాబాద్ కు క్యూ కడుతున్న
# ఇంటర్నేషనల్ వర్సిటీలు..




**హైదరాబాద్, జూలై 8:**తెలంగాణ గ్లోబల్ ఎడ్యుకేషన్ హబ్‌గా మారబోతుంది. ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందిన 15 విదేశీ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి చూపుతున్నాయి. ఇప్పటికే అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో, యూకేకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ లండన్ యూజీసీకి దరఖాస్తు చేసుకోగా.. మరికొన్ని వర్సిటీలు సంప్రదింపులు జరుపుతున్నాయి. ఈ విదేశీ క్యాంపస్‌ల వల్ల రాష్ట్రంలో పెట్టుబడులు పెరగడంతో పాటు, మేధో వలసలు తగ్గి స్థానికంగానే ఉద్యోగ, పరిశోధన అవకాశాలు లభించనున్నాయి.ఐటీ, ఫార్మా, బయోటెక్నాలజీ, ఏరోస్పేస్ రంగాల్లో అంతర్జాతీయంగా దూసుకుపోతున్న హైదరాబాద్ నగరం త్వరలోనే అంతర్జాతీయ ఉన్నత విద్యా రంగానికి కూడా గ్లోబల్ హబ్‌గా మారబోతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన జాతీయ విద్యా విధానం 2020తో పాటు, యూజీసీ ప్రకటించిన నూతన సడలింపులు భారత్‌లో విదేశీ వర్సిటీల ఏర్పాటుకు మార్గాన్ని సుగమం చేశాయి. ఈ అనుకూల వాతావరణాన్ని ఉపయోగించుకుంటూ వివిధ దేశాలకు చెందిన సుమారు 15 ప్రముఖ అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు హైదరాబాద్‌లో తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి క్యూ కడుతున్నాయి. దేశంలోని ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో ఉన్న అత్యుత్తమ మౌలిక సదుపాయాలు, శాంతిభద్రతలు, నివాసయోగ్యమైన వాతావరణం అంతర్జాతీయ సంస్థలను ఇటువైపు ఆకర్షిస్తున్నాయి.ఇప్పటికే ఈ ప్రక్రియలో భాగంగా అమెరికాకు చెందిన యూనివర్సిటీ ఆఫ్ కొలరాడో, యూకేకు చెందిన ప్రతిష్టాత్మక యూనివర్సిటీ ఆఫ్ లండన్ తమ క్యాంపస్‌ల ఏర్పాటు కోసం యూజీసీకి అధికారికంగా దరఖాస్తులు కూడా చేసుకున్నాయి. ప్రస్తుతానికి ఈ విశ్వవిద్యాలయాలన్నీ ప్రైవేట్ భాగస్వామ్యంతోనే స్వతంత్ర ప్రాంగణాలను ఏర్పాటు చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఇందులో భాగంగా అమెరికాకు చెందిన ఒక ప్రముఖ వర్సిటీ వచ్చే విద్యాసంవత్సరం నుంచే క్లాసులు ప్రారంభించేందుకు ముమ్మర ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం ఐటీ కారిడార్ గచ్చిబౌలిలోని ఒక భారీ కమర్షియల్ టవర్‌లో కొన్ని అంతస్తులను లీజుకు తీసుకునేందుకు ప్రభుత్వ వర్గాలతో చర్చలు జరుపుతోంది. తాత్కాలికంగా ఇక్కడ ప్రారంభించి భవిష్యత్తులో ప్రయోగశాలలు, స్పోర్ట్స్ అకాడమీలతో కూడిన శాశ్వత క్యాంపస్‌ల కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఫ్యూచర్ సిటీలో స్థలాలు కేటాయించాలని ప్రభుత్వం యోచిస్తోంది.మరికొన్ని టాప్ వర్సిటీలు కూడా క్యాంపస్‌ల ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నాయి. అమెరికాకు చెందిన పర్ద్యూ యూనివర్సిటీ, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ ప్రతినిధులు ఇప్పటికే ప్రభుత్వ ఉన్నతాధికారులతో ప్రాథమిక సంప్రదింపులు పూర్తి చేశారు. అదేవిధంగా.. యూకేకు చెందిన బర్మింగ్‌హామ్ యూనివర్సిటీ, ఆస్ట్రేలియాకు చెందిన వెస్ట్రన్ ఆస్ట్రేలియా విశ్వవిద్యాలయం ఇక్కడ ప్రత్యేకంగా క్రీడలు, స్పోర్ట్స్ సైన్స్‌కు సంబంధించిన స్పెషలైజ్డ్ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. వీటితో పాటు న్యూ కాజిల్ యూనివర్సిటీ, చిచెస్టర్ యూనివర్సిటీ, యూనివర్సిటీ ఆఫ్ హెర్ట్‌ఫోర్డ్‌షైర్, న్యూజిలాండ్‌కు చెందిన యూనివర్సిటీ ఆఫ్ వైకాటో ప్రతినిధులు కూడా విద్యాశాఖ ఉన్నతాధికారులను కలిసి తమ ప్రతిపాదనలను సమర్పించారు.తెలంగాణ నుంచి ప్రతి సంవత్సరం ఉన్నత చదువుల కోసం వేల సంఖ్యలో విద్యార్థులు కోట్లాది రూపాయల ధనాన్ని వెచ్చించి అమెరికా, యూకే, కెనడా వంటి దేశాలకు వలస వెళ్తున్నారు. అంతర్జాతీయ స్థాయి విద్య ఇక్కడే అందుబాటులోకి రావడం వల్ల అక్కడకు వెళ్లే అవసరం ఉండదు. ఈ క్యాంపస్‌ల నిర్మాణాల ద్వారా రాష్ట్రంలోకి భారీగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు రానున్నాయి. అంతేకాకుండా, బోధన, బోధనేతర రంగాల్లో, ఐటీ సపోర్ట్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలలో స్థానిక యువతకు వేల సంఖ్యలో ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగావకాశాలు లభిస్తాయి. పరిశ్రమలకు సమీపంలో ఈ క్యాంపస్‌లు ఉండటం వల్ల విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లు, లైవ్ కార్పొరేట్ ప్రాజెక్టులు సులభంగా దక్కుతాయి.పరిశోధనల విషయానికొస్తే, విదేశీ వర్సిటీలు కేటాయించే భారీ రీసెర్చ్ ఫండ్స్ స్థానిక పీహెచ్‌డీ విద్యార్థులకు వరంగా మారనున్నాయి. హైదరాబాద్‌లోని ఐఐటీ, బిట్స్ పిలానీ, సెంట్రల్ యూనివర్సిటీ వంటి ప్రతిష్టాత్మక సంస్థలతో కలిసి ఈ గ్లోబల్ వర్సిటీలు సంయుక్త పరిశోధనలు చేపట్టే అవకాశం ఉంది.

# కొడంగల్ టూ శంషాబాద్ లైన్ క్లియర్



**హైదరాబాద్, జూలై 8:**రంగారెడ్డి జిల్లాలో ప్రతిష్టాత్మక రేడియల్ రోడ్-2 నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ వేగవంతమైంది. శంషాబాద్-షాద్‌నగర్ డివిజన్ పరిధిలోని గ్రామాల్లో పది రోజుల్లో భూములు సేకరించాలని రెవెన్యూ అధికారులు నిర్ణయించారు. రైతులతో జరిపిన చర్చలు సఫలమవడంతో ఆర్ఆర్ యాక్ట్-2013 ప్రకారం పారదర్శక పరిహారానికి రైతులు అంగీకార పత్రాలు ఇచ్చారు. బుద్వేల్ నుంచి కొడంగల్ వరకు 81 కిలోమీటర్ల మేర నిర్మించే ఈ రహదారి వల్ల శంషాబాద్, షాద్‌నగర్ ప్రాంతాల్లో పారిశ్రామిక కారిడార్లు వేగంగా అభివృద్ధి చెందనున్నాయి.హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాల్లో పారిశ్రామిక ప్రగతికి, మౌలిక వసతుల కల్పనపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగా అత్యంత కీలకమైన రేడియల్ రోడ్-2 నిర్మాణ పనులను వేగవంతం చేసేందుకు శంషాబాద్-షాద్‌నగర్ డివిజన్లలో భూసేకరణ ప్రక్రియను చేపట్టాలని రెవెన్యూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. షాద్‌నగర్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని ముట్‌పూర్, చుక్మమెట్, లాలాపేట్, ఉమ్మెత్యాల్, తుమ్మపల్లి గ్రామాల్లో ఈ రహదారి కోసం అవసరమైన భూములను రాబోయే పది రోజుల్లోనే పూర్తిస్థాయిలో సేకరించడానికి కసరత్తు ప్రారంభించారు.భూసేకరణ ప్రక్రియలో రైతులకు ఎలాంటి అన్యాయం జరగకుండా వారిలో ఉన్న అనుమానాలను నివృత్తి చేసేందుకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, షాద్‌నగర్ శాసనసభ్యుడు వీర్లపల్లి శంకర్ చర్యలు తీసుకున్నారు. రైతుల తరపున ప్రతినిధులతో ఉన్నత స్థాయి సంప్రదింపులు, ముఖాముఖి సమావేశాలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ భూసేకరణ చట్టం ఆర్ఆర్ యాక్ట్-2013 నిబంధనల ప్రకారం పారదర్శకమైన పద్ధతిలో మార్కెట్ ధరకు అనుగుణంగా తగిన పరిహారాన్ని అందజేస్తామని రైతులకు హామీ ఇచ్చారు. ఈ సానుకూల చర్చల అనంతరం భూములు ఇచ్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు వచ్చిన రైతుల నుంచి అధికారులు అధికారిక అంగీకార పత్రాలను సేకరించారు.రేడియల్ రోడ్-2 ప్రాజెక్టును రాజధాని శివార్లలోని బుద్వేల్ నుంచి ప్రారంభించి షాబాద్, కొందూర్, పరిగి మీదుగా ముఖ్యమంత్రి నియోజకవర్గమైన కొడంగల్ వరకూ మొత్తం 81 కిలోమీటర్ల మేర అత్యాధునిక ప్రమాణాలతో నిర్మించనున్నారు. ఈ రహదారి అందుబాటులోకి వస్తే శంషాబాద్, షాబాద్ మండలాలలో ప్రతిపాదించిన పారిశ్రామిక కారిడార్లకు, కొత్తగా రాబోతున్న ఐటీ పరిశ్రమలకు అంతర్జాతీయ స్థాయి రవాణా సౌకర్యం లభించనుంది. ముఖ్యంగా శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం కార్గో టెర్మినల్ నుంచి నేరుగా షాబాద్, కొడంగల్ ప్రాంతాలల్లోని భారీ పరిశ్రమలకు అవసరమైన భారీ యంత్రాలు, ముడిపదార్థాలు, విదేశీ పరికరాలను వేగంగా, సులభంగా తరలించడానికి ఈ మార్గం అనుకూలంగా మారుతుందని నిపుణులు చెబుతున్నారు.రేడియల్ రోడ్-2 నిర్మాణం పూర్తికావడం ద్వారా శంషాబాద్-షాద్‌నగర్ ప్రాంతాల మధ్య సరికొత్త పారిశ్రామిక జోన్లు ఏర్పడేందుకు అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. ప్రస్తుతం ఈ రెండు కీలక ప్రాంతాల మధ్య కేవలం హైదరాబాద్-బెంగళూరు జాతీయ రహదారికి ఇరువైపులా మాత్రమే పరిమిత సంఖ్యలో పరిశ్రమలు నడుస్తున్నాయి. అయితే.. ఈ నూతన ఆర్ఆర్-2 రహదారి ద్వారా అంతర్గత ప్రాంతాలైన షాబాద్, షాద్‌నగర్ డివిజన్‌లోని కొందూరు, చౌదరిగూడ వంటి గ్రామీణ మండలాల్లోకి కూడా పారిశ్రామికీకరణ విస్తరిస్తుంది. దీనివల్ల మారుమూల గ్రామాలకు సైతం మెరుగైన కనెక్టివిటీ లభించడమే కాకుండా, స్థానిక యువతకు వేల సంఖ్యలో ఉపాధి అవకాశాలు లభించి ఈ ప్రాంతం అభివృద్ధి పథంలో దూసుకుపోనుంది.

## విద్యార్థిపై ప్రిన్సిపల్ లైంగిక దాడి


**ప్రిన్సిపల్ ప్రైవేట్ పార్టును కొరికిన విద్యార్థి**

**నాగర్ కర్నూలు:**నాగర్ కర్నూల్ జిల్లాలో దారుణ ఘటన చోటు చేసుకుంది. కొల్లాపూర్లో ఓ విద్యార్థిపై పీజీ కళాశాల ప్రిన్సిపల్ మార్క్ పోలోనియస్ లైంగికంగా, మానసికంగా దాడికి పాల్పడ్డాడు. భాదిత విద్యార్థి 2025లో PG పూర్తి చేసిన తనకు టీసీఇవ్వాలని ప్రిన్సిపల్ను కోరగా, ఇంటికి వస్తే ఇస్తానని చెప్పడంతో ప్రిన్సిపల్ ఇంటికి తన ఫ్రెండ్తో కలిసి వెళ్లాడు. రాత్రి 10 గంటలకు తన ఇంటికి విద్యార్థిని పిలిపించుకొని ప్రిన్సిపల్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. చిత్రహింసలకు గురి చేస్తుండడంతో ప్రిన్సిపల్ ప్రైవేట్ పార్టును విద్యార్థి కొరికాడు. దాంతో ప్రిన్సిపల్ నగ్నంగా పారిపోయాడు. బాధిత విద్యార్థి రాత్రి పోలీస్ స్టేషన్లో కంప్లైంట్ ఇచ్చాడు. తక్షణమే ప్రిన్సిపల్ను సస్పెండ్ చేసి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విద్యార్థుల డిమాండ్.

## ఎంజీ యూనివర్సిటీలో
# విద్యార్థినుల ఆందోళన

**నల్గొండ:**నల్గొండ పట్టణంలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో విద్యార్థినిలు అర్ధరాత్రి అందోళనకు దిగారు. హాస్టల్ బాత్ రూముల్లో నీటి కొరత ఉందంటూ వీసీ నివాసం ముట్టడించారు. రాత్రి సమయంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేసారు. వీసీ బయటకు వచ్చే వరకు కదిలేది లేదన్నారు. రెండు గంటలుగా వీసీ నివాసం ఎదుటే విద్యార్థినుల బైఠాయించారు. విద్యార్థినుల నిరసనకు ఏబీవీపీ కార్యకర్తలు మద్దతు తెలిపారు. క్యాంపస్ లోకి అర్ధరాత్రి దాటిన తర్వాత పోలీసులను పిలిపించడం ఏంటని మండిపడ్డారు. ఈ నేపథ్యంలో? విద్యార్థినిలు యూనివర్సిటీ అధికారులు, పోలీసులతో తీవ్రస్థాయిలో వాగ్వివాదానికి దిగారు.

## గ్రామంలో పండుగ వాతావరణం



**హొళగుంద:** మండలం మంగళవారం నేరనికి తాండ గ్రామం లో బంజారాల కుల దైవం 7గురు అంటే సాతి యాడి సీతలా పండుగ సందర్భంగా గ్రామం పెద్దలు గ్రామ ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని ఎలాంటి అవాంచనియా ఘటనలు జరగకుండా అంగరంగ వైభవంగా జరుపుకున్నారు గ్రామ పెద్దలు డాక్య నాయక్,దేవేంద్ర నాయక్, విజయ నాయక్, వెంకోబ నాయక్ వెంకటేష్ నాయక్ గ్రామ ప్రజలు అందరు పంటలు బాగా పండి పిల్లలకు ఎలాంటి అనారోగ్య సమస్యలు రాకుండా చూడాలని అమ్మవారికి మొక్కు కున్నారు

## మహిళా సంక్షేమ పథకాలపై
# శ్వేత పత్రం విడుదల చేయాలి...
### బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పద్మా యాదవ్

**నాగర్ కర్నూల్ జులై 8( స్కై న్యూస్)** ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా రాజకీయ లబ్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసత్య ప్రకటనలు చేస్తూ మోసం చేస్తున్నారని బిజెపి మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు పద్మ యాదవ్ మండిపడ్డారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం మహిళా సాధికారత కోసం ఉజ్వల పథకం ద్వారా సిలిండర్లను వడ్డీ లేని రుణాల కోసం రుణాలను పంపిణీ చేయడంతో పాటు మహిళ సంక్షేమానికి అనేక నిధులు మంజూరు చేయడంతో పాటు అత్యున్నత పదవులలో మహిళలకు తాను కల్పించారని వివరించారు. మంత్రులు ముఖ్యమంత్రి గ్రామాలలో ఇందిరమ్మ ఇండ్లను మహిళల సంక్షేమానికి కేటాయిస్తున్నట్లు ప్రకటించడం దారుణమని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇండ్ల పథకం కార్యకర్తలకు వరంగా మారిందని ఎంతమంది మహిళలకు ఇండ్లు మంజూరు చేశారు శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ 2034 లోపు కోటి మంది మహిళలను కోటీశ్వరులు చేస్తామని ప్రకటించడం విడ్డూరంగా ఉందని ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బోధించి రాష్ట్రంలో డబుల్ ఇంజన్ సర్కారును అధికారంలోకి తీసుకువచ్చేందుకు ప్రజలు ఎదురుచూస్తున్నారని అన్నారు. రాష్ట్రంలో బిజెపిని అధికారంలోకి తీసుకువచ్చేందుకు మహిళా మోర్చా నిరంతరం కృషి చేస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రజాధనాన్ని ఢిల్లీకి తరలించి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న కాంగ్రెస్ ను ఎండగడతామని అన్నారు. మహిళలకు పెట్రోల్ పంపులు కేటాయించాము ఆర్టీసీ బస్సులు కొనిచ్చామంటూ ప్రకటిస్తూ మోసం చేస్తున్నారని ఇప్పటివరకు మహిళలకు ఇచ్చిన 2500 పథకం ఎటు పోయిందని మండిపడ్డారు. ప్రచార ఆర్భాటాలకే పరిమితమైన ప్రభుత్వాన్ని రాబోయే ఎన్నికలలో ఓడిస్తామన్నారు. రాష్ట్రంలో 23 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేయడం దారుణమని ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొని ఉన్న సమస్యలను పరిష్కరించి ఖాళీలను భర్తీ చేసి విద్యా రంగాన్ని కాపాడాలని కోరారు. ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు మొదటి విడతలో మంజూరు చేసినట్లు ప్రకటించిన ప్రభుత్వం ఇప్పటివరకు ఎన్ని ఇండ్లు నిర్మించారు ఎన్ని నిధులు మంజూరు చేశారు వారి వివరాలను బహిర్గతం చేయాలని కోరారు. నియోజకవర్గాలలో ఎమ్మెల్యేలు వారి అనుచరులతో అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. జిల్లా కేంద్రంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వ ఆసుపత్రిలో మెరుగైన సేవలు అందించేందుకు మరిన్ని నిధులు మంజూరు చేయాలని ఆస్పత్రిలో నెలకొని ఉన్న ఖాళీలను భర్తీ చేసి అన్ని వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను జరిగిన అవినీతి అక్రమాలపై ప్రత్యేక అధికారితో విచారణ జరిపించి దోషులను శిక్షించాలని డిమాండ్ చేశారు




## వృద్ధులకు సామాజికంగా
# మద్దతు ఎంతో అవసరం
### వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సా యి చౌదరి



**వికారాబాద్ జులై 8 :** దేశంలోనే వృద్ధులలో అత్యధికులు గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థికంగా వెనకబడిన పరిస్థితుల్లో జీవిస్తున్నారని, అంతేకాకుండా వృద్ధులు సామాజికంగా, మానసికంగా, ఒంటరితనానికి గురవుతున్నారని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి అన్నారు. నేడు డే కేర్ సెంటర్ లో జరిగిన కార్యక్రమంలో సాయి చౌదరి మాట్లాడుతూ భార్య లేదా భర్త చనిపోవడం, ఒంటరిగా జీవించటం, కొడుకులు, కోడళ్ళు లేదా కుమార్తెతో సంబంధాలు లేకపోవడం, వృద్ధాప్యంలో వేధింపులు గురికావడం వల్ల మానసిక కుశీగుబాటు, ఆందోళన పెరుగుతున్నాయని, ఒంటరితనంతో బాధపడే వృద్ధులలో గుండె జబ్బులు, తీవ్రమైన డిప్రెషన్, జ్ఞాపక శక్తి తగ్గటం, ఆత్మహత్య ఆలోచనలు వచ్చే ప్రమాదం ఎక్కువగా ఉందని సాయి చౌదరి హెచ్చరించారు. వృద్ధులకు సామాజికంగా మద్దతు ఎంతో అవసరం అని డే కేర్ సెంటర్లలో వినోద కార్యక్రమాలను స్థానికంగా ఏర్పాటు చేయడం ద్వారా వారిని సామాజికంగా చురుగ్గా ఉండేలా చూస్తుందని, ఆరోగ్య సంరక్షణ, వృద్ధుల శారీరక ఆరోగ్యంతో పాటు, మానసిక ఆరోగ్యం పై ప్రత్యేక శ్రద్ధ పెరుగుతుందని, ఒంటరిగా నివసించే వృద్ధులకు సామాజికంగా మద్దతు ఎంతో అవసరమని ఈ విషయంలో డే కేర్ సెంటర్ కి రావటం ద్వారా ఒకరికొకరు మానవీయంగా స్పందిస్తారని, వారితో ఆప్యాయంగా మెలుగుతారని తద్వారా సామాజిక మద్దతు ఉంటుందని సాయి చౌదరి పేర్కొన్నారు.

## మౌలిక సదుపాయాల బలోపేతమే
# ప్రభుత్వ ఎజెండా...







### సబ్ స్టేషన్ తో నిరంతర విద్యుత్.
### దళిత బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే కాంగ్రెస్ లక్ష్యం.
### రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.

బిజినేపల్లి/ నాగర్ కర్నూల్ జులై 8 (స్కైన్యూస్) కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటేనే ప్రజా సంక్షేమం రైతులు పేదలు దళిత బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి సాధ్యమవుతుందని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు బుధవారం నియోజకవర్గ పర్యటనలో భాగంగా బిజినేపల్లి మండల కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు అనంతరం ఉమ్మడి రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి గా పనిచేసిన డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా కేకు కట్ చేసి ఆయన చిత్రపటానికి స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా వైయస్ రాజశేఖర్ రెడ్డి పనిచేసిన సందర్భంలో పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసి పేదల గుండెల్లో చిరస్మరణీయంగా నిలిచారని అన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం రాజ్యాంగ విలువలను పరిరక్షిస్తూ సామాజిక న్యాయం సమానత్వం కోసం పనిచేస్తుందన్నారు అనంతరం మండల పరిధిలోని పాలెం గ్రామంలో విద్యుత్ సబ్ స్టేషన్ ను ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డిలతో కలిసి ప్రారంభించారు అనంతరం ఆయన మాట్లాడుతూ పాలెం పరిసర గ్రామాల ప్రజలకు నిరంతరం విద్యుత్ అందించేందుకు సబ్ స్టేషన్ ఎంతో దోహదం చేస్తుందని అన్నారు. నూతన సబ్స్టేషన్ ప్రారంభం వల్ల విద్యుత్ అంతరాలు తగ్గడంతో పాటు వ్యవసాయం గృహ వాణిజ్య అవసరాలకు మెరుగైన సేవలు అందుతాయని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాలను కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజల అవసరాలే తమ ఎజెండాగా పనిచేస్తూ అన్ని సంక్షేమ పథకాలను నియోజకవర్గంలో అమలు చేస్తున్నామని తెలిపారు కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పార్టీ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు ఆర్డిఓ అర్చన కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మిద్దె రాములు తోపాటు పలువురు ప్రజాప్రతినిధులు అధికారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

## వనపర్తిలో శివాజీ విగ్రహా ధ్వంసం అత్యంత బాధాకరం
### : రంగినేని సురేష్ తీవ్ర ఖండన



**వనపర్తి, జూలై 8:**వనపర్తి పట్టణ నడిబొడ్డున ఉన్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేయడం అత్యంత బాధాకరమని, ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తున్నామని ప్రముఖ నాయకులు రంగినేని సురేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఛత్రపతి శివాజీ మహారాజ్ కేవలం ఒక ప్రాంతానికి చెందిన మహానేత మాత్రమే కాదని... ధర్మరక్షణకు, స్వాభిమానానికి, ధైర్యసాహసాలకు ఆయన ఒక నిలువెత్తు ప్రతీక అని కొనియాడారు.

**నేరస్థులను కఠినంగా శిక్షించాలి**

ఈ విగ్రహ ధ్వంసం ఘటన వెనుక ఎవరున్నారో చట్టం నిర్దాక్షిణ్యంగా వెలికితీయాలని రంగినేని సురేష్ డిమాండ్ చేశారు. సమాజంలో అలజడి సృష్టించాలని చూసే నేరస్థులు ఎంతటి వారైనా సరే, వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం ఈ విషయంలో వెంటనే స్పందించి, నిందితులను అరెస్ట్ చేసి వనపర్తిలో శాంతిభద్రతలను పరిరక్షించాలని విజ్ఞప్తి చేశారు.

**ప్రజలు సంయమనం పాటించాలి**

ఈ అవాంఛనీయ సంఘటనను ఆసరాగా చేసుకుని సమాజంలో మత విద్వేషాలు, సామాజిక ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకు కొందరు ప్రయత్నించే అవకాశం ఉందని, అటువంటి ప్రయత్నాలను ఎవరూ నమ్మకూడదని ఆయన కోరారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉంటూ, సంయమనం పాటించి శాంతి, సామరస్యాలను కాపాడాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి వేడుకలు



**చిన్న చింతకుంట జూలై 8 ( స్కై న్యూస్);** చిన్న చింతకుంట మండల కేంద్రంలోని స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్భంగా వారి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించిన మాజీ శాసన సభ్యురాలు ఎస్ స్వర్ణ సుధాకర్ రెడ్డి ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ రాజశేఖర్ రెడ్డి హయాంలో నేను ఎమ్మెల్యే గా ఉండడం నా అదృష్టం అని అన్నారు. వారు ముఖ్యమంత్రి ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసి ప్రజల గుండెల్లో స్థిరస్థాయిగా నిలిచిపోయారనీ అన్నారు. వారి అభివృద్ధికి సంక్షేమానికి ముగ్ధులై ప్రతిపక్ష పార్టీల నాయకులు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారన్నారు. వారి ఆదర్శంలో బుధ వారం రాష్ట్రంలో ప్రస్తుత మన ప్రియతమ ముఖ్యమంత్రి మన ఎమ్మెల్యే ఎన్నో అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నారని ఆరోగ్యశ్రీ ఇందిరమ్మ ఇండ్లు రైతు బీమా రైతు రుణమాఫీ రైతు భరోసా మహిళలకు ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తూ ముందుకు సాగుతున్నారని అన్నారు. రాజశేఖర్ రెడ్డి ఆశయాలకానుగునంగా రాష్ట్ర అభివృద్ధికి పాటుపడుతున్న ప్రస్తుత ప్రభుత్వానికి ప్రజలు ఎల్లవేళలా అండగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కురుమూర్తి దేవస్థానం చైర్మన్ బత్తుల బాలరాజ్ గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు ఎస్. శేఖర్,దేవి,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొర్ల వెంకటేశ్ ఉపాధ్యక్షులు అహ్మద్ గ్రామ, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

## సంక్షేమ బోర్డుతో భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి...
### ఏఐటీయూసీ3వ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలి




**నాగర్ కర్నూల్ జులై 8( స్కైన్యూస్)** భవన నిర్మాణ రంగంపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులను ఆదుకునేందుకు ప్రభుత్వం సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేసి నిధులను విడుదల చేయాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మారేడు శివశంకర్ డిమాండ్ చేశారు బుధవారం బిజినేపల్లి మండల కేంద్రంలో ఏఐటియుసి జిల్లా మూడో మహాసభల కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ బోర్డు ద్వారా 50 సంవత్సరాలు నిండిన కార్మికులకు ప్రతినెల 5000 రూపాయల పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు అనంతరం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశానికి జిల్లా అధ్యక్షులు చిన్నపాగా శ్రీనివాసులు అధ్యక్షత వహించగా ఆయన మాట్లాడుతూ తాడూరు మండల కేంద్రంలో జరిగే మహాసభలను విజయవంతం చేయవలసిన బాధ్యత కార్మికులపై ఉందని అన్నారు. కార్మికుడు సహజ మరణం చెందుతే 2 లక్షల రూపాయల నుండి 5 లక్షల రూపాయల వరకు చెల్లించాలని భవన నిర్మాణ మహిళా కార్మికుల ప్రసూతి కి చెల్లించే డబ్బులను 30 వేల నుండి లక్ష రూపాయలు పెంచాలని కూలి రేట్లు పెంచాలని ప్రతి మండల కేంద్రంలో అడ్డాలను ఏర్పాటు చేయాలని కార్మికులకు సబ్సిడీ కింద మోటార్ సైకిల్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు భవన నిర్మాణ కార్మికులపై నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని అన్నారు ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులు లక్ష్మయ్య కార్యదర్శి వెంకట్రాములు సహాయ కార్యదర్శి నాగయ్య మండల నాయకులు రఫీ లక్ష్మణ్ బంగారయ్య వెంకటయ్య మల్లేష్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజా రవాణా రంగానికి
# అత్యధిక ప్రాధాన్యత...
### దశలవారీగా ప్రజా సంక్షేమ పథకాలు
### మంత్రి పొన్నం కు ఘన స్వాగతం





**తిమ్మాజీపేట / నాగర్ కర్నూల్ జూలై 8 (స్కై న్యూస్)** రాష్ట్రంలో ప్రజా పాలన ప్రభుత్వం ప్రజా రవాణా రంగశీలో ప్రజలకు సౌకర్యాలు కల్పించేందుకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రయాణికులకు బస్టాండ్ లలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు బుధవారం నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేసేందుకు విచ్చేసిన ఆయనకు మండల పరిధిలో స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్ తో పాటు ముఖ్య నేతలు ఘన స్వాగతం పలికి సన్మానించారు అనంతరం మండల కేంద్రంలోని టీజీఎస్ఆర్టిసి బస్టాండ్ ఆవరణలో నూతనంగా నిర్మించానున్న సిసి రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు అదేవిధంగా కలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని బస్టాండ్లలో ఆధునిక వసతులు కల్పించేందుకు బస్ స్టేషన్లను అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిధులను మంజూరు చేయడం జరుగుతుందని వివరించారు. ప్రజలకు నాణ్యమైన సేవలు అందించి ప్రయాణాలలో ఇబ్బందులను తొలగించేందుకు రహదారుల నిర్మాణం ఎంతో దోహదం చేస్తుందని అన్నారు ప్రతి నియోజకవర్గంలో మౌలిక వసతుల కల్పనకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గ్యారెంటీలను అమలు చేస్తూ విద్య వైద్యం వ్యవసాయ రంగాలతో పాటు రవాణా రంగంపై ప్రత్యేక దృష్టి సారించి అభివృద్ధి కార్యక్రమాలను దశలవారీగా పూర్తి చేస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గంలో సమగ్ర అభివృద్ధి కోసం కృషి చేస్తూ ప్రజల అవసరాలే ప్రభుత్వ ప్రాధాన్యతగా రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ఎజెండా అని అన్నారు కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు వివిధ శాఖల అధికారులు నాయకులు కార్యకర్తలు హాజరయ్యారు

## ర్యాలంపాడులో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న మంత్రులు



**జోగులాంబ గద్వాల, జూలై 8 (స్కై న్యూస్/:**ధరూర్ మండలం ర్యాలంపాడులో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఇబ్బందులు పడకుండా ప్రభుత్వం ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో అధికారులను సమాయత్తం చేస్తుందన్నారు. వారి వెంట జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, అధికారులు , నాయకులు ఉన్నారు.

వార్తాతరంగాలు


# ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై నిరాధార ఆరోపణలు మానుకోవాలి...

**ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నీతి, నిజాయితీ కి మరోపేరు.**

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఫీఖ్ అహ్మద్ పటేల్**


రఫీక్ అహ్మద్ పటేల్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు షాద్ నగర్ నియోజకవర్గం

**రంగారెడ్డి జిల్లా జూలై 8 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గం, కొత్తూరు మండలం, సిద్ధాపూర్ గ్రామానికి చెందిన డంపింగ్ యార్డ్ అంశాన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వక్రీకరించి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై ఆధారాలు లేని ఆరోపణలు చేయడం తగదని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన పద్ధతి తీరు మార్చుకోవాలని కేశంపేట్ మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఫీఖ్ అహ్మద్ పటేల్ హితవు పలికారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఫీఖ్ అహ్మద్ పటేల్ మీడియాకు ఓ ప్రకటన విడుదల చేస్తూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి చేసిన రూ,50 కోట్ల ఆరోపణలు పూర్తిగా నిరాధారమని ఆయన పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలకు ఎలాంటి ఆధారాలు ఉన్నా వాటిని ప్రజల ముందుకు తీసుకురావాలని, లేకపోతే వెంటనే వాటిని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఆధారాలు లేకుండా ప్రజాప్రతినిధులపై ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్యానికి మంచిది కాదు అని అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రజా సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తున్న నాయకుడని, సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారం కోసం ప్రభుత్వం దృష్టికి పదేపదే తీసుకెళ్లి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రజల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న నాయకుడిపై అసత్య ప్రచారం చేయడం సరికాదన్నారు. ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలపై దృష్టి పెట్టాల్సిన సమయంలో రాజకీయ విమర్శలతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేయడం బాధ్యతాయుతమైన నాయకులకు తగదని ఆయన అన్నారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ నీతి, నిజాయితీ కి మరోపేరు అని అలాంటి వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని, లేకుంటే ప్రజలే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రఫీకఖ్ అహ్మద్ పటేల్ డిమాండ్ చేశారు.

# రైల్వే డబ్లింగ్ పనులకు భూసేకరణ పూర్తి చేయాలి...



**జోగులాంబ గద్వాల, జూలై 8(స్కై న్యూస్):** రైల్వే డబ్లింగ్ పనులకు జిల్లా పరిధిలో కావాల్సిన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వ ఇరిగేషన్ మరియు రైల్వే లైన్ పనులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియపై బుధవారం ఢిల్లీ నుంచి ఉన్నతాధికారులు సంబంధిత జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. హైదరాబాదు నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పాల్గొనగా జోగులాంబ గద్వాల కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీసీ అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ మహబూబ్ నగర్ నుంచి డోన్ వరకు చేపడుతున్న డబ్లింగ్ రైల్వే లైన్ పనులకు జోగులాంబ గద్వాల జిల్లా పరిధిలో 104 ఎకరాల భూమిని సేకరించాల్సి ఉందన్నారు. ఇప్పటికే సంబంధిత రైతుల నుంచి భూసేకరణ ప్రక్రియ చివరి దశకు చేరుకున్నందున త్వరలోనే అవార్డు పూర్తి చేయాలన్నారు. అవార్డు పూర్తికాగానే రైల్వే అధికారులకు ఈ భూమిని అప్పగించడం జరుగుతుందని ఈ సందర్భంగా కలెక్టర్ పేర్కొన్నారు ఈ సమావేశంలో భూసేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కృష్ణ, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ రామలింగేశ్వర గౌడ్ పాల్గొన్నారు.

# జూలై 10న విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయండి



**మెదక్,జూలై08 (వార్త తరంగాలు):** ఈనెల 10న(శుక్రవారం) ఏఐ ఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన విద్యా సంస్థల బంద్ కు జిల్లాలోనీ అన్ని ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు పూర్తి సహకారం అందించాలనీ ఏఐఎస్ఎఫ్ మెదక్ జిల్లా ఉపాధ్యక్షులు ఎర్రచాకలి పాపయ్య బుధవారం విలేకరులకు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారం -- ప్రభుత్వ విద్య పరిరక్షణ కోసం నిర్వహిస్తున్న ఈబంద్‌ను విజయవంతం చేయాలని పిలుపు ఇచ్చినట్లు ఆయన వెల్లడించారు. విద్యా హక్కు చట్టాన్ని అమలు చేయాలనీ, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేసి విద్యా రంగంలో సమూల మార్పులు తీసుకురావాలనీ సూచించారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలనీ,ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధిక ఫీజుల దోపిడీని అరికట్టాలనీ తెలిపారు. నాణ్యమైన,ఉచిత విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావాలనీ జూలై 10న జరిగే విద్యాసంస్థల బంద్‌ను విద్యార్థులు,యువత, తల్లిదండ్రులు,ప్రజా స్వామ్యవాదులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# కట్ట మైసమ్మ--పోచమ్మ దేవాలయ కమిటీ చైర్మన్‌గా రోమియో రమేష్ బాధ్యతల స్వీకారం



**రంగారెడ్డి జిల్లా జూలై 8 (స్కై న్యూస్):** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని 22వ వార్డు భగత్‌సింగ్ కాలనీ--రతన్ కాలనీలోని శ్రీ కట్ట మైసమ్మ--పోచమ్మ దేవాలయ కమిటీ నూతన చైర్మన్‌గా రోమియో రమేష్ బుధవారం ఘనంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ చైర్మన్ నల్లమోని శ్రీధర్ మూడు సంవత్సరాల పదవీకాలం అనంతరం బాధ్యతలను రోమియో రమేష్‌కు అప్పగించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వం నూతన చైర్మన్‌కు శుభాకాంక్షలు తెలియజేసి, దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం రోమియో రమేష్‌ను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, వేద పండితులు, ప్రజాప్రతినిధులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# 50 కోట్ల ఆరోపణలు నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా..

## షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

## సిద్ధాపూర్ అంశంపై అఖిలపక్ష పోరాటానికి సిద్ధం..

## డంపింగ్ యార్డ్‌ను అడ్డుకోవడమే లక్ష్యమని స్పష్టం






**రంగారెడ్డి జిల్లా, జూలై 8 (స్కై న్యూస్):** సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ అంశం షాద్‌నగర్ రాజకీయాలను మరింత వేడెక్కిస్తోంది. ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి తనపై చేసిన ఆరోపణలను ఖండిస్తూ షాద్‌నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ బుధవారం షాద్‌నగర్ అంబేద్కర్ చౌరస్తాలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఘాటుగా స్పందించారు. తనపై చేసిన రూ.50 కోట్ల ముడుపుల ఆరోపణలను ఆధారాలతో నిరూపిస్తే ఎమ్మెల్యే పదవికి వెంటనే రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ పిలుపు మేరకు ఉదయం నుంచే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో చౌరస్తాకు చేరుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తాను అట్టడుగు వర్గాల నుంచి రాజకీయాల్లో ఎదిగి మండల పార్టీ అధ్యక్షుడిగా, సర్పంచ్‌గా, అనంతరం ఎమ్మెల్యేగా ప్రజల ఆశీర్వాదంతో ఈ స్థాయికి చేరుకున్నానని తెలిపారు. ప్రజల్లో తనకు వస్తున్న ఆదరణను చూసి ఓర్చుకోలేక కొందరు నాయకులు అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. తన రాజకీయ జీవితం గురించి నియోజకవర్గ ప్రజలకు పూర్తి అవగాహన ఉందని, తనపై చేస్తున్న ఆరోపణలు ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమేనని అన్నారు.తనపై రూ.50 కోట్ల ముడుపులు తీసుకున్నారని చేసిన ఆరోపణలను నిరూపించాలని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డికి మరోసారి సవాల్ విసిరిన ఎమ్మెల్యే, ఒక్క రూపాయి అక్రమంగా తీసుకున్నట్లు కూడా ఆధారాలతో రుజువు చేస్తే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. ఆధారాలు లేకుండా వ్యక్తిగత విమర్శలు చేయడం ప్రజాప్రతినిధులకు తగదని సూచించారు. 2018లోనే భూసేకరణకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది సిద్ధాపూర్ అంశానికి సంబంధించి గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్ణయాలను ప్రస్తావించిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, 2018 ఆగస్టు 9న అప్పటి టీఎస్ఐఐసీ ద్వారా సిద్ధాపూర్ ప్రాంతంలో 233 ఎకరాల 10 గుంటల భూమిని పారిశ్రామిక అవసరాల కోసం భూసేకరణ చేయాలని ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలోనే ఈ ప్రక్రియ ప్రారంభమైందని, అనంతరం ఎకో పార్క్ ప్రతిపాదన కూడా అదే నిర్ణయాల కొనసాగింపులో భాగంగా వచ్చిందని చెప్పారు. దీనికి సంబంధించిన ప్రభుత్వ పత్రాలు తమ వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ పి. శంకర్‌రావు హయాంలో పేదలకు పంపిణీ చేసిన అసైన్ భూములను గత ప్రభుత్వం వెనక్కి తీసుకుని పారిశ్రామిక అవసరాల కోసం వినియోగించే ప్రక్రియ చేపట్టిందని ఆరోపించారు. రూ.9 కోట్ల భూ పరిహారం అక్రమాలపై దర్యాప్తు జరుగుతోంది పారిశ్రామిక ప్రాంతం పేరుతో కొందరు బినామీ రైతుల పేర్లపై భూసేకరణ పరిహారం తీసుకున్నారని ఎమ్మెల్యే ఆరోపించారు. సుమారు 80 ఎకరాలకు సంబంధించిన వ్యవహారంలో రూ.9 కోట్లకు పైగా ప్రభుత్వ నిధులు అక్రమంగా పొందినట్లు దర్యాప్తులో వెలుగులోకి వచ్చాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై ప్రభుత్వం విచారణ కొనసాగిస్తోందని, అక్రమాలకు పాల్పడిన వారి ఆస్తులను అటాచ్ చేసే ప్రక్రియ కూడా జరుగుతోందని తెలిపారు.

**అఖిలపక్ష పోరాటానికి సిద్ధం..**

సిద్ధాపూర్ గ్రామ ప్రజల ప్రయోజనాల విషయంలో రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. అన్ని రాజకీయ పార్టీలు, రైతులు, గ్రామస్తులు కలిసి అఖిలపక్ష కమిటీగా ఏర్పడి సమస్య పరిష్కారం కోసం పోరాడితే తాను కూడా వారితో కలిసి ముందుంటానని స్పష్టం చేశారు. ప్రజలకు నష్టం కలిగించే డంపింగ్ యార్డ్ గానీ, ఎకో పార్క్ గానీ సిద్ధాపూర్‌లో ఏర్పాటు కాకుండా అడ్డుకునేందుకు తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సిద్ధాపూర్ సమస్యను కొందరు రాజకీయ ప్రయోజనాల కోసం ఉపయోగించుకోవద్దని, ప్రజలు వాస్తవాలను అర్థం చేసుకుని వివేకంతో వ్యవహరించాలని కోరారు. తాను ప్రజల పక్షాన నిలబడతానని, రైతుల ప్రయోజనాల కోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధంగా ఉంటానని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందె మోహన్, బాబర్ ఖాన్, అంబటి ప్రభాకర్, శేఖర్ రెడ్డి, రఘునాయక్, కృష్ణారెడ్డి, వివిధ మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, కౌన్సిలర్లు, మహిళా నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ ఒకే లక్ష్యం.. రెండు మార్గాలు

**గాంధేయ పోరాటమా..? తీవ్ర వ్యాఖ్యలా..? షాద్‌నగర్ రాజకీయాల్లో చర్చనీయాంశమైన రెండు వైఖరులు**






**రంగారెడ్డి జిల్లా, జూలై 8 (స్కై న్యూస్):** సిద్ధాపూర్ డంపింగ్ యార్డ్ ప్రతిపాదనపై షాద్‌నగర్ రాజకీయాలు మరింత వేడెక్కుతున్నాయి. డంపింగ్ యార్డ్‌ను వ్యతిరేకించాలనే లక్ష్యం ప్రధాన రాజకీయ నాయకుల్లో ఒకేలా కనిపిస్తున్నప్పటికీ, దానిని సాధించేందుకు అనుసరిస్తున్న మార్గాలు మాత్రం భిన్నంగా ఉండటం చర్చనీయాంశంగా మారింది. మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఈ అంశంపై గాంధేయ, రాజ్యాంగబద్ధ మార్గంలో పోరాటం చేస్తామని ప్రకటించారు. వినతిపత్రాలు సమర్పించడం, శాంతియుత నిరసనలు నిర్వహించడం, అవసరమైతే న్యాయస్థానాలను ఆశ్రయించడం ద్వారా ప్రజల హక్కులను కాపాడుతామని ఆయన పేర్కొన్నారు. మరోవైపు, ఇటీవల నిర్వహించిన నిరసన సభలో ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు వివాదానికి దారితీశాయి. ఆ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేయగా, పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. అదేవిధంగా ఈ వ్యవహారంపై ఎమ్మెల్సీ లేదా ఆయన వర్గం అధికారిక స్పందన కూడా పరిగణనలోకి తీసుకోవాల్సి ఉంది. ఇదే సమయంలో డంపింగ్ యార్డ్ ఏర్పాటుకు సంబంధించి రూ.50 కోట్ల ముడుపులు తీసుకున్నారనే ఆరోపణలు కూడా రాజకీయంగా చర్చనీయాంశంగా మారాయి. ఈ ఆరోపణలను కాంగ్రెస్ నాయకులు ఖండిస్తూ, వాస్తవాలపై బహిరంగ చర్చకు సవాల్ విసిరారు.

**సిద్ధాపూర్ ప్రజల ఆకాంక్ష ఏమిటి?**

స్థానిక ప్రజలు మాత్రం రాజకీయ ఘర్షణల కంటే సమస్యకు శాశ్వత పరిష్కారాన్నే కోరుకుంటున్నారు. డంపింగ్ యార్డ్ వల్ల పర్యావరణం, భూగర్భ జలాలు, వ్యవసాయం, ప్రజారోగ్యంపై ఎలాంటి ప్రభావం ఉంటుందో శాస్త్రీయంగా అధ్యయనం చేసి, ప్రజాభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు. డంపింగ్ యార్డ్ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్న బీఆర్ఎస్ లక్ష్యానికి తాజా వివాదం కొంత మేర పక్కదారి పట్టించినట్లు రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఒకే పార్టీలో భిన్న స్వరాలు వినిపించడం అంతర్గత చర్చకు దారితీసిందని విశ్లేషకులు పేర్కొంటున్నారు. మొత్తంగా, సిద్ధాపూర్ సమస్యకు పరిష్కారం రాజకీయ ఘర్షణల్లో కాకుండా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు కలిసి చట్టబద్ధమైన, శాంతియుత మార్గంలో ముందుకు సాగడంలోనే ఉందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ప్రజల ప్రయోజనాలే కేంద్రబిందువుగా ఉండే నిర్ణయాలే ఈ వివాదానికి శాశ్వత పరిష్కారాన్ని చూపగలవని వారు సూచిస్తున్నారు.

# ఘనంగా దివంగత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జన్మదిన వేడుకలు



**దేవరకద్ర, అమరచింత జూలై 8 (స్కై న్యూస్);** తెలంగాణ రాష్ట్ర పశు సమర్ధక శాఖ, పాడి పరిశ్రమ అభివృద్ధి శాఖ, మత్స్య శాఖ, క్రీడలు, యువజన శాఖ మంత్రివర్యులు డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశానుసారం,తెలంగాణ ప్రభుత్వ గీత పారిశ్రామిక సహకార సంస్థ ఫైనాన్స్ కార్పొరేషన్ వైస్ చైర్మన్ కేశం నాగరాజు గౌడ్ సూచనమేరకు బుధవారం అమరచింత మండల అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు రవికాంత్ ఆధ్వర్యంలో ఘనంగా దివంగత నేత డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి 77వ జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అమరచింత మున్సిపల్ చైర్మన్ జింక సువర్ణ రవియాదవ్, డి సి సి కార్యదర్శి రమేష్ ముదిరాజ్, అమరచింత మండల అధ్యక్షులు రాజేందర్ రెడ్డి, అమరచింత పట్టణ అధ్యక్షులు రవికాంత్, కౌన్సిలర్ల్ వనిత ప్రకాశం, రాములు, కోప్షన్ మెంబర్లు తోఫిక్, మణెమ్మ దేవిడ్, మాజీ జడ్పిటిసి సభ్యులు వెంకటయ్య, నాగల్ కద్మూర్ గ్రామ సర్పంచ్ శివ కుమార్, ఉప సర్పంచులు శ్రీధర్ రెడ్డి,మహేశ్ నాయక్, ఎస్ టి సెల్ మండల అధ్యక్షులు హనుమంత్ నాయక్, ఐ ఎన్ టి యు సి మండల అధ్యక్షులు దాస్, జగన్ రెడ్డి, భగవంత్ రెడ్డి, బీసీ రెడ్డి, మోహన్ రెడ్డి, కురుమూర్తి యాదవ్,సుధ, సురేందర్ రెడ్డి,ముని, వెంకట్ రెడ్డి, రంజిత్ రెడ్డి, అంజి గౌడ్, విజయ్, రాజేశ్వర్ రెడ్డి, నర్సింహులు, బాలరాజు, రఘు, వీరేష్ గౌడ్, నరేష్ యాదవ్,పాషా, వినోద్ గౌడ్,రాఘవేంద్ర, పురుషోత్తం, వివిధ గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వైఎస్సార్ సేవలు చిరస్మరణీయం



**షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**రంగారెడ్డి జిల్లా, జూలై 8 (స్కై న్యూస్):** మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి సేవలు చిరస్మరణీయమని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. వైఎస్సార్ జయంతి సందర్భంగా షాద్‌నగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులకు ఉచిత విద్యుత్, జలయజ్ఞం, ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, ఇందిరమ్మ ఇళ్ల వంటి సంక్షేమ పథకాల ద్వారా వైఎస్సార్ ప్రజల గుండెల్లో శాశ్వత స్థానం సంపాదించుకున్నారని కొనియాడారు. ప్రజా సంక్షేమమే ఆయన పాలనకు గుర్తింపుగా నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్మన్ అగ్గనూరు బస్వం, వైస్ చైర్మన్ అందేమోహన్, మండల పార్టీ అధ్యక్షుడు నలమోని శ్రీధర్, షాద్ నగర మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, బాలరాజు గౌడ్, పురుషోత్తం రెడ్డి, రాయికల్ శ్రీనివాస్, కృష్ణారెడ్డి, రఘు నాయక్,జి. శ్రీనివాస్, ముబారక్ అలీ ఖాన్, నియోజకవర్గంలోని మండల పార్టీల అధ్యక్షులు నాయకులు మహిళలు తదితరులు పెద్ద ఎత్తున కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం సద్వినియోగం చేసుకొని
# నిరుపేదలు స్వంత ఇంటి కల నిజం చేసుకోవాలి

**రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి**

**పెద్దపల్లి జిల్లా గోదావరిఖని వార్త తరంగాలు జూలై 8 (స్కై న్యూస్)** ఇందిరమ్మ పథకం లబ్దిదారులతో బుధవారం ఎన్ టి పి సి కాకతీయ కళ్యాణ మండపం లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేటర్లు , వార్డు అధికారులు సమన్వయంతో పని చేసి ఇందిరమ్మ పథకం ద్వారా అర్హులు లబ్ధిపొందేలా చూడాలని అన్నారు. స్వంత స్థలం ఉన్న వారు ఆ స్థలానికి సంబందించి యాజమాన్య దృవీకరణ పత్రాలు , సేల్ డీడ్ , ఇంటి పన్ను రశీదు సమర్పించినట్లయితే ఎల్ 2 నుండి ఎల్ 1 జాబితాలోకి చేర్చడం జరుగుతుందని అన్నారు. ఎల్ 1 జాబితా లో ఉన్న వారు వెంటనే ఇంటి నిర్మాణం ప్రారంభించాలని అన్నారు. ఎల్ 2 జాబితాలో ఉన్న వారికి ఎం ఎల్ ఎ సహకారంతో ప్రభుత్వ స్థలం మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని అన్నారు. గతంలో ఇల్లు మంజూరై నిర్మాణం పూర్తి చేసుకోలేని కుటుంబాలకు కూడా మరోసారి సహాయం అందించాలని నిర్ణయించడం జరిగిందని అన్నారు. బేస్‌మెంట్ స్థాయి వరకు మాత్రమే నిర్మాణం చేపట్టిన వారికి అక్కడి నుంచి నిర్మాణం పూర్తి చేసుకునేందుకు ప్రభుత్వం సహాయం అందిస్తుందని తెలిపారు. ప్రజాపాలనలో గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలకు తొలి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా, ఆన్‌లైన్ విధానంలోనే జరుగుతున్నదని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. ప్రజల నుంచి అందిన దరఖాస్తులను ఎల్–1, ఎల్–2, ఎల్–3 కేటగిరీలుగా విభజించడం జరిగిందని అన్నారు. స్థలం ఉండి ఇందిరమ్మ గృహానికి అర్హులైన వారు ఎల్–1 జాబితాలో ఉంటారని తెలిపారు. ఇందిరమ్మ కమిటీ సిఫారసు చేసిన ఎల్–1 దరఖాస్తులను మున్సిపల్ కమిషనర్ లాగిన్ ద్వారా గెజిటెడ్ అధికారులు పరిశీలిస్తారని, అర్హత నిర్ధారణ అనంతరం మున్సిపల్ కమిషనర్ ద్వారా జిల్లా కలెక్టర్‌కు చేరుతాయని తెలిపారు. అనంతరం ఇన్‌చార్జి మంత్రి



ఆమోదం పొందిన తర్వాత మంజూరు ఉత్తర్వులు జారీ అవుతాయని, మొత్తం ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా ఆన్‌లైన్‌లోనే జరుగుతుందని స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారం ఇల్లు మంజూరైన 45 రోజులలోపు నిర్మాణం ప్రారంభించకపోతే మంజూరును రద్దు చేసే అవకాశం ఉంటుందని తెలిపారు. అయితే రద్దు చేసే ముందు సంబంధిత ప్రజాప్రతినిధులు లబ్ధిదారులతో మాట్లాడి వారి అభిప్రాయాలను తెలుసుకోవాలని, అనంతరం కూడా నిర్మాణం ప్రారంభించకపోతే ఆ ఇళ్లను రద్దు చేసి ఇతర అర్హులైన వారికి కేటాయిస్తామని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ బిల్లులు ప్రతి సోమవారం క్రమం తప్పకుండా విడుదల అవుతున్నాయని, లబ్ధిదారులు నిర్మాణ పురోగతిని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే దానికి అనుగుణంగా చెల్లింపులు జరుగుతాయని తెలిపారు. అర్హత ఉన్నప్పటికీ గతంలో దరఖాస్తు చేసుకోని కుటుంబాలు ప్రజాపాలన కేంద్రాల్లో మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఆ దరఖాస్తులను హైదరాబాద్‌లో 360 డిగ్రీల పరిశీలన అనంతరం అర్హత నిర్ధారించి జిల్లాకు పంపిస్తారని, తర్వాత సాధారణ విధానంలో మంజూరు ప్రక్రియ కొనసాగుతుందని వివరించారు. ట్రాన్స్ జెండర్లు సహా వివిధ వర్గాలకు చెందిన సుమారు 500 కుటుంబాలకు ప్రభుత్వం భూ పట్టాలు 270 మంది ఇంకా



దరఖాస్తు చేయలేదన్నారు. అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే వారికి కూడా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదనపు కలెక్టర్ ( స్థానిక సంస్థలు ) , రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ అరుణ శ్రీ మాట్లాడుతూ ఎల్–1 జాబితాలోని 449 మంది అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని, అయితే వారిలో కేవలం 184 మంది మాత్రమే ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించారని అన్నారు. మంజూరైన లబ్ధిదారులంతా వెంటనే ఇళ్ల నిర్మాణాన్ని ప్రారంభించాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం బేస్మెంట్ 600 చదరపు అడుగులు , స్లాబ్ ఏరియా 750 అడుగులకు లకు మించి ఉండకూడదని అంతకంటే ఎక్కువ విస్తీర్ణంలో నిర్మాణం చేపడితే కంప్యూటర్ ద్వారా బిల్లులు ఆమోదం పొందవని అన్నారు. మొత్తం ప్రక్రియ ఆన్‌లైన్‌లోనే ఉండడంతో తిరస్కరణ బారిన పడకుండా ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ సమావేశంలో రామగుండం నగర డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, పలువురు కార్పొరేటర్లు , గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజేశ్వర్, రామగుండం మండల తహసిల్దార్ రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలి

**కృష్ణ పాండే స్వామీజీ**



**హైద్రాబాద్ జులై 8;**కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఢిల్లీలోని జంతర్ మంతర్ రోడ్ సమీపాన గల ప్రాచీన శివశక్తి ఆశ్రమ వ్యవస్థాపకుడు హైదరాబాదు అబిడ్స్ లోని కాంటినెంటల్ హోటల్ జరిగిన ఆధ్యాత్మిక సత్సంగంలో మాట్లాడుతూ గోవు కుల మత ప్రాంతాలకు అతీతంగా అందరికీ ఉపయోగపడే సాధు జంతువు అని ముఖ్యంగా భారతీయులు గోమాతగా దేవతగా కొలుస్తారని అటువంటి గోవును కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ ప్రాణిగా ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు అన్ని రాజకీయ పార్టీలు స్వచ్ఛంద సేవా సంస్థలు మద్దతిచ్చి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలపై ఒత్తిడి తేవాలని పిలుపునిచ్చారు ముఖ్యంగా గోమాత భక్తులు ఈ కార్యక్రమంలో పాలుపంచుకొని గోవుని జాతీయ ప్రాణిగా ప్రకటించేంతవరకు అవిరామ కృషి చేయాలని భక్తులను ప్రాధేయపడ్డారు కార్యక్రమంలో ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి రాజేందర్ యాదవ్ సామాజికవేత్త కాకి కోటేశ్వరరావు కాంగ్రెస్ పార్టీ మైనార్టీ విభాగం నాయకుడు ఆయుభాయ్, నర్సింగ్ మరియు గోమాత భక్తులు స్వామివారి శిష్యులు పాల్గొన్నారు ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ త్వరలోనే అన్ని రాష్ట్రాలు తిరిగి గోమాత భక్తుల్లో చైతన్యం తీసుకువచ్చి అన్ని పార్టీలపై ఒత్తిడి తెచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు ఈ సందర్భంగా ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కేబీ శ్రీధర్ మాట్లాడుతూ గోవును జాతీయ ప్రాణి గా ప్రకటించడానికి తమ పార్టీ తరపున పూర్తి మద్దతు తెలిపారు

## మక్తల్ లో వైయస్.రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు

**రైతుల పాలిట ఆపద్బాంధవుడు వైఎస్ రాజశేఖర్ రెడ్డి**



**మక్తల్ జులై 8 ( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా మక్తల్ కాంగ్రెస్ టౌన్ ఆధ్వర్యంలో ఘనంగా జయంతి వేడుకలు. రైతుల పాలిట ఆపద్బాంధవుడు వైయస్ రాజశేఖర్ రెడ్డి అని ఆయన హయాంలోనే కాంగ్రెస్ ప్రభుత్వము చేపట్టిన జల యజ్ఞం లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నో ప్రాజెక్టులు నిర్మించారని దీంతో వ్యవసాయం రంగం చాలా అభివృద్ధి చెందిందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా మక్తల్ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో టౌన్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో వైయస్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా వైయస్సార్ సేవలను కొనియాడారు. అయినా చిన్న వయసులోనే ఎమ్మెల్యేగా ఎంపికై ఆరుసార్లు ఎమ్మెల్యేగా నాలుగు సార్లు ఎంపీగా ప్రజా జీవితంలో ఓటమి ఎరుగని నాయకుడిగా వైయస్సార్ ప్రజల మననాలను పొందాడని కీర్తించారు. వైయస్సార్ చేపట్టిన పాదయాత్ర చరిత్ర సృష్టించిందని అధికారంలోకి వచ్చిన తర్వాత రైతులకు ఉచిత విద్యుత్ తో అనేక ప్రాజెక్టులు నిర్మించారని తెలిపారు. పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు తీసుకువచ్చిన ఘనత వైయస్. రాజశేఖర్ రెడ్డి దేనని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు. నాయకులు లక్ష్మారెడ్డి. మార్కెట్ వైస్ చైర్మన్ గణేష్ కుమార్. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్. టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు రవికుమార్. మార్కెట్ డైరెక్టర్లు. కౌన్సిలర్లు. ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## అధిక చార్జీలు వసూలు చేస్తే చట్టపరమైన చర్యలు

**అంబులెన్స్ యజమానులు డ్రైవర్లను హెచ్చరించిన ఎం వి ఐ వెంకట పుల్లయ్య**



**భద్రాచలం జూలై 8 (స్కై న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పి రోహిత్ రాజ్ ఐపీఎస్ ఆదేశాల మేరకు అంబులెన్స్ యజమానులు డ్రైవర్లకు సమావేశం నిర్వహించి, రోగుల నుండి అధిక ఛార్జీలు వసూలు చేసినట్లయితే చట్టపరమైన చర్యలు తీసుకోబడతాయని హెచ్చరించడం జరిగింది. అనంతరం అంబులెన్సులపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, వాహనాల డాక్యుమెంట్లు, ఫిట్‌నెస్, పర్మిట్, ఇన్సూరెన్స్ తదితర పత్రాలను పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంవీఐ వెంకటాపుల్లయ్య , ఏఎంవీఐ ఫారక్, రాజశేఖరరెడ్డి ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతి పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌లో ఎలాంటి పొరపాట్లకు తావివ్వొద్దు: జిల్లా కలెక్టర్ అంకిత్

**సర్వే పూర్తయ్యాకే దరఖాస్తు ఫారాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలి**

**ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, పోషకాహారం అందేలా చర్యలు తీసుకోవాలి**

**అన్నపురెడ్డిపల్లి జూలై 8 (స్కై న్యూస్):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలంలో బుధవారం జిల్లా కలెక్టర్ అంకిత్ విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా అన్నపురెడ్డిపల్లి గ్రామంలోని పోలింగ్ స్టేషన్ నెం. 79 పరిధిలో చేపడుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను పరిశీలించడంతో పాటు గుట్టగూడెం గిరిజన ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా పోలింగ్ స్టేషన్ నెం. 79ను పరిధిలో ఎస్ఐఆర్‌లో భాగంగా కొనసాగుతున్న డిజిటలైజేషన్ ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. బూత్ లెవల్ అధికారులతో మాట్లాడి ప్రక్రియ పురోగతిపై ఆరా తీశారు. ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా, పూర్తి పారదర్శకతతో, భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్ణీత గడువులోగా డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు. గైర్హాజరైన ఓటర్లు, ఇతర ప్రాంతాలకు శాశ్వతంగా మారిన వారు, మరణించిన ఓటర్ల వివరాలను ప్రత్యేక జాబితాల రూపంలో సిద్ధం చేసి అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సర్వే పూర్తయిన అనంతరం మాత్రమే సేకరించిన దరఖాస్తు ఫారాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని, ధృవీకరించని లేదా అసంపూర్ణ వివరాలను ఎట్టి పరిస్థితుల్లోనూ అప్‌లోడ్ చేయరాదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అధికారులు జిల్లా కలెక్టర్‌కు ఎస్ఐఆర్ పురోగతిని వివరించారు. పోలింగ్ స్టేషన్ నెం. 79 పరిధిలో మొత్తం 1,012 దరఖాస్తు ఫారాల పంపిణీ పూర్తయిందని, ఇప్పటివరకు 128 ఫారాలను యాప్‌లో అప్‌లోడ్ చేసినట్లు తెలిపారు. మిగిలిన ఫారాలను కూడా సర్వే పూర్తిచేసి, క్షేత్రస్థాయిలో ధృవీకరించిన



అనంతరమే యాప్‌లో అప్‌లోడ్ చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా ప్రజలతో జిల్లా కలెక్టర్ నేరుగా మాట్లాడి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై ఆరా తీశారు. బూత్ లెవల్ అధికారులు ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరిస్తున్నారా, అవసరమైన దరఖాస్తులు స్వీకరిస్తున్నారా, ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయా అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటరు వివరాలను పరిశీలించి, అవసరమైన మార్పులు, చేర్పులు, తొలగింపులు సకాలంలో చేయించుకోవాలని సూచించారు. అనంతరం అన్నపురెడ్డిపల్లి మండలం గుట్టగూడెం గిరిజన ప్రాథమిక పాఠశాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థుల నమోదు, హాజరు, విద్యాబోధన, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలపై ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం పాఠశాలలో మొత్తం 15 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నట్లు ప్రధానోపాధ్యాయులు జిల్లా కలెక్టర్‌కు



వివరించారు. అనంతరం విద్యార్థులకు వడ్డిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. భోజన నాణ్యత, పరిశుభ్రత, మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్న తీరును తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థులకు ప్రతిరోజూ పోషక విలువలు కలిగిన, నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారాన్ని అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మధ్యాహ్న భోజన నిర్వహణలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావివ్వకుండా నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. తరగతి గదులను పరిశీలించిన జిల్లా కలెక్టర్, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని సూచించారు. విద్యార్థుల్లో అభ్యాస నైపుణ్యాలను పెంపొందించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని అన్నారు. అలాగే పాఠశాల ఆవరణను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు మౌలిక సదుపాయాల నిర్వహణపై నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ తనిఖీల్లో సంబంధిత అధికారులు, బూత్ లెవల్ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## దర్జాగా ప్రభుత్వ భూమి కబ్జా.. ఆపై ఆయిల్ ఫాం సాగు

**భూమి కబ్జాతో బాటలేక పై భూములు బీడు**

**మూడేళ్లుగా రిటైర్డ్ ఉపాధ్యాయుడి పోరాటం**

**పట్టించుకొని అధికారులు**



**నారాయణపేట జూలై 8:( స్కైన్యూస్)** నారాయణపేట మండలం అభాంగాపూర్ శివారులో కోటకొండకు చెందిన వ్యక్తి కరుబసప్ప ప్రభుత్వ భూమిని ఆక్రమించడమే కాకుండా ఆభూమిలో ఆయిల్ ఫాం సాగు చేస్తున్నాడు. అంతే కాకుండా ఆక్రమించిన ప్రభుత్వ భూమి చుట్టూ కంచె వేయడంతో ఆపై భాగంలో ఉన్న దాదాపు 50 ఎకరాలకు పైగా బాటలేక సభ్యులు బీడుగా మారాయి. ఈ విషయాన్ని కోటకొండకు చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడు చంద్రశేఖర్ గత మూడేళ్లుగా పోరాటం చేస్తున్న రెవిన్యూ అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదు. కరుబసప్ప సర్వే నెంబర్ 524 ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు సర్వే లో తేలినా ఈ విషయాన్ని తహశీల్దార్ దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోవడం లేదని చంద్ర శేఖర్ తెలిపారు. ఈ వ్యవహారం మొత్తం తహశీల్దార్ అవినీతి కారణంగానే జరిగిందని తెలిపారు. కాగా ఫిర్యాదు చేస్తే తననే కేసు పెడతానని తహసీల్దార్ భయపెడుతున్నారని అన్నారు. ప్రజావాణిలో పలుమార్లు వినతి పత్రం సమర్పించినా న్యాయం జరుగడం లేదని అన్నారు. జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ భూమిని ఆక్రమించి అక్రమంగా ఆయిల్ ఫాం సాగు చేస్తూ ప్రభుత్వ పరంగా సబ్సిడీ పొందుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని అవ్యక్తి సహకరిస్తున్న నారాయణపేట తహశీల్దార్ పై చర్యలు తీసుకోవాలని కోరారు.

## ఉట్కూరులో డాక్టర్. వైయస్. రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు

**మహానేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు**

**ఉట్కూర్ జులై 8 ( స్కై న్యూస్ )** నారాయణపేట జిల్లా ఉట్కూరు మండలంలో గురువారం రోజు తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు గౌరవనీయులు శ్రీ డాక్టర్ వాకిటి శ్రీహరి గారి ఆదేశంతో నారాయణపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ ప్రశాంత్ రెడ్డి గారి సూచన మేరకు. ఉట్కూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీ సూర్య ప్రకాశ్ రెడ్డి గారి ఆధ్వర్యంలో ఉట్కూరు గ్రామంలో వివిధ గ్రామాల అధ్యక్షులు. గ్రామ సర్పంచులు. వార్డు సభ్యులు. మైనారిటీ నాయకులు. యూత్ కాంగ్రెస్ నాయకులు. మరియు గ్రామ ప్రజల సమక్షంలో ప్రజా హృదయ నేత దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్. రాజశేఖర్ రెడ్డి గారి జయంతి వేడుకలను పాలభిషేకంతో ఘనంగా నిర్వహించారు. రైతు భరోసా పథకం కింద రైతుల



ఖాతాలో నిధులు జమ చేసిన సందర్భంగా పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా మహానేత డాక్టర్ వైయస్. రాజశేఖర్ రెడ్డి గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజా సంక్షేమం కోసం ఆయన చేసిన సేవలను ఆశయ సాధనకు కట్టుబడి పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సి. సూర్యప్రకాశ్ రెడ్డి. పట్టణ అధ్యక్షుడు కొక్కో లింగం. యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోరం మహేశ్వర్ రెడ్డి. మల్లేపల్లి సర్పంచ్ కథలప్ప. నారాయణరెడ్డి. డాక్టర్. శివరామరాజు. బాల్ రెడ్డి. డాక్టర్ రఘువీర్. రాము. జలాల్ గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

## వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు

**నారాయణపేట జూలై 8,: (స్కైన్యూస్)**దివంగత నేత మాజీ ముఖ్య మంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను నారాయణపేట సి వి ఆర్ భవన్ లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రిగా ఎంతో ప్రజాదరణ పొందిన నాయకులు. ఆయన ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్మెంట్ వంటి సంక్షేమ పథకాలు ఎంతో మంది పేదలకు అండగా నిలిచాయి. ఆయన చేసిన సేవలు ప్రజల మనసుల్లో ఎప్పటికీ నిలిచిపోతాయన్నారు. ఆయన సంక్షేమ పథకాలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోట్ల రవీందర్ రెడ్డి, కర్రె వెంకటేష్ గౌడ్, కౌన్సిలర్లు మహేష్, రాజ్



ఘాట్, జిల్లా అధికార ప్రతినిధి వకీల్ సంతోష్, మాజీ మార్కెట్ చైర్మన్ సరేఫ్ నాగరాజు, అమీరుద్దీన్ అడ్వకేట్, బోయ రమేష్, షార్నప్ప భాస్కర్ రెడ్డి సీతారామ్ రెడ్డి పట్టణ మరియు మండల నాయకులు పాల్గొన్నారు.

వార్తాతరంగాలు

గురువారం 09 జూలై 2026

# అభివృద్ధి ప్రణాళికపై సర్పంచులు, కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ

**జూలై 9, 10 తేదీల్లో మూడు కేంద్రాల్లో నిర్వహణ : డీఆర్డీఓ విద్యాచందన**




**కొత్తగూడెం జూలై 8 (స్కై న్యూస్ ):**గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక జీపీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక రూపకల్పన, అమలుపై జిల్లాలోని సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు నియోజకవర్గాల వారీగా శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విద్యాచందన ఒక ప్రకటనలో తెలిపారు.జూలై 9, 2026న ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు కొత్తగూడెం క్లబ్లో కొత్తగూడెం, ఇల్లందు, వైరా నియోజకవర్గాలకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు. అదే రోజు భద్రాచలంలోని వీరభద్ర ఫంక్షన్ హాల్లో భద్రాచలం, పినపాక నియోజకవర్గాలకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించనున్నట్లు తెలిపారు.జూలై 10, 2026న ఉదయం 10.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు పట్వారిగూడెంలోని చలికాని ఆదమ్మ ఫంక్షన్ హాల్లో అశ్వారావుపేట నియోజకవర్గానికి చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు.గ్రామ పంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక తయారీ, గ్రామ అవసరాల గుర్తింపు, ప్రాధాన్యతల నిర్ణయం, అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పన, ప్రభుత్వ మార్గదర్శకాల అమలుపై ఈ శిక్షణలో అవగాహన కల్పించనున్నట్లు డీఆర్డీఓ విద్యాచందన తెలిపారు. సంబంధిత నియోజకవర్గాలకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు నిర్ణీత తేదీ, సమయానికి ఆయా శిక్షణా కేంద్రాలకు తప్పనిసరిగా హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.

# మాజీ ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహంకు పూలమాల వేసి నివాళులర్పించిన మున్సిపాలిటీ చైర్మన్ కొండ దమయంతి



**దేవరకద్ర జూలై 8 ( స్కై న్యూస్);** అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కీర్తి శేషులు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి 77వ జయంతి సందర్బంగా దేవరకద్ర మున్సిపాలిటీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొండ అంజన్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని వై ఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. ఇట్టి కార్యక్రమం లో దేవరకద్ర మున్సిపాలిటీ చైర్ పర్సన్ కొండ దమయంతి గోవర్ధన్ రెడ్డి,వైస్ చైర్మన్ యుగంధర్ రెడ్డి,ఫారూక్ అలీ,కాంగ్రెస్ సీనియర్ నాయకులు బీసు నర్సింహా రెడ్డి,హన్మంత్ రెడ్డి, బాలస్వామి,కౌన్సిలర్లు బాలరాజు, బీరప్ప, భీమన్న,అరుణ చంద్రమౌళి, అంజలి రామాంజనేయులు, లియకత్ అలీ,నాయకులు సప్పటి కృష్ణయ్య,పొట్టలి జగన్, గొల్ల శ్రీను,గౌని రాము,బలుసుపల్లి శంకర్, తిరుపతి,నర్సింహా,బోలగం శ్రీను,శాలి వీరాంజనేయులు,పులి వీరేష్, ఖాదర్, చెన్నప్ప, బంగి రాజు, జక్కిసన్నీ,గోప్లాపూర్ రాజేశ్వర్ రెడ్డి,జవహర్,రాం పండు,నగేష్,బీసు కిరణ్, మల్లప్ప, బాలప్ప తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే ఎమ్మెల్సీ కనుసైగలలోనే అక్రమ అరెస్ట్ లు...

**అవినీతి అక్రమార్కుడికి కొమ్ము ఖాయడం దారుణం**

**చర్యలు తీసుకునే వరకు పోరాటం ఆగదు**

**మాజీ జెడ్పిటిసి శ్రీశైలం**






**నాగర్ కర్నూల్ జులై 8 (స్కై న్యూస్)** మొక్కజొన్న కొనుగోలులో అవినీతి అక్రమాలకు పాల్పడుతూ రైతుల నుండి డబ్బులు వసూలు చేసిన మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు పై విచారణ జరిపించి క్రిమినల్ కేసు నమోదు చేయాలని పోరాటం నిర్వహిస్తుంటే ఆయనకు వత్తాసు పలుకుతూ ఎమ్మెల్యే ఎమ్మెల్సీలు పోలీసులపై ఒత్తిడి తెచ్చి తమను అక్రమంగా అరెస్టులు చేయిస్తున్నారని మాజీ జడ్పిటిసి శ్రీశైలం మండిపడ్డారు. బుధవారం మంత్రి పర్యటన సందర్భంగా మాజీ ఎమ్మెల్యే స్వగృహంలో పలువురు బి ఆర్ ఎస్ నాయకులను ఎమ్మెల్సీ ఎమ్మెల్యే కనుసైగాల తో అరెస్టులు చేశారని అన్నారు. ఉదయం నుండి పలువురు నాయకులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించడం అప్రజా స్వామికమని మండిపడ్డారు. అవినీతిపరులను కాపాడడమే ప్రజా పాలన లక్షణాన్ని నిలదీశారు ఎమ్మెల్యే ఇటీవల రైతులను మోసం చేస్తే ఎంతటి వారైనా అరెస్టు చేయాలని అన్నారని మరి మార్కెట్ చైర్మన్ ఎందుకు కాపాడుతున్నారని ఆయనను ప్రశ్నించారు. రైతులపై చిత్తశుద్ధిని నిరూపించుకునేందుకు మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి నుంచి తొలగించి విచారణకు ఆదేశించాలని రైతుబంధు నిధులను వెంటనే ఖాతాలో జమ చేయాలని రుణమాఫీ అమలు చేసి రైతులకు యూరియా సరఫరా చేయాలని కోరారు. ఎమ్మెల్యే అండదండలతో పలువురు కాంగ్రెస్ నాయకులు ప్రభుత్వ భూములను అక్రమాలకు పాల్పడుతున్నారని అన్ని ఆధారాలను నిరూపిస్తామన్నారు ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కొండకింది మాధవరెడ్డి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటయ్య మాజీ సర్పంచ్ నాగయ్య తో పాటు నాయకులు అధినారపు విష్ణు కిషోర్ గౌడ్ సత్యం శేఖర్ వంశీ బాలు తదితరులు పాల్గొన్నారు

# వేగవంతంగా పారదర్శక సేవలే ప్రభుత్వ లక్ష్యం.....

**బలోపేతం చేసేందుకే అధునాతన బస్ స్టేషన్లు.**

**సామాజిక న్యాయం ప్రజా సంక్షేమానికే ప్రాధాన్యం.**

**మహిళా భద్రతకే భరోసా కేంద్రాలు.**

**ప్రభుత్వ విద్య బలోపేతమే ప్రజాపాలన ఎజెండా.**

**రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్.**









**నాగర్ కర్నూల్ జులై 8 (స్కై న్యూస్)** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శక సేవలను వేగవంతంగా ప్రజలకు అందించేందుకే ప్రజా పాలన సాగిస్తూ అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడం జరుగుతుందని రాష్ట్ర రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు బుధవారం జిల్లాలో పర్యటించేందుకు తిమ్మాజీపేటకు చేరుకున్న ఆయనకు స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికి సన్మానించారు అనంతరం తిమ్మాజీపేట టీజీఎస్ఆర్టిసి బస్టాండ్ లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు అనంతరం బిజినపల్లి మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని పురస్కరించుకొని నాయకులు కార్యకర్తలు తో కలిసి కేకు కట్ చేశారు అనంతరం పాలెం గ్రామంలో నూతన సబ్ స్టేషన్ ప్రారంభించారు అనంతరం జిల్లా కేంద్రానికి చేరుకున్న ఆయనకు మునిసిపాల్ చైర్మన్ తీగల సునింద్ర కుమార్ వైస్ చైర్మన్ బాదం రమేష్ తో పాటు కౌన్సిలర్లు స్వాగతం పలికారు ఉయ్యాలవాడ సమీపంలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసి విద్యార్థులతో వసతి సౌకర్యాలపై మరియు అందుతున్న భోజన నాణ్యత పై తెలుసుకున్నారు అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని ప్రభుత్వ విద్యను బలోపేతం చేసేందుకు గురుకులాలను అభివృద్ధి చేయడంతో పాటు సౌకర్యాలను కల్పించడం జరుగుతుందన్నారు విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో విద్యను అభ్యసించి ఉన్నత స్థానాలకు చేరుకోవడంతోపాటు సామాజిక మార్పుకు కృషి చేయాలని కోరారు. విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు పోటీ పరీక్షలలో ప్రతిభ కనబరిచేలా విద్యార్థులను తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులకు సూచించారు పాఠశాలలో సోలార్ గీజర్ ఏర్పాటుకు ప్రతిపాదనలో సిద్ధం చేయాలని బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి సైదులు హాలో ఆదేశించారు పరిసరాలను వంటగదిని పరిశీలించారు. అనంతరం జిల్లా కేంద్రంలో నిర్మించిన భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భరోసా కేంద్రాలు విద్యార్థినిల మరియు మహిళల భద్రతకు నిరంతరం పనిచేస్తుందని అన్నారు. మహిళలపై జరుగుతున్న వేధింపులు హింస లైంగిక దాడుల వంటి ఘటనలలో బాధితులకు తక్షణ సహాయం చట్టపరమైన రక్షణ వైద్య సేవలు మానసిక పరామర్శ కౌన్సిలింగ్ లాంటి సేవలను ఒకే చోట అందించేందుకు జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందని వివరించారు. సందర్భంగా ఆయన నిర్వాహకులతో వారు అందిస్తున్న సేవలను తెలుసుకున్నారు బాధితులకు మానవీయ దృక్పథంతో వ్యవహరిస్తూ సంవత్సరంలో పరిష్కరించాలని సూచించారు భరోసా కేంద్రం మరింత సమర్థవంతంగా సేవలు అందించాలని సూచించారు అనంతరం భరోసా కేంద్ర ఆవరణలో మంత్రి పొన్నం ప్రభాకర్ మొక్కలు నాటారు అనంతరం 50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించిన నూతన జిల్లా రవాణా శాఖ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు మరింత పారదర్శకమైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. రవాణా శాఖ సేవలను మరింత సులభతరం చేసేందుకు నూతన భవనంలో మెరుగైన మౌలిక వసతులు కల్పించడం జరిగిందని తెలిపారు కార్యాలయానికి చేరుకునే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలని సూచించారు డ్రైవింగ్ లైసెన్సులు వాహనాల రిజిస్ట్రేషన్లు పరిమితులు ఫిట్నెస్ సర్టిఫికెట్లు ఇతర రవాణా సంబంధిత సేవలు వేగంగా పారదర్శకంగా అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అభివృద్ధి వికేంద్రీకరణకు రాష్ట్ర ప్రభుత్వం పెట్టపీట వేస్తుందని అన్నారు అనంతరం జిల్లా కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వైఎస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రైతులు పేదలు బడిన వర్గాలకు విశిష్ట సేవలు అందించి ఆరోగ్య శ్రీ పథకం ద్వారా వేలాది మంది ప్రాణాలను కాపాడడం జరిగిందని వివరించారు. ఆయన ఆశయాలను సంక్షేమ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకొని ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు సాగుతున్నామని తెలిపారు అనంతరం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా ఆయన చేసిన పోరాటాలను స్మరించుకొని ఆత్మగౌరవం కోసం సమానత్వం సామాజిక న్యాయం కోసం ముందుకు రావాలని కోరారు అనంతరం బస్ డిపో సమీపంలో 12 కోట్ల వ్యయంతో నూతనంగా నిర్మించనున్న టీజీఎస్ ఆర్టీసీ బస్ స్టేషన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికులకు విశాలమైన వేచి ఉంటే హాల్స్ తోపాటు డిజిటల్ సమాచారం వ్యవస్థ పార్కింగ్ సదుపాయాలతో పాటు తాగునీటి వసతి మరుగుదొడ్లు దివ్యాంగులకు ప్రత్యేక సౌకర్యాలు వంటి అత్యాధునిక వసతులతో నూతనంగా బస్టాండ్ నిర్మించడం జరుగుతుందని తెలిపారు. గత 47 ఏళ్ల క్రితం బస్టాండ్ నిర్మించాలని ఎదుగుతున్న జనాభా జిల్లా కేంద్రం ఏర్పాటుతో స్థానిక ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డిల విజ్ఞప్తి మేరకు నూతన బస్టాండ్ నిర్మాణానికి 12 కోట్ల నిధులను మంజూరు చేయడం జరిగిందని ఈ నిర్ణయం చారిత్రాత్మక ఘట్టం అని అన్నారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జి పాటిల్ టీజీఎస్ ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు మున్సిపల్ చైర్మన్ తీగల సురేంద్ర కుమార్ వైస్ చైర్మన్ బాదం రమేష్ డిటిఓ ఇమ్రాన్ అహ్మద్ జిల్లా అదనపు కలెక్టర్లు దేవ సహాయం అరుణ రెడ్డి ఆర్డిఓ అర్చన భరోసా కేంద్ర కోఆర్డినేటర్ శ్రీలత తో పాటు ప్రజాప్రతినిధులు అధికారులు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# మహిళల జీవితాలలో మహాలక్ష్మి మార్పు

**ఆదర్శ బస్టాండుగా తీర్చిదిద్దుతాం.**

**కోట్లాది నిధులతో సౌకర్యాలు.**

**బస్టాండ్ నిర్మాణ శంకుస్థాపనలో**

**మంత్రులు ఎమ్మెల్యే ఎమ్మెల్సీ**





**నాగర్ కర్నూల్ జులై 8( స్కై న్యూస్)** రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళా సంక్షేమానికి ప్రవేశపెట్టిన మహాలక్ష్మి పథకం ద్వారా మహిళల జీవితాలలో ఎంతో మార్పు సాధించడం జరిగిందని వ్యాపార రంగంలో రాణిస్తూ ఆర్థికంగా ఎదుగుతున్నారని రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ రాష్ట్ర ఎక్సైజ్ మరియు పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి లు అన్నారు బుధవారం జిల్లా కేంద్రంలో 12 కోట్ల నిధులతో నిర్మించే తలపెట్టిన అత్యాధునిక బస్టాండ్ పనులకు శంకుస్థాపన చేశారు ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభకు ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథి మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అప్పుల సమయంలో ఉన్న ఆర్టీసీని లాభాల బాటలో పయనించేందుకు అన్ని విధాలా కృషి చేయడం జరిగిందన్నారు 365 వ నూతన బస్టాండుగా నిలుస్తుందని అన్నారు నాలుగు ఎకరాల స్థలంలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం తో నిర్మించనున్న బస్టాండులో ప్రయాణికులకు ఆధునిక సౌకర్యాలు భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా వాణిజ్య సముదాయాలు షాపింగ్ కాంప్లెక్స్ లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆర్టీసీ రాష్ట్రవ్యాప్తంగా 1070 బస్సులు 97 డిపోలు 364 బస్టాండ్లు సుమారు 55,000 మంది ఉద్యోగులతో మనుగడ సాగిస్తూ ప్రతిరోజు సుమారు 65 లక్షల మంది ప్రయాణికులను సురక్షితంగా గమ్యే స్థానాలకు చేర్చడం జరుగుతుందని తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు 326 కోట్లకు పైగా మహిళలు ఉచిత బస్సు ప్రయాణం చేశారని పథకం ద్వారా 11377 కోట్ల నిధులను ఆదా చేసుకున్నారని వివరించారు. ప్రభుత్వం మహిళలను బస్సుల యజమానులుగా తీర్చిదిద్దేందుకు ఆర్థిక భరోసా కల్పిస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను కూడా పరిష్కరించడం జరుగుతుందన్నారు వివిధ కారణాలతో ఉద్యోగాలకు దూరమైన 355 మంది ఉద్యోగులను తిరిగి నియామక పత్రాలు అందించడం జరిగిందని అన్నారు. సంస్థ బలోపేతంలో సిబ్బంది కీలకపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా పూర్తి చేయాలని ఓటు హక్కును పరిరక్షించుకోవాలని కోరారు నీటి వినియోగాన్ని తగ్గించుకొని రైతులు తక్కువ నీటితో అధిక లాభాలు వచ్చే పంటలపై దృష్టి సారించాలని సూచించారు రాష్ట్ర ప్రభుత్వంపై అనేక వత్తులు ఉన్నప్పటికీ సంక్షేమ కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు వివరించారు. సందర్భంగా రాష్ట్ర ఎక్సైజ్ పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ లక్షలాదిమంది మహిళలు ప్రతినిత్యం ఉచితంగా ప్రయాణిస్తూ ఆర్థిక భారాన్ని తగ్గించుకుంటున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన మంత్రి పొన్నం ప్రభాకర్ రవాణా శాఖకు మంత్రిగా కొనసాగుతూ సంస్థలు సమర్థవంతంగా నడిపిస్తూ లాభాలలో సంస్థలు తీసుకువచ్చారని తెలిపారు గత ప్రభుత్వం చేసిన అప్పులకు భారీగా వడ్డీలు చెల్లిస్తూ ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తున్నామని తెలిపారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి విద్యావంతుడు కావడం వల్ల విద్య వైద్యం వ్యవసాయం ఉపాధి రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తూ గతంలో ఎన్నడూ లేని విధంగా నిధులను నియోజకవర్గ అభివృద్ధికి తరలించుకొని ముందుకు సాగుతున్నారని ఆయనకు అండగా నిలవాలని కోరారు ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను అమలు చేయడంతో పాటు ఉయ్యాలవాడ శివారులో 200 కోట్ల నిధులతో ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణం చేపట్టడం జరిగిందని అదేవిధంగా 12 కోట్లతో నూతన బస్టాండ్ నిర్మాణం 50 లక్షలతో ఆర్టీవో కార్యాలయం నిర్మించడం జరిగిందని కోట్ల రూపాయల వ్యయంతో రహదారుల నిర్మాణాలు మౌలిక వసతుల కల్పనకు కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. నూతన బస్టాండ్ నిర్మాణంతో పట్టణ రూపురేఖలు మారిపోతాయని రియల్ ఎస్టేట్ వాణిజ్య రంగం ఉపాధి అవకాశాలు గణనీయంగా పెరుగుతాయని తెలిపారు రాష్ట్ర ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ నాగిరెడ్డి మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం అంతర్జాతీయ స్థాయిలో చెప్పుకోదగ్గ పథకమని అన్నారు. నూతన బస్టాండులో విశాలమైన ప్లాట్ఫారాలు వేచి ఉండేందుకు గదుల నిర్మాణం మల్టీప్లెక్స్ లేదా సినిమా థియేటర్ ఏర్పాటు చేసుకున్న అవకాశాలు ఉండే విధంగా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు అనంతరం నాగర్ కర్నూల్ నుండి వయా తూడుకుర్తి మీదుగా వనపర్తి కి వెళ్లే బస్సులు ప్రారంభించి ప్రయాణించారు ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు దేవ సహాయం అరుణారెడ్డి మునిసిపల్ చైర్మన్ సునీంద్ర కుమార్ మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్ మున్సిపల్ వైస్ చైర్మన్ బాదం రమేష్ కౌన్సిలర్లు ఆర్టీసీ అధికారులు మహిళలు సిబ్బంది అధిక సంఖ్యలో పాల్గొన్నారు

వార్తాతరంగాలు



# జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. తుకారామ్ రాథోడ్ ఆకస్మిక తనిఖీలు

## విద్యార్థులకు ఉచిత కంటి పరీక్షల కార్యక్రమం ప్రారంభం

**పాల్వంచ జూలై 8 (స్కై న్యూస్ ):**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. తుకారామ్ రాథోడ్ పాల్వంచ పట్టణ ఆరోగ్య కేంద్రం యూపీహెచ్సి గుడిపాడు కుటుంబ సంక్షేమ కేంద్రం కొత్తగూడెంను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఇమ్యూనైజేషన్ కార్యక్రమంలో వినియోగిస్తున్న ఐ ఎల్ ఆర్ ఫ్రిజ్‌లలో నిల్వ ఉంచిన టీకాలను పరిశీలించారు. ముందస్తుగా సిద్ధం చేసిన పిల్లల ఇమ్యూనైజేషన్ జాబితాలను పరిశీలించి, ఏఎన్ఎంలు తీసుకెళ్లిన వ్యాక్సిన్ వైల్స్ వినియోగం, తిరిగి అప్పగించిన వైల్స్ వివరాలను ఫార్మసిస్ట్‌ను అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సిన్ నిల్వ, నిర్వహణ విధానంపై సంతృప్తి వ్యక్తం చేస్తూ సంబంధిత సిబ్బందిని అభినందించారు.అనంతరం నవ లిమిటెడ్ -- నవభారత్ సంస్థ సి.ఎస్.ఆర్ ఆధ్వర్యంలో పాల్వంచ మండలం ఎర్రగుంట గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నిర్వహిస్తున్న ఉచిత కంటి పరీక్షల కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. తుకారామ్ రాథోడ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి





మాట్లాడుతూ, సరైన విధంగా చేతులు కడుక్కోవడం ద్వారా అనేక అంటువ్యాధులను నివారించవచ్చని తెలిపారు. నులిపురుగుల నివారణ కోసం ప్రభుత్వం అందిస్తున్న డీ-వార్మింగ్ మాత్రలను తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. అలాగే కంటి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి సమయానికి పరీక్షలు చేయించుకోవడం, సమతుల్య పోషకాహారం తీసుకోవడం, పరిశుభ్రత పాటించడం ఎంతో అవసరమని వివరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీమతి డి.వాసంతి , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి సుధారాణి, నవ లిమిటెడ్ సి ఎస్ ఆర్ అధికారి చందర్ రావు, నవభారత్ కంటి ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ దేవ్ చందర్ రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# సి ఎం,మంత్రి,ఎమ్మెల్యే లకు కాంగ్రెస్ నాయకుల పాలాభిషేకం

**నారాయణపేట జూలై 8: (స్కైన్యూస్)** నారాయణపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులకు రైతు భరోసా నిధులను సకాలంలో జమ చేసిన రాష్ట్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలుపుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ,వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు,



ఎమ్మెల్యే చిట్టెం పర్ణిక రెడ్డి, కుంభం శివకుమార్ రెడ్డి చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రైతు సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని రైతు భరోసా నిధులను రైతులు సక్రమంగా వినియోగించుకోవాలి అని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు.రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. రైతుల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, భవిష్యత్తులో కూడా రైతు సంక్షేమానికి ప్రభుత్వం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తుందని నాయకులు అన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కర్రే వెంకటేష్ గౌడ్,మండల అధ్యక్షులు కోట్ల రవీందర్ రెడ్డి పాటు పార్టీ నాయకులు, కౌన్సిలర్లు మహేష్, రాజ్ ఘాట్, జిల్లా అధికార ప్రతినిధి వకీల్ సంతోష్, మాజీ మార్కెట్ చైర్మన్ సరేఫ్ నాగరాజు, అమీరుద్దీన్ అడ్వకేట్, బోయ రమేష్, షార్నప్ప భాస్కర్ రెడ్డి సీతారామ్ రెడ్డి పట్టణ మరియు మండల నాయకులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించాలి

**నాగర్ కర్నూల్ జిల్లా8( స్కై న్యూస్)** రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో లక్షలాదిమంది పేద మధ్యతరగతి బడుగు బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారని వారందరికీ ఉచితంగా బస్సు సౌకర్యం కల్పించాలని బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ కోరారు బుధవారం జిల్లా కేంద్రానికి చేరుకున్న రాష్ట్ర రవాణా



శాఖ మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కు వినతి పత్రం సమర్పించారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఒకటవ తరగతి నుండి ఏడవ తరగతి చదివే విద్యార్థులకు మాత్రమే ఉచితంగా బస్సు పాసులు పంపిణీ చేస్తుందని అలా కాకుండా ప్రతి విద్యార్థికి ఉచితంగా బస్సు పాసులు కల్పించి ఆదుకోవాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలలో అనేకమంది కాయ కష్టం పై ఆధారపడి జీవిస్తున్న తల్లిదండ్రుల పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నారని బస్ పాస్ ఫీజు చెల్లించేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఈ సందర్భంగా తెలిపారు కొన్ని పర్యాయాలు పరీక్షలకు కూడా హాజరు కాలేని పరిస్థితి ఏర్పడిందని వెంటనే ఇంటర్మీడియట్ విద్య వరకు ఉచిత బస్పాసులు ఇవ్వాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రామచందర్ నాయక్ శరత్ తదితరులు పాల్గొన్నారు

# సి ఎం నియోజకవర్గంలో అభివృద్ధి పనులు పర్యవేక్షించిన కలెక్టర్

**నారాయణపేట జూలై 8: (స్కైన్యూస్)** రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి ప్రధాన కార్యదర్శి ఎన్. శ్రీధర్ బుధవారం కొడంగల్ నియోజకవర్గం, నారాయణపేట జిల్లాలోని కోస్గి పట్టణంలో పర్యటించి ఇక్కడ కొనసాగుతున్న పలు అభివృద్ధి పనులను జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక, కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి తో కలిసి పరిశీలించారు. కోస్గి పర్యటనకు వచ్చిన సీఎం ప్రధాన కార్యదర్శి ఎన్ శ్రీధర్ కు కోస్గి మున్సిపాలిటీ వద్ద జిల్లా కలెక్టర్ ప్రియాంక పూల మొక్క ఇచ్చి స్వాగతం పలికారు. అనంతరం ఆయన కోస్గి పట్టణంలో కొనసాగుతున్న ప్రధాన రహదారి విస్తరణ పనులు, అరబిందో ఫార్మా ఫౌండేషన్ సహకారంతో నిర్మించిన ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనం, సైన్స్ మ్యూజియం, అమృత్ పథకం కింద నిర్మిస్తున్న ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ పనులను పరిశీలించారు. అరబిందో ఫార్మా ఫౌండేషన్ ద్వారా నిర్మించిన పాఠశాల భవనం చుట్టూ ప్రహరీని నిర్మించి



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటాలని అధికారులకు సూచించారు. సైన్స్ మ్యూజియం నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తవుతాయని, మ్యూజియంలో ఏర్పాటు చేసే పరికరాలు, తదితర వాటి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. హైదరాబాద్ లోని బిర్లా మ్యూజియం నుంచి అత్యాధునిక సైన్స్ పరికరాలు, ప్రదర్శన వస్తువులను ఇక్కడి మ్యూజియంలో ఏర్పాటు చేసి విద్యార్థులకు అందుబాటులో ఉంచడం జరుగుతుందని సంబంధిత అధికారులు సీఎం ప్రధాన కార్యదర్శి ఎన్ శ్రీధర్ కు వివరించారు. అమృత్ పథకం లో భాగంగా చేపట్టిన ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రజారోగ్య శాఖ ఈ ఎన్ సీ భాస్కర్ రెడ్డి,ఎస్.ఈ లు వెంకటేశ్వర్లు, చిన్నారావు, ఈ ఈ విజయ భాస్కర్ రెడ్డి, ఆర్ అండ్ బీ అధికారులు, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ వార్ల విజయ్ కుమార్, కోస్గి మున్సిపల్ కమిషనర్ నాగరాజు, ఏ ఈ జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

# తుంగతుర్తి కాంగ్రెస్‌లో అసంతృప్తి..

## ఎమ్మెల్యే మందుల సామేల్‌కు వ్యతిరేకంగా గాంధీ భవన్ ముందు కాంగ్రెస్ నేతల ఆందోళన

**హైద్రాబాద్ జూలై 8:**తుంగతుర్తినియోజకవర్గంలో కొత్తగా ప్రకటించిన మండల స్థాయి కాంగ్రెస్ కమిటీలను వ్యతిరేకిస్తూ సీనియర్ కాంగ్రెస్ నాయకులు, సర్పంచ్‌లు, ఉపసర్పంచ్‌లు, వార్డు సభ్యులు, కార్యకర్తలు ఆందోళన చేపట్టారు.ఏళ్ల తరబడి కాంగ్రెస్ పార్టీ కోసం పనిచేసిన వారిని పక్కనబెట్టి, ఇటీవల బీఆర్ఎస్



నుంచి కాంగ్రెస్‌లో చేరిన వారికి పార్టీ పదవులు ఇవ్వడం అన్యాయమని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.సీనియర్ కాంగ్రెస్ నాయకులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, మండల కమిటీలను రద్దు చేసి నిజమైన కాంగ్రెస్ కార్యకర్తలతో కొత్త కమిటీలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఆందోళన సందర్భంగా ఎమ్మెల్యే మందుల సామేల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ, కాంగ్రెస్ పార్టీని కాపాడాలని పార్టీ అధిష్ఠానాన్ని కోరారు.

# ఎవరిని తప్పులు చేసినా AI పట్టేస్తుంది అడిషనల్ కలెక్టర్

## SIR ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని నారాయణపేట జిల్లా అడిషనల్ కలెక్టర్( రెవెన్యూ) శ్రీను పిలుపునిచ్చారు.

**మక్తల్ జూలై 8 ( స్కై న్యూస్)** నారాయణపేట జిల్లా మక్తల్ లో ూ×= ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయడానికి ప్రతి ఒక్కరు బాధ్యత తీసుకోవాలని నారాయణపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ శీను పిలుపునిచ్చారు. బుధవారం మక్తల్ వీ=ూ కార్యాలయంలో పార్టీ నాయకులు అధికారులతో వీ=ూ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ మాట్లాడుతూ. ఎస్ ఐ ఆర్ నమోదులో డబుల్ ఎంట్రీలు. షిఫ్టింగ్. మృతి చెందిన వారి వివరాల నమోదు వంటి తప్పులను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ూ×) దక్షిణమే గుర్తించేస్తుందని స్పష్టం చేశారు. బి ఎల్ ఓ లు లేదా ఇన్చార్జీలు పనిచేయడానికి నామోజుగా భావించకుండా బాధ్యత రైతంగా నిర్వహించాలని సూచించారు. ఈనెల 20వ



తేదీ లోపు ఇలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. జులై 31న వెలువడే జాబితాతో బిఎల్వోలు. ఇన్చార్జిల పనితీరు దాని బట్టి ప్రభుత్వము తదుపరి చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. ఎస్ ఐ ఆర్ నమోదుకు కావలసిన అన్ని వివరాలను సేకరించి దరఖాస్తులను పగడ్బందీగా నింపాలి. ఈనెల 24వ తేదీ నాటికి ప్రభుత్వం నిర్దేశించిన పనులను పూర్తి చేసే. రాబోయే రెండు నెలలు బిఎల్ఓ లకు ఎలాంటి ఇబ్బంది ఉంటదని తెలిపారు. సేకరించిన వివరాలను ఎప్పటికప్పుడు కంప్యూటర్లో పక్కాగా నమోదు చేయాలి. నమోదు ప్రక్రియలో ఏవైనా సందేహాలు ఉంటే స్థానిక ఎమ్మార్వో కు లేదా నేరుగా తనకు ఫోన్ చేసి సందేహాలు తీసుకోవాలి. అని అడిషనల్ కలెక్టర్ తెలిపారు. ఒక బాధ్యతయుతమైన పౌరుడిగా ప్రతి ఒక్కరూ స్వచ్ఛత రైతంగా ఈ సర్వే ప్రక్రియ లో భాగస్వాములు కావాలని కోరారు. ఈ సమావేశంలో ఎమ్మార్వో సతీష్ కుమార్. వివిధ రాజకీయ పార్టీల నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# జూలై 10న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

**జోగులాంబ గద్వాల, జూలై 8 ( స్కై న్యూస్):** గట్టు మండల కేంద్రంలో సమావేశంలో పి డి ఈ యు జిల్లా అధ్యక్షులు హాలింపాష మాట్లాడుతూ
రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయడం, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించడం, ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజు దోపిడీని అరికట్టడం వంటి డిమాండ్ల సాధన కోసం జూలై 10న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

**డిమాండ్స్:**

రాష్ట్రంలో 27 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేలకు కుదించాలనే ఆలోచనను మానుకోవాలి. విద్యాశాఖను బలోపేతం చేయాలి.ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు రిజర్వ్ బెంచ్ యూనిఫామ్స్, పాఠ్యపుస్తకాలు అందించాలి.మధ్యాహ్న భోజన పథకానికి నిధులు పెంచి, నాణ్యమైన భోజనం అందించాలి.ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల అక్రమ ఫీజు దోపిడీని అరికట్టాలి.ఖాళీగా ఉన్న టీచర్, ఎం ఈ ఓ ,డి ఈ ఓమరియు ఇతర పోస్టులను భర్తీ చేయాలి.మెగా డీఎస్సీ ద్వారా టీచర్ ఉద్యోగాలను భర్తీ చేసి, బీఈడ్ చేసిన వారికి ఉపాధి కల్పించాలి.ఇంటర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలి.అన్ని ప్రభుత్వ హాస్టళ్లలో నాణ్యమైన భోజనం, మౌలిక సదుపాయాలు కల్పించాలి.ప్రభుత్వ పాఠశాలలకు కంప్యూటర్ ల్యాబ్‌లు, మరుగుదొడ్లు వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలి.విద్యార్థులకు ఉచిత రవాణా సౌకర్యం కల్పించి, బస్ పాసులు ఇవ్వాలి.ప్రైవేట్ పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్న ఫీజులను నియంత్రించాలి.2ప్రభుత్వ పాఠశాలల్లో కరెంట్, ఇంటర్నెట్, తాగునీరు, పరిశుభ్రత వంటి సౌకర్యాలు కల్పించాలి.విద్యాసంస్థల్లో ర్యాగింగ్, లైంగిక వేధింపులు, డ్రగ్స్‌ను నిర్మూలించి ×జజ కమిటీలు ఏర్పాటు చేయాలి.
విద్యపై ప్రభుత్వ ఖర్చును జి పి పిలో కనీసం 25%కు పెంచాలి.రాష్ట్రంలో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలి.కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసి, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి.ఎన్ ఈ జూఱఎ2020ను రద్దు చేసి, ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి.పీడీఎస్ యు నాయకులు చిరంజీవి, హమీద్, ప్రకాష్, రవి, తదితరులు పాలుగోన్నారు

# ఆహార భద్రత చట్ట సవరణలు ఉపసంహరించుకోవాలి

**రంగారెడ్డి జిల్లా జూలై 8 (స్కై న్యూస్):** ఎన్‌పీఆర్‌డీ జాతీయ ఆహార భద్రతా చట్టం (ఎన్ ఎఫ్ ఎస్ ఏ)కు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సవరణలను వెంటనే ఉపసంహరించుకోవాలని ఎన్‌పీఆర్‌డీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగారెడ్డి డిమాండ్ చేశారు. ఈ సవరణల వల్ల పేదలు, దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులు, గిరిజనులు తదితర బలహీన వర్గాల ఆహార భద్రతకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సవరణలను రద్దు చేయకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు.



# షాద్‌నగర్ బైపాస్ పనులపై స్థానికుల ఆందోళన

**రంగారెడ్డి జిల్లా జులై 8 (స్కై న్యూస్)** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ బైపాస్ విస్తరణ పనుల్లో భాగంగా నిర్మిస్తున్న డ్రైనేజీ కాలువ వల్ల ఇళ్లు, దుకాణాలకు రాకపోకలు ఇబ్బందిగా మారుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. రహదారి కంటే ఎత్తులో డ్రైనేజీ నిర్మాణం చేపట్టడంతో తమ ఆస్తులకు చేరుకునే మార్గం మూసుకుపోతుందని పేర్కొంటూ



బుధవారం ఎన్‌హెచ్‌ఏ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ర్యాంపులు, ప్రవేశ మార్గాలు ఏర్పాటు చేసి పనులు చేపట్టాలని కోరారు.

# పిత్తాశయ రాళ్లను నిర్లక్ష్యం చేయొద్దు

డా. శ్రీమన్నారాయణ

**నల్గొండ:** ప్రస్తుతం పిత్తాశయ రాళ్ల **(Gall Bladder Stones)** సమస్య వయస్సు, లింగ భేదం లేకుండా అన్ని వర్గాల వారిలో పెరుగుతోందని, ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే తీవ్రమైన ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని యశోద హాస్పిటల్స్, సోమాజిగూడకు చెందిన సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డా. శ్రీమన్నారాయణ అన్నారు.నల్గొండలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో ఈ సమస్య ప్రధానంగా 40 సంవత్సరాలు దాటిన, అధిక బరువు ఉన్న మరియు పలుమార్లు గర్భం దాల్చిన మహిళల్లో ఎక్కువగా కనిపించేదని, ప్రస్తుతం పిల్లల నుంచి పెద్దల వరకు అందరిలోనూ ఈ సమస్యను గుర్తిస్తున్నామని తెలిపారు.పిల్లల్లో జంక్ ఫుడ్ అధికంగా తీసుకోవడం, తగినంత నీరు తాగకపోవడం, కొన్ని రక్త సంబంధిత వ్యాధులు ప్రధాన కారణాలుగా ఉంటే, పెద్దల్లో బయట ఆహారం ఎక్కువగా తీసుకోవడం, అధిక కొవ్వు పదార్థాలు తినడం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, ఒకేసారి ఎక్కువగా భోజనం చేయడం (దీఱఅస్త్రవ జుఫ్ఱఅస్త్ర), ప్రసవానంతర





మార్పులు వంటి కారణాలు పిత్తాశయ రాళ్లకు దారితీస్తున్నాయని వివరించారు.గ్యాస్ సమస్య, కడుపు నొప్పి, ముఖ్యంగా కుడివైపు పై పొత్తికడుపులో నొప్పి, వెన్నునొప్పి, కడుపు ఉబ్బరం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచించారు. చికిత్స ఆలస్యం చేస్తే కామెర్లు **(Jaundice)**, జ్వరం, ప్యాంక్రియాటైటిస్ **(Pancreatitis)**, సెప్సిస్ **(Sepsis)** వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు.పిత్తాశయ రాళ్లకు శాశ్వత చికిత్స శస్త్రచికిత్స మాత్రమేనని, రాళ్లు ఉన్నట్లు నిర్ధారణ అయిన తర్వాత వైద్యుల సలహా మేరకు సరైన సమయంలో శస్త్రచికిత్స చేయించుకోవడం ఉత్తమమని తెలిపారు. ఈ శస్త్రచికిత్సలో రాళ్లతో పాటు మొత్తం పిత్తాశయాన్ని తొలగిస్తారని వివరించారు.ప్రస్తుతం లాపరోస్కోపిక్, రోబోటిక్ విధానాల్లో శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్నాయని, ముఖ్యంగా రోబోటిక్ శస్త్రచికిత్స ద్వారా తక్కువ నొప్పి, త్వరగా కోలుకోవడం, తక్కువ రక్తస్రావం, తక్కువ సమస్యలు వంటి ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు.శస్త్రచికిత్స అనంతరం సుమారు ఒక నెల రోజుల పాటు వేయించిన ఆహారం, అధిక నూనె పదార్థాలు తగ్గించి, తేలికపాటి ఆహారం తీసుకోవాలని సూచించారు.పిత్తాశయ రాళ్ల వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశం చాలా అరుదని, అయితే రాళ్లను ఎక్కువకాలం నిర్లక్ష్యం చేయకుండా సకాలంలో చికిత్స పొందడం ద్వారా అనవసరమైన సమస్యలను నివారించవచ్చని డా. శ్రీమన్నారాయణ పేర్కొన్నారు.ఈ పాత్రికేయుల సమావేశంలో యశోద హాస్పిటల్స్, సోమాజిగూడకు చెందిన మేనేజర్ ఉమేష్, అసిస్టెంట్ మేనేజర్ వినోద్, పాత్రికేయ మిత్రులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## మైక్రోసాఫ్ట్‌లో 4,800 మంది ఉద్యోగుల తొలగింపు!




టెక్ ప్రపంచంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) రేసు తీవ్రతరమవుతున్న వేళ ప్రముఖ సాఫ్ట్‌వేర్ దిగ్గజం 'మైక్రోసాఫ్ట్' సంచలన నిర్ణయం తీసుకుంది. సంస్థ అంతటా సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు, ఏఐ మౌలిక సదుపాయాలపై భారీగా పెరుగుతున్న పెట్టుబడులను తట్టుకునేందుకు వీలుగా ఉద్యోగాల కోతకు శ్రీకారం చుట్టింది. తన మొత్తం శ్రామిక శక్తిలో 2.1 శాతం అంటే సుమారు 4,800 మంది ఉద్యోగులను విధుల్లోంచి తొలగిస్తున్నట్లు సంస్థ అధికారికంగా ప్రకటించింది.

రూ.58 లక్షల కోట్లకు చేరిన ఏఐ ఖర్చులు

ప్రస్తుత ఏడాది ప్రపంచవ్యాప్తంగా టెక్ దిగ్గజాల ఏఐ వ్యయాలు ఏకంగా 700 బిలియన్ డాలర్లకు (సుమారు రూ.58.8 లక్షల కోట్లు) చేరుకున్నాయి. అయితే, ఈ భారీ పెట్టుబడులకు తగ్గట్టుగా రాబడులను (ఆర్‌ఓఐ) చూపించాల్సిన ఒత్తిడి కంపెనీలపై తీవ్రంగా ఉంది. మరోవైపు, వ్యాపార సామర్థ్యాన్ని పెంచేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వాడుతుండటంతో మానవ వనరుల అవసరం తగ్గుతోంది. కేవలం మైక్రోసాఫ్ట్ మాత్రమే కాకుండా ఈ ఏడాది అమెజాన్, మెటా ప్లాట్‌ఫామ్స్ వంటి ఇతర బిగ్ టెక్ కంపెనీలు సైతం వేలాది మంది ఉద్యోగులను తొలగించిన సంగతి తెలిసిందే.

## హైదరాబాద్-రియాద్ మధ్య డైరెక్ట్ ఫ్లైట్




హైదరాబాద్, జూలై 6: సౌదీ అరేబియాకు చెందిన చౌక విమానయాన సంస్థ ఫ్లైదిల్..దేశీయ విమానయాన రంగంలోకి అడుగుపెట్టింది. తన తొలి సర్వీసును రియాద్ నుంచి డైరెక్ట్ ఫ్లైట్ సర్వీసును హైదరాబాద్‌కు ప్రారంభించింది. తన తొలి విమాన సర్వీసు జీఎమ్మార్ హైదరాబాద్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో ఉదయం దిగింది. రియాద్‌లో రాత్రి 11.20 గంటలకు బయలుదేరనున్న విమాన సర్వీసు ఆ మరుసటి రోజు హైదరాబాద్‌కు ఉదయం 6.50 గంటలకు చేరుకోనున్నది. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్‌లో ఉదయం 7.55 గంటలకు బయలుదేరి 11.05 గంటలకు రియాద్ చేరుకోనున్నది.

# మొబైల్ చార్జీల మోత..!

**త్వరలో 12-15% పెరుగనున్న టారిఫ్‌లు..**

**అన్ని రకాల ప్లాన్లు ప్రియం**

**యూజర్లపై మరింత భారం**




**న్యూఢిల్లీ** : టెలికాం రంగ సంస్థలు మరోసారి చార్జీల మోత మోగించనున్నాయి. త్వరలో మొబైల్ టారిఫ్‌లు మరో 12-15 శాతం పెరిగే వీలుందని తెలుస్తున్నది మరి. ఈ ఆర్థిక సంవత్సరం (2026-27) తొలి త్రైమాసికానికి (ఏప్రిల్-జూన్)గాను సెంట్రమ్ ఇన్‌స్టిట్యూషనల్ రిసెర్చ్ తాజాగా టెలికాం, ఇంటర్నెట్ రంగాలకు సంబంధించి ఓ సమీక్ష నివేదికను విడుదల చేసింది. ఇందులో రాబోయే 3-4 నెలల్లో అన్ని రకాల ప్లాన్ల రీచార్జ్ ధరలు ఎగబాకే అవకాశాలున్నట్టు ఈ బ్రోకరేజీ సంస్థ పేర్కొన్నది. ఇదే జరిగితే వినియోగదారులపై మరింత భారం పడటం ఖాయం.

**అనుకూల వాతావరణం**

ప్రస్తుతం దేశీయ టెలికాం ఇండస్ట్రీలో 4 సంస్థలే ఉన్నాయి. అందులో రిలయన్స్ జియో, భారతీ ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియా ప్రైవేట్ రంగానికి చెందినవైతే, బీఎస్ఎన్ఎల్ ప్రభుత్వ రంగానికి చెందినది. ఒకప్పటితో పోల్చితే భారతీయ టెలికాం సంస్థల సంఖ్య భారీగానే పడిపోయింది. మార్కెట్.. కన్సాలిడేషన్ మోడ్‌లో ఉండటంతో పోటీ వాతావరణం కూడా పెద్దగా లేకుండాపోయింది. ఇదే మొబైల్ టారిఫ్‌ల పెంపునకు దోహదం చేస్తున్నదన్న అభిప్రాయాలు ఇండస్ట్రీ విశ్లేషకుల నుంచి వినిపిస్తున్నాయిప్పుడు. ఇక గతంలో అన్ని రకాల కాలవ్యవధులతో కూడిన ప్లాన్ల రీచార్జ్ రేట్లు తక్కువగానే ఉండేవి. అయితే 2జీ, 3జీ, 4జీ, 5జీ.. ఇలా హైస్పీడ్ ఇంటర్నెట్ సేవలు అందుబాటులోకి వస్తున్నకొద్దీ ధరలు సైతం పెరుగుతున్నాయి.

**స్పెక్ట్రమ్ ఖర్చులతో..**

ప్రస్తుతం దేశంలో 4జీ, 5జీ మొబైల్ వినియోగదారులే ఎక్కువగా ఉండగా.. జియో, ఎయిర్‌టెల్ కంపెనీలు 90 శాతానికిపైగా జిల్లాల్లో 5జీ నెట్‌వర్క్‌ను కలిగి ఉన్నాయని సెంట్రమ్ చెప్తున్నది. 5జీ కవరేజీ విషయంలో వొడాఫోన్ ఐడియా కూడా వేగం పెంచింది. ఈ నేపథ్యంలో స్పెక్ట్రమ్ (రేడియో తరంగాలు) కోసం ఆయా సంస్థలు భారీగానే ఖర్చు చేయాల్సి వస్తున్నది. దీంతో వాటిని రాబట్టుకోవడానికి చార్జీల పెంపు టెలికాం ఆపరేటర్లకు తప్పనిసరిగా మారుతున్నదని, మార్కెట్‌లో పరిమిత స్థాయిలోనే కంపెనీలుండటం, అన్నీ ఒకే దారిలో వెళ్తుండటంతో వినియోగదారులకూ వేరే మార్గం ఉండటం లేదని విశ్లేషకులు అంటున్నారు. గడిచిన కొన్నేండ్లలో ప్లాన్ల ధరలు దాదాపు 150 శాతం పెరిగాయి.

**ఏఆర్‌పీయూ పైపైకి..**

పెరుగుతున్న స్మార్ట్‌ఫోన్ల వినియోగంతో హైస్పీడ్ ఇంటర్నెట్‌కూ గిరాకీ పెరుగుతున్నది. ఈ క్రమంలోనే ఈ ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో ప్రైవేట్ రంగ టెలికాం కంపెనీలకు ఒక్కో వినియోగదారుడి నుంచి వచ్చే సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) 1-1.5 శాతం పెరుగవచ్చని సెంట్రమ్ అంచనా వేస్తున్నది. 5జీ సేవలు అందుబాటులోకి రావడంతో చాలామంది కస్టమర్లు తమ స్మార్ట్‌ఫోన్లనూ ఆ మేరకు అప్‌గ్రేడ్ చేసేసుకుంటున్నారు. దీంతో 4జీతో పోల్చితే ధర ఎక్కువ చెల్లించి 5జీ ప్లాన్లను కొనేస్తున్నారు. ఫలితంగా టెల్కోల ఏఆర్‌పీయూ పెరుగుతూపోతున్నది.

**బీఎస్ఎన్ఎల్ వెనుకంజ..**

జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలతో పోల్చితే బీఎస్ఎన్ఎల్ వెనుకబడిపోతున్నది. నిజానికి ప్రైవేట్ రంగ టెల్కోలతో చూస్తే బీఎస్ఎన్ఎల్ ప్లాన్ల ధరలు చాలా చౌక. కానీ అంతటా నెట్‌వర్క్ లేకపోవడం, ఉన్నా సరిగా పనిచేయకపోవడం.. కస్టమర్లను బీఎస్ఎన్ఎల్ వైపునకు చూడనివ్వడం లేదు. అలాగే కేంద్ర ప్రభుత్వం నుంచీ ఆశించిన స్థాయిలో మద్దతు లేకపోవడంతో స్పెక్ట్రమ్ వేలంలో వెనుకబడిపోవాల్సి వస్తున్నదని, ఇది కంపెనీని ఆర్థికంగా దెబ్బతీస్తున్నదన్న విమర్శలూ వినిపిస్తున్నాయి. ప్రైవేట్ రంగ సంస్థలు 5జీ విస్తరణలో దూసుకుపోతుంటే.. బీఎస్ఎన్ఎల్ మాత్రం 4జీ దగ్గరే తంటాలు పడుతున్నది. ఈ పరిణామం కూడా బీఎస్ఎన్ఎల్ నుంచి కస్టమర్లను ఇతర సంస్థల దిశగా నడిపిస్తున్నది. 'ఎయిర్‌టెల్, జియోలకు కస్టమర్లు క్యూ కడుతున్నారు. వొడాఫోన్ ఐడియాకూ వినియోగదారులు క్రమంగా పెరుగుతున్నారు. జియో 70 లక్షలు, ఎయిర్‌టెల్ 50 లక్షలు, వొడాఫోన్ ఐడియా 2 లక్షల కస్టమర్లను గడిచిన త్రైమాసికంలో పెంచుకోవచ్చని అంచనా' అంటూ సెంట్రమ్ లెక్కలే.. బీఎస్ఎన్ఎల్ దుస్థితికి అద్దం పడుతున్నాయి.

## ఇక సహకార జీవిత బీమా సంస్థ




**న్యూఢిల్లీ:** సహకార రంగంలో జీవిత బీమా కంపెనీని ఏర్పాటు చేయనున్నట్లు కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్ షా వెల్లడించారు. బీమా రంగంలో కూడా సహకార సంస్థలు వృద్ధి చెందడానికి ఇది ఉపయోగపడుతుందని చెప్పారు. ఎరువులకు సంబంధించిన కోఆపరేటివ్ ఇఫ్కో ఇప్పటికే జాయింట్ వెంచర్ (ఇఫ్కో--టోకియో) ద్వారా బీమా రంగంలో కార్యకలాపాలు నిర్వహిస్తోందని సహకార శాఖ ఐదో వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం దేశీయంగా 26 జీవిత బీమా సంస్థలు ఉన్నాయి. మరోవైపు, కోఆపరేటివ్ మోడల్‌గా ప్రవేశపెట్టిన భారత్ ట్యాక్సీ సేవలను వచ్చే రెండేళ్లలో 500 నగరాలకు విస్తరించనున్నట్లు మంత్రి వివరించారు. ప్రస్తుతం ఢిల్లీ, లక్నో, చండీగఢ్, ముంబై తదితర నగరాల్లో ఇవి అందుబాటులో ఉండగా.. త్వరలో రాంచీ, పాట్నా, భోపాల్ మొదలైన నగరాల్లోనూ ప్రవేశపెట్టనున్నట్లు షా చెప్పారు. భారత్‌లో 30 కోట్ల మంది పైగా సభ్యులతో 8.5 లక్షల పైచిలుకు సహకార సంఘాలు ఉన్నాయి. కోఆపరేటివ్ రంగంలో మానవ వనరుల సమస్యను పరిష్కరించేందుకు గుజరాత్‌లోని ఆనంద్‌లో ఏర్పాటు చేస్తున్న త్రిభువన్ సహకారి యూనివర్సిటీ తోడ్పడుతుందని మంత్రి చెప్పారు. బ్యాంకింగ్, డెయిరీ, మార్కెటింగ్ తదితర విభాగాల్లో ఈ వర్సిటీ నిపుణులను తయారు చేస్తుందని వివరించారు.

# హైహై హాలండ్.. బైబై బ్రెజిల్

**ప్రిక్వార్టర్స్‌లోనే ఓడిన ఐదుసార్లు చాంపియన్**

**అర్లింగ్ డబుల్ ధమాకా**

**తొలిసారి క్వార్టర్ ఫైనల్‌కు నార్వే**



ఫిఫా ప్రపంచకప్‌లోనే అతి పెద్ద సంచలనం. అండర్‌డాగ్ నార్వే.. సాకర్‌లో మేటి జట్టు బ్రెజిల్ పని పట్టింది. న్యూజెర్సీ స్టేడియంలో సోమవారం తెల్లవారుజామున జరిగిన హోరాహోరీ నాకౌట్ పోరులో 2-1 తేడాతో సాంబా టీమ్‌ను చిత్తు చేసింది. నార్వే స్టార్ స్ట్రైకర్ అర్లింగ్ హాలండ్ సెకండాఫ్‌లో (79, 90వ నిమిషాల్లో) రెండు అద్భుత గోల్స్‌తో విరుచుకుపడి మాజీ చాంపియన్లను ఇంటిదారి పట్టించాడు. బ్రెజిల్ దిగ్గజం నెయ్‌మార్ (90ం10వ ని)కొట్టిన ఏకైక గోల్ ఆ జట్టుకు ఓటమి తప్పించలేకపోయింది. సాకర్ చరిత్రలో టాప్ టీమ్స్‌ను పడగొట్టి.. ఎన్నో అద్భుత విజయాలు సాధించిన బ్రెజిల్.. నార్వే కోటను మాత్రం బద్దలు కొట్టలేకపోతోంది. 1988 నుంచి రెండు వరల్డ్‌కప్స్ సహా ఆ జట్టుతో ఆడిన ఐదు మ్యాచ్‌ల్లో ఒక్కసారి కూడా నెగ్గలేకపోవడం గమనార్హం. ఇక, తొలిసారి క్వార్టర్ ఫైనల్ చేరిన నార్వే.. ఈ నెల 11న ఇంగ్లండ్‌తో తలపడనుంది.

**సెకండాఫ్‌లో ధమాకా**

ఈ మ్యాచ్ తొలి 45 నిమిషాలు గోల్ లేకుండా ముగిసినప్పటికీ డ్రామాకు ఏమాత్రం కొదవ లేదు. ఆట ఆరంభంలోనే నార్వే ఆటగాడు సాండర్ బెర్గ్ బంతిని నెట్‌లోకి పంపినా.. రిఫరీ ఆఫ్‌సైడ్‌గా ప్రకటించడంతో ఆ టీమ్‌కు నిరాశ ఎదురైంది. ఆ తర్వాత బ్రెజిల్‌కు సువర్ణావకాశం లభించింది. బాక్స్ లోపల మాథ్యూస్ కున్హాను నార్వే డిఫెండర్ క్రిస్టోఫర్ అజెర్ కిందపడేయడంతో బ్రెజిల్‌కు పెనాల్టీ లభించింది. తన అంతర్జాతీయ కెరీర్‌లో మొదటి పెనాల్టీ కిక్ తీసుకున్న బ్రూనో గిమారెస్ కొట్టిన పేలవ షాట్‌ను నార్వే గోల్‌కీపర్ ఓర్జన్ నైలాండ్ సులభంగా అడ్డుకున్నాడు. సూపర్ ఫామ్‌లో ఉన్న వినిషియస్ జూనియర్, మార్టిన్ ఒడెగార్డ్ కొట్టిన షాట్లను కూడా తిప్పికొట్టాడు. ఈ మ్యాచ్‌లో బ్రెజిల్ 35 శాతం మాత్రమే బంతిని తన ఆధీనంలో ఉంచుకోగలిగింది. అటు నార్వే బంతినిపై పైచేయి సాధించినా ఫస్టాఫ్‌లో గోల్ కొట్టలేకపోయింది. విరామం తర్వాత బ్రెజిల్ కోచ్ కార్లో అన్సెలోటి వ్యూహాత్మకంగా గాబ్రియేల్ మార్టినెల్లి స్థానంలో సీనియర్ స్టార్ నెయ్‌మార్‌ను మైదానంలోకి దించాడు. తన రాకతో బ్రెజిల్ ఎటాకింగ్‌లో వేగం పెరిగినా నార్వే డిఫెన్స్ గట్టిగా నిలబడింది. ఇంకోవైపు నార్వే ఫార్వర్డ్స్ బ్రెజిల్ డిఫెన్స్‌లోకి చొచ్చుకెళ్లి దాడుల తీవ్ర పెంచారు. ఈ క్రమంలో ఆండ్రియాస్ షెల్డెరప్ ఎడమ వైపు నుంచి అందించిన అద్భుతమైన క్రాస్‌ను అందుకున్న హాలండ్ బ్రెజిల్ డిఫెండర్ గాబ్రియేల్ కంటే ఎత్తుగా ఎగిరి బుల్లెట్ లాంటి హెడర్ గోల్ కొట్టాడు. అక్కడి నుంచి బ్రెజిల్ స్కోరు చేసేందుకు ఎంత ట్రై చేసినా .. నిర్ణీత 90 నిమిషాల్లో నార్వే డిఫెన్స్‌ను బ్రేక్ చేయలేకపోయింది. ఇంకోవైపు ఇంజూరీ టైమ్‌లో షెల్డెరప్ ఇచ్చిన పాస్‌ను హాలండ్ క్లాసిక్ టచ్‌తో గోల్ పోస్ట్ రైట్ కార్నర్‌లోకి పంపి నార్వే ఆధిక్యాన్ని డబుల్ చేశాడు. అప్పటికే బ్రెజిల్ ఆటగాళ్లు, ఫ్యాన్స్ తీవ్ర నిరాశలో కూరుకుపోయారు. మ్యాచ్ ఆఖరి క్షణాల్లో బ్రెజిల్‌కు మరో పెనాల్టీ లభించింది. దాన్ని నెయ్‌మార్ గోల్‌గా మలిచినా అప్పటికే పూడ్చలేని నష్టం జరిగిపోయింది.

కప్పు లేకుండానే కథ ముగిసె

మెగా టోర్నీలో అనూహ్య ఓటమి తర్వాత బ్రెజిల్ సూపర్ స్టార్ నెయ్‌మార్ జూనియర్ తన ఇంటర్నేషనల్ కెరీర్‌కు వీడ్కోలు ప్రకటించడం ఆ జట్టు అభిమానుల బాధను రెట్టింపు చేసింది. 2010లో అమెరికా గడ్డపైనే యూఎస్ఏ జట్టుతో ఫ్రెండ్లీ మ్యాచ్‌తో అరంగేట్రం చేసిన దిగ్గజం అదే దేశంలో తన ఆట ముగించాడు. 'వరల్డ్‌కప్ నెగ్గాలన్నది నా కల. దాని కోసంచాలా ప్రయత్నించాను. ఇప్పుడు నా పోరాటం ముగిసింది. ఇక్కడే కెరీర్ ఆరంభించాను.. ఇక్కడే ముగిస్తున్నా' అని నెయ్‌మార్ మ్యాచ్ తర్వాత భావోద్వేగంతో చెప్పాడు. తన 16 ఏండ్ల సుదీర్ఘ కెరీర్‌లో నెయ్‌మార్ ఈ తరం మేటి ఆటగాళ్లలో ఒకడిగా, బ్రెజిల్ తరఫున అత్యధిక గోల్స్ చేసిన ప్లేయర్‌గా నిలిచాడు. మైదానంలో మెరుపు వేగంతో కదులుతూ అనుకోని దిశల్లోకి టర్న్ అవుతూ ప్రత్యర్థులను ఆశ్చర్యపరచడం.. బంతిని తన కాలికి అతుక్కున్నట్లుగా డ్రిబ్లింగ్ చేయడం, డిఫెండర్లను ఏమార్చి ముందుకు వెళ్లడంలో అతను దిట్ట. బంతిని పైకి లేపి, డిఫెండర్ల తల మీదుగా పంపే రెయిన్‌బో ఫ్లిక్ వంటి నైపుణ్యాలతో ఎంతో మంది ఫ్యాన్స్‌ను సంపాదించుకున్నాడు.

జాతీయ జట్టు తరఫున 130 మ్యాచ్‌లు ఆడిన అతను 80 గోల్స్ కొట్టి మరో 59 అసిస్టులు చేశాడు. కెప్టెన్‌గా బ్రెజిల్‌కు 2013 ఫిఫా కన్ఫెడరేషన్స్ కప్ అందించిన అతను 2016 రియో ఒలింపిక్స్‌లో సొంతగడ్డపై జట్టుకు స్వర్ణం సాధించిపెట్టాడు. కానీ, వరల్డ్ కప్ కలను నెరవేర్చుకోలేకపోయాడు. అతని కెరీర్‌ను గాయాలు వెంటాడాయి. ఈ కారణంగానే తన ప్రతిభకు నెయ్‌మార్ సంపూర్ణ న్యాయం చేయలేకపోయాడు. లియోనల్ మెస్సీ, క్రిస్టియానో రొనాల్డో అంత టాలెంట్ ఉన్నా.. ఈ ఇద్దరి మాదిరి సక్సెస్‌ను అందుకోలేకపోయాడు. కొన్నిసార్లు బ్రెజిల్ అతనిపై అతిగా అంచనాలు, భారం మోపి దెబ్బతిన్నది. 2014 సొంతగడ్డపై వరల్డ్‌కప్‌లో తొలి నాలుగు మ్యాచ్‌ల్లో ఐదు గోల్స్ కొట్టిన తర్వాత నెయ్‌మార్ క్వార్టర్ ఫైనల్లో గాయపడి స్ట్రెచర్‌పై బయటికి వెళ్లడం.. తను లేకుండా సెమీస్ ఆడిన బ్రెజిల్ 1-7తో జర్మనీ చేతిలో చిత్తవడం సాంబా అభిమానులకు ఇప్పటికీ చేదు జ్ఞాపకాలే. మొత్తంగా దశాబ్ద కాలంగా బ్రెజిల్ బలం.. బలహీనత అయిన నెయ్‌మార్ ఇప్పుడు పూర్తిగా దూరమైన తర్వాత ఆ జట్టు ఎలా ముందుకు వెళ్తుందో చూడాలి.

ఫిఫా ప్రపంచకప్‌లో బ్రెజిల్ జట్టు 1990 తర్వాత క్వార్టర్స్‌కు ముందే ఇంటిదారి పట్టడం ఇదే తొలిసారి.

2002 ఫైనల్లో జర్మనీని ఓడించి ట్రోఫీ నెగ్గిన తర్వాత ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌ల్లో బ్రెజిల్ యూరోపియన్ ప్రత్యర్థుల చేతిలో ఓడిపోవడం ఇది ఏడోసారి.

వరల్డ్ కప్‌లో బ్రెజిల్‌ను నార్వే ఓడించడం ఇది రెండోసారి. 1998 ఎడిషన్‌లో 2-1తో గెలిచింది. మరో మూడు ఇంటర్నేషనల్ మ్యాచ్‌ల్లో ఓసారి గెలిచి రెండింటిని డ్రా చేసుకుని అజేయంగా నిలిచింది.

ఈ వరల్డ్‌కప్‌లో నార్వే స్టార్ హాలండ్‌కు ఇది 6వ గోల్. తన తొలి నాలుగు ప్రపంచకప్ మ్యాచ్‌ల్లోనూ వరుసగా గోల్స్ సాధించిన 8వ యూరోపియన్ ఆటగాడిగా అతడు రికార్డు సృష్టించాడు.

# స్పోర్ట్స్

## ఇంగ్లండ్ తగ్గేదేలే..



మెక్సికో సిటీ: వరల్డ్ కప్ ఫేవరేట్‌లలో ఒకటైన ఇంగ్లండ్ సైతం క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. మెక్సికో అభిమానులు స్టేడియానికి పోటెత్తగా ఆసాం తం నువ్వానేనా అన్నట్టుగా సాగిన ప్రిక్వార్టర్స్‌లో హ్యారీ కేన్ సేన 3-2తో ఆతిథ్య జట్టును ఓడించి టోర్నీలో తదుపరి దశకు ముందంజ వేసింది. మ్యాచ్ ముందు రోజు రాత్రి మెక్సికో అభిమానులు ఇంగ్లిష్ ఆటగాళ్ల నిద్ర, ఏకాగ్రతను దెబ్బతీసేందుకు ఇంగ్లండ్ బస చేస్తున్న హోటల్ ముందుకు వచ్చి డ్రమ్స్, బాణాసంచాతో భారీ శబ్దాలు చేశారు. కానీ మ్యాచ్‌లో ఇంగ్లండ్ మాత్రం గోల్స్‌తో వారికి దీటైన సమాధానమిచ్చింది. ఇంగ్లిష్ మిడ్‌ఫీల్డర్ జూడ్ బెల్లింగ్‌హమ్ (36వ, 38వ నిమిషంలో) 98 సెకన్ల వ్యవధిలో రెండు గోల్స్ చేయగా ఆ జట్టు సారథి హ్యారీ కేన్ (60వ) ఓ గోల్ కొట్టాడు. ఈ టోర్నీలో కేన్‌కు ఇది ఆరో గోల్ కాగా వరల్డ్ కప్స్‌లో 14వది కావడం విశేషం. మెక్సికో తరఫున జులియన్ క్వినోన్స్ (42వ), జిమెనెజ్ (69వ) తలా ఓ గోల్ చేశారు.

## క్యాడీ క్లాష్ గోల్ఫ్ విన్నర్ ప్రేమ్



**హైదరాబాద్,** ఆట ప్రతినిధి: టీ గోల్ఫ్ ఫౌండేషన్ నిర్వహించిన 4వ ఎడిషన్ క్యాడీ క్లాష్ గోల్ఫ్ టోర్నమెంట్‌లో ప్రేమ్, మహమూద్ సత్తా చాటారు. గోల్ఫ్ ఆటలో కీలక పాత్ర పోషిస్తూ తెరవెనుక ఉంటున్న క్యాడీల ప్రతిభను గుర్తించేందుకు నిర్వహించిన ఈ ఈవెంట్‌లో హైదరాబాద్ గోల్ఫ్ క్లబ్, బౌల్డర్ హిల్స్, బెప్టా , హాల్డీ వంటి ప్రముఖ క్లబ్‌ల నుంచి 140 మందికి పైగా క్యాడీలు వివిధ విభాగాల్లో పోటీ పడ్డారు. సోమవారం ముగిసిన టోర్నీలో బెప్టాకు చెందిన ప్రేమ్ (75 పాయింట్లు) గ్రాస్ విజేతగా , హెచ్‌జీఏకు చెందిన మహమూద్ రన్నరప్‌గా నిలిచారు. షా ఫైసల్, మేఘనాథ్ హ్యాండిక్యాప్ కేటగిరీల్లో టాప్ ప్లేస్ సొంతం చేసుకోగా.. క్లోజెస్ట్ టు ది పిన్ అవార్డును జి. మహేష్ సాధించాడు. విజేతలకు టిగోల్ఫ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎన్ఆర్ఎన్ రెడ్డి, ఎమార్ ఇండియా బిజినెస్ హెడ్ మధుసూదన్ రావు అవార్డులు అందించారు



# కష్టాల్లో కాపాడేవాడే నిజమైన రాజు'.. ట్రైలర్ రిలీజ్

రుత్విక్, విశాఖ ధిమాన్ జంటగా వస్తోన్న లేటేస్ట్ మూవీ రాజా ది రాజా. ఈ చిత్రానికి అనిల్ బోయిడపు దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను వృందావన్ క్రియేషన్స్ బ్యానర్‌లో దాసరి నిహారిక నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ చేశారు మేకర్స్.


ఈ ట్రైలర్ చూస్తుంటే రాజు అనే కాన్సెప్ట్ ప్రధానంగా తెరకెక్కించినట్లు తెలుస్తోంది. రాజుల కాలానికి.. ప్రజెంట్‌కు లింక్ పెట్టి ఈ కథను రూపొందించినట్లు ట్రైలర్‌లో కనిపిస్తోంది. లవ్, ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా ఈ కథలో ఉండనున్నాయని ట్రైలర్‌లో చూపించారు. ఈ సినిమాకు మార్క్ కె రాబిన్ సంగీతమందించారు. ఈ మూవీలో సాయి కుమార్, నరేశ్, అవసరాల శ్రీనివాస్, విష్ణు, పార్వతీశం, రాజశ్రీ నాయర్, రోహిణి, భద్రం, మైమ్ మధు, ఆనంద్ కీలక పాత్రల్లో నటించారు. ఇంకెందుకు ఆలస్యం ట్రైలర్ మీరు కూడా చూసేయండి.

# అఖిల్‌పై ఆ భయం ఉండేది.. 'లెనిన్' చూసి ఆశ్చర్యపోయా : నాగార్జున



"లెనిన్' రాయలసీమ కథ. సింపుల్‌గా చెప్పాలంటే సీమలో జరుగుతున్న మహాభారతం. ఈ సినిమాకు ముందు అఖిల్ ఎక్కువగా అర్బన్ ఫిల్మ్ చేశాడు. మరి... ఈ సినిమాకి సూట్ అవుతాడా? అని ముందు నాకు భయంగా ఉండేది. కానీ సినిమా చూశాక, నేను కాదు... అందరూ ఆశ్చర్యపోయారు. 'లెనిన్' రోల్‌లోకి అఖిల్ వెళ్లిపోయాడు. సినిమా చూసిన తర్వాత లెనిన్ స్నేహాన్ని, ప్రేమను, పగని కూడా ప్రేమిస్తారు. లెనిన్ ను మీరు ఇంటికి తీసుకెళ్లిపోతారు. మీకు అఖిల్ కనపడడు... 'లెనిన్ ' కనిపిస్తాడు" అని నాగార్జున అన్నారు. అఖిల్, భాగ్యశ్రీ భోర్సే హీరో హీరోయిన్లుగా నటించిన చిత్రం 'లెనిన్ '. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో మురళీ కిషోర్ అబ్బూరు (నందు) దర్శకత్వంలో అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 10న విడుదల కానుంది. ఆదివారం తిరుపతిలో జరిగిన 'లెనిన్' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నాగార్జున మాట్లాడుతూ–– "ప్రేమ కోసం యుద్ధాలు జరిగాయి. ప్రేమకోసం రాజ్యాలు కూలిపోయాయి. 'లెనిన్'లో కూడా ఒక ప్రేమకథ ఉంది. నందు ఈ సినిమా కథ చెప్పడానికి వచ్చినప్పుడు ఇది శ్రీరామపురంలో జరిగే కథ అన్నాడు. 'శ్రీరామపురం' అంటే మా నాన్నగారు పుట్టిన ఊరు (కృష్ణా జిల్లా). అయితే ఈ శ్రీరామపురం చిత్తూరు జిల్లాలో అని చెప్పాడు. కానీ శ్రీరామపురం అంటే నాకో సెంటిమెంట్. దీంతో నందును కథ చెప్పమన్నాను. నందు కథ చెప్పడం మొదలు పెట్టాడు. ఇందులో పాత్రలు డిఫరెంట్‌గా అనిపించాయి. 'లెనిన్' సెకండాఫ్‌లోని ట్విస్ట్‌లను ప్రేక్షకులు ఊహించలేరు. మా పార్ట్‌నర్ నాగవంశీకి ఈ సినిమాపై ఎంత కాన్ఫిడెన్స్ అంటే... ఏపీ అంతా అతనే డిస్ట్రిబ్యూట్ చేస్తున్నాడు. మన అందరికీ దేవుడు ఆ వెంకటేశ్వరస్వామి. నాన్నగారు ఎప్పుడూ అంటుంటారు ఆయనకు దేవుడు మాత్రం ప్రేక్షక దేవుళ్ళు అని. సో... ఈ ప్రేక్షక దేవుళ్లకు చెబుతున్నాను. జూలై 10న వస్తున్నాం. మనవాడు కొడుతున్నాడు" అని అన్నారు. అఖిల్ మాట్లాడుతూ–– "లెనిన్'ఉద్దేశం ఒకటే. నేను మీ ఇంటివాడినైపోవాలి. మీ సీమ బిడ్డ మురళీకిషోర్ రెండేళ్ల క్రితం ఈ సినిమా కథ చెప్పారు. నేను చేయాలనుకున్న కథ ఇదే అనిపించింది" అన్నారు. "ఈ మూవీలో భారతి అనే పాత్ర చేశాను. ఈ సినిమా నా కెరీర్‌లో చాలా స్పెషల్" అన్నారు భాగ్యశ్రీ బోర్సే. "నాగేశ్వరరావుగారి మనవడు, నాగార్జునగారి అబ్బాయి అఖిల్ గోల్డెన్ స్పూన్ తో పుట్టాడు. పెద్ద కష్టపడలేదని అంటుంటారు. కానీ సోల్ ఆఫ్ లెనిన్ వచ్చినప్పట్నుంచి 'అఖిల్ ఫస్ట్ టైమ్ కష్టపడుతున్నట్లు కనిపిస్తుంది కదరా' అనేవాళ్లు. ఈ అభిప్రాయాన్ని జనాల్లోకి తీసుకుని వెళ్లేందుకు అఖిల్‌గారు ఎంత కష్టపడ్డారో మేం చూశాం. ఇది రెగ్యులర్ మాస్ మూవీ కాదు. రెండు మూడు చోట్ల ఆడియన్స్ సర్‌ప్రైజ్ అవుతారు. అలాంటి స్క్రీన్‌ప్లే రాశాడు నందు" అన్నారు నాగవంశీ. బ్రహ్మాజీ, సునీల్ మాట్లాడారు.

## ఫుల్ స్పీడ్‌లో రవితేజ.. 'ఇరుముడి' రిలీజ్‌కు ముందే కొత్త సినిమా, శ్రీవిష్ణుతో మల్టీస్టారర్?



మాస్ మహారాజా రవితేజ వరుస ప్రాజెక్ట్‌లతో దూసుకుపోతున్నారు. ఈ ఏడాది సంక్రాంతికి ప్రేక్షకులను అలరించిన ఆయన, ఇప్పుడు మరోసారి బిజీ షెడ్యూల్‌తో అభిమానులకు వరుస సినిమాలను అందించేందుకు సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం నటిస్తున్న ఆధ్యాత్మిక యాక్షన్ డ్రామా 'ఇరుముడి' చివరి దశ షూటింగ్‌లో ఉండగానే, మరో కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం, 'రాజా రాజా చోర' ఫేమ్ దర్శకుడు హసిత్ గోలి దర్శకత్వంలో రవితేజ ఓ వినోదాత్మక చిత్రంలో నటించనున్నారని తెలుస్తోంది. ఈ సినిమాలో టాలెంటెడ్ హీరో శ్రీవిష్ణు కూడా కీలక పాత్రలో కనిపించే అవకాశం ఉందని సినీ వర్గాలు చెబుతున్నాయి.వీశీజఱవం హసిత్ గోలి శైలికి తగ్గట్టుగా హాస్యం, వినూత్న కథనం ప్రధాన బలాలుగా ఈ చిత్రాన్ని రూపొందించనున్నట్లు సమాచారం. ఈ నెలలో పూజా కార్యక్రమాలతో సినిమాను ప్రారంభించి, వచ్చే నెల నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారట. వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు టాక్ వినిపిస్తోంది. అయితే ఈ మల్టీస్టారర్ ప్రాజెక్ట్‌పై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. ఇదిలా ఉంటే, రవితేజ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ఇరుముడి' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా భక్తి, కుటుంబ భావోద్వేగాలు, యాక్షన్ అంశాల మేళవింపుగా రూపొందుతోంది. ఈ చిత్రాన్ని ఆగస్టు 21న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు ఇప్పటికే ప్రకటించారు.ఈ సినిమాలో రవితేజ సరసన ప్రియా భవానీ శంకర్ కథానాయికగా నటిస్తుండగా, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్‌పై నవీన్ యెర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'ఇరుముడి కట్టు.. శబరిమల ఎక్కు' పాటకు ప్రేక్షకుల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

## అఖిల్ అక్కినేని 'లెనిన్' లో తారక్ రోల్ ఏంటీ.. హైప్ పెంచేస్తున్న నయా పోస్టర్



టాలీవుడ్ యాక్టర్ అక్కినేని అఖిల్ లాంగ్ గ్యాప్ తర్వాత 'లెనిన్' సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడని తెలిసిందే. మురళీ కిషోర్ అబ్బూరి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో మిస్టర్ బచ్చన్ ఫేం భాగ్య శ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రం జులై 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా మేకర్స్ లాంచ్ చేసిన కొత్తపోస్టర్ అభిమానులు, మూవీ లవర్స్‌లో క్యూరియాసిటీ పెంచేస్తోంది. ఈ మూవీలో జూనియర్ ఎన్టీఆర్ కూడా భాగం కాబోతున్నాడని ఇన్‌సైడ్ టాక్. అదెలా అంటే తాజా పోస్టర్‌లో టైగర్ లుక్‌తో పాటు లెనిన్ టైటిల్ లోగోను చూడొచ్చు. ఇంతకీ ఈ కొత్త పోస్టర్ వెనుకున్న సీక్రెట్ ఏంటంటే.. ఈ చిత్రానికి యంగ్ టైగర్, మ్యాన్ ఆఫ్ మాసెస్ జూనియర్ ఎన్టీఆర్ వాయిస్ ఓవర్ అందించడమే కాకుండా సినిమా కథనాన్ని వివరించబోతున్నాడట. ఈ పోస్టర్‌తో సినిమాలో తారక్ రోల్ ఏంటనేది క్లారిటీ ఇచ్చేసినట్టేనని అర్థమవుతోంది. ఈ మూవీని అన్నపూర్ణ స్టూడియోస్‌తోపాటు సితార ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌లపై అక్కినేని నాగార్జున, నాగ వంశీ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. రొమాంటిక్ యాక్షన్ డ్రామాగా వస్తున్న ఈ చిత్రంలో శివాజీ, సునీల్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన లెనిన్ టైటిల్ గ్లింప్స్ మూవీ విలేజ్ బ్యాక్‌డ్రాప్ నేపథ్యంలో సాగనున్నట్టు హింట్ ఇచ్చేసింది. లెనిన్ పోస్ట్ థియాట్రికల్ రైట్స్‌ను పాపులర్ టెలివిజన్ నెట్‌వర్క్ జీ దక్కించుకుంది. జీ నెట్‌వర్క్ లెనిన్ మూవీ డిజిటల్, శాటిలైట్ రైట్స్‌ను దక్కించుకుంది. థియాట్రికల్ రన్ తర్వాత జీ5లో ప్రీమియర్ కానుంది. అంతేకాదు జీ తెలుగు, జీ సినిమాలులో టెలివిజన్ ప్రీమియర్ కానుంది. ఆయా ప్లాట్‌ఫాంలలో విడుదల తేదీలపై మేకర్స్ థియాట్రికల్ రిలీజ్ తర్వాత క్లారిటీ ఇవ్వనున్నారు.


## ఓటీటీలోకి వచ్చి రెండు రోజుల్లోనే మాయమైన 'సత్లుజ్'.. ఈ సినిమా వెనుక ఇంత పెద్ద కథ ఉందా?



సాధారణంగా ఒక సినిమా విడుదలకు ముందు ఎన్నో అడ్డంకులు ఎదుర్కొంటుంది. సెన్సార్ సమస్యలు, కోర్టు కేసులు, ఆర్థిక ఇబ్బందులు, టైటిల్ వివాదాలు వంటి కారణాలతో సినిమాలు వాయిదా పడటం కొత్త విషయం కాదు. అయితే ఓటీటీలో విడుదలైన కేవలం రెండు రోజుల్లోనే స్ట్రీమింగ్‌ను నిలిపివేయడం మాత్రం అరుదుగా జరిగే పరిణామం. ఇప్పుడు పంజాబీ స్టార్ నటుడు, గాయకుడు దిల్జిత్ దొసాంజే ప్రధాన పాత్రలో నటించిన 'సత్లుజ్' సినిమా ఇదే కారణంగా దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. పంజాబ్‌కు చెందిన ప్రముఖ మానవ హక్కుల కార్యకర్త జస్వంత్ సింగ్ ఖల్రా జీవిత కథ ఆధారంగా ఈ చిత్రం తెరకెక్కింది. 1990లలో పంజాబ్‌లో అదృశ్యమైన పలువురు వ్యక్తుల కేసులను పరిశోధించి కీలక ఆధారాలను వెలికితీసిన ఖల్రా, అనంతరం 1995లో హత్యకు గురయ్యారు. ఆయన జీవితంలో జరిగిన వాస్తవ సంఘటనలను ఆధారంగా తీసుకుని దర్శకుడు హనీ ట్రెహన్ ఈ చిత్రాన్ని రూపొందించారు. మొదట ఈ సినిమాకు 'ఘల్లుఘరా' అనే టైటిల్ ప్రకటించారు. అనంతరం దాన్ని 'పంజాబ్ 95'గా మార్చగా, చివరికి ఓటీటీ విడుదల సమయంలో 'సత్లుజ్' పేరుతో ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈ సినిమా 2022లోనే పూర్తయినప్పటికీ విడుదల మాత్రం సాధ్యం కాలేదు. కారణం సెన్సార్ వివాదాలు. సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (జదీఖీజ) మొదట కొన్ని హింసాత్మక సన్నివేశాలు, సంభాషణలు, టైటిల్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ 21 మార్పులు సూచించింది. నిర్మాతలు ఆ మార్పులు చేసిన తర్వాత మళ్లీ సెన్సార్‌కు వెళ్లగా, ఈసారి ఏకంగా 127 కట్స్ సూచించినట్లు సమాచారం. అంతటి మార్పులు చేస్తే సినిమా అసలు ఉద్దేశమే దెబ్బతింటుందని భావించిన చిత్రబృందం కోర్టును ఆశ్రయించింది. దీంతో సినిమా విడుదల మరింత ఆలస్యమైంది. థియేటర్లలో విడుదలకు మార్గం సుగమం కాకపోవడంతో, చిత్రబృందం ఎలాంటి హడావుడి లేకుండా జూలై 3న జీ5 (జుజు5) ఓటీటీ వేదికగా 'సత్లుజ్'ను విడుదల చేసింది.ఈ సందర్భంగా హీరో దిల్జిత్ దొసాంజే స్పందిస్తూ.. ఓటీటీలో విడుదలైనది పూర్తిస్థాయి ఒరిజినల్ వెర్షనేనని, ఒకవేళ కట్స్ చేసి విడుదల చేసి ఉంటే తాను ఆ సినిమాను ప్రమోట్ కూడా చేసేవాడిని కాదని స్పష్టం చేశారు. అయితే విడుదలైన రెండు రోజులకే భారతదేశంలో జీ5 ప్లాట్‌ఫామ్ నుంచి సినిమా కనిపించకుండా పోవడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. దీనిపై స్పందించిన జీ5 యాజమాన్యం.. ప్రస్తుత పరిస్థితుల నేపథ్యంలో సినిమాను తాత్కాలికంగా నిలిపివేస్తున్నామని, చట్టపరమైన అంశాలను పరిశీలించిన తర్వాత మళ్లీ అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశం ఉందని తెలిపింది. అయితే సినిమా తొలగింపుకు అసలు కారణం ఏమిటన్న విషయాన్ని మాత్రం అధికారికంగా వెల్లడించలేదు. దీంతో సోషల్ మీడియాలో అనేక ఊహాగానాలు మొదలయ్యాయి.

# దేశంలో స్కూల్ డ్రాప్‌అవుట్లు తగ్గుముఖం

దేశంలోని పాఠశాల విద్యా వ్యవస్థలో 2025-26 విద్యా సంవత్సరంలో కీలకమైన పురోగతి నమోదైంది. ముఖ్యంగా విద్యార్థుల స్కూల్ డ్రాప్‌అవుట్ రేటు గణనీయంగా తగ్గగా, సెకండరీ స్థాయిలో చేరికలు, కొనసాగింపు రేట్లు మెరుగుపడ్డాయి. అలాగే దేశవ్యాప్తంగా ఉపాధ్యాయుల సంఖ్య తొలిసారిగా 1.02 కోట్ల మార్కును దాటింది. ఈ వివరాలను కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన యూడైస్ ప్లస్ (ఖణ×ూజుం) 2025-26 నివేదిక వెల్లడించింది. నివేదిక ప్రకారం గత మూడు విద్యా సంవత్సరాలతో పోలిస్తే 2025-26లో విద్యార్థులు మధ్యలోనే చదువు మానేసే పరిస్థితి గణనీయంగా తగ్గింది.



**డ్రాప్‌అవుట్ రేటులో స్పష్టమైన తగ్గుదల**

ప్రిపరేటరీ స్థాయిలో 2024-25లో 2.3 శాతంగా ఉన్న డ్రాప్‌అవుట్ రేటు 2025-26లో 1.8 శాతానికి తగ్గింది. సెకండరీ స్థాయిలో ఇది 8.2 శాతం నుంచి 7 శాతానికి పడిపోయింది. అన్ని స్థాయిల్లోనూ ఈ తగ్గుదల కనిపించడం విద్యార్థులను చదువులో కొనసాగించే ప్రభుత్వ చర్యలు ఫలిస్తున్నాయని విద్యాశాఖ పేర్కొంది.

**కొనసాగింపు రేటు మెరుగుదల**

మిడిల్ స్థాయిలో విద్యార్థుల రిటెన్షన్ రేటు 82.8 శాతం నుంచి 83.7 శాతానికి పెరిగింది. సెకండరీ స్థాయిలో ఇది 47.2 శాతం నుంచి 51.9 శాతానికి చేరింది. అయితే ఫౌండేషన్, ప్రిపరేటరీ స్థాయిల్లో మాత్రం స్వల్ప తగ్గుదల నమోదైంది. అయినప్పటికీ గత మూడేళ్లలో నమోదైన పురోగతి కొనసాగుతోందని నివేదిక పేర్కొంది.

**సెకండరీ పాఠశాలల పెరుగుదలతో ప్రయోజనం**

దేశవ్యాప్తంగా సెకండరీ విద్య అందించే పాఠశాలల సంఖ్య పెరగడం వల్ల విద్యార్థులకు చదువు అందుబాటులోకి రావడంతో పాటు మధ్యలోనే చదువు మానేయకుండా కొనసాగించే అవకాశం పెరిగిందని విద్యాశాఖ తెలిపింది. ఇదే రిటెన్షన్ రేటు మెరుగుపడటానికి ప్రధాన కారణంగా పేర్కొంది. సెకండరీ స్థాయిలో గ్రాస్ ఎన్రోల్మెంట్ రేషియో (+జు=) కూడా గణనీయంగా పెరిగింది. 2024-25లో 68.5 శాతంగా ఉన్న ఈ నిష్పత్తి 2025-26లో 71.7 శాతానికి చేరింది. దీంతో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్నత తరగతుల్లో చేరుతున్నట్లు స్పష్టమవుతోంది.

**1.02 కోట్లకు చేరిన ఉపాధ్యాయుల సంఖ్య**

విద్యా సంవత్సరంలో దేశవ్యాప్తంగా పాఠశాల ఉపాధ్యాయుల సంఖ్య తొలిసారిగా 1.02 కోట్లను దాటింది. 2022-23తో పోలిస్తే 2025-26లో ఉపాధ్యాయుల సంఖ్య 8.3 శాతం పెరిగినట్లు నివేదిక వెల్లడించింది. ఉపాధ్యాయుల పెరుగుదలతో విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తి మెరుగుపడటంతో పాటు ప్రాంతాల మధ్య ఉన్న కొరతను తగ్గించడంలో ఇది ఉపయోగపడుతుందని కేంద్ర విద్యాశాఖ తెలిపింది.

**పాఠశాల విద్య పనితీరు సూచీలో చండీగఢ్ అగ్రస్థానం**

ఇక కేంద్ర విద్యాశాఖ విడుదల చేసిన పర్‌ఫార్మెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్ 2025-26 ప్రకారం రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పనితీరులో చండీగఢ్ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చింది. చండీగఢ్ ఒక్కటే 'ఉత్తమ్-3' గ్రేడ్ సాధించింది. పంజాబ్, కేరళ, దిల్లీతో పాటు దాద్రా నగర్ హవేలీ-దమన్ అండ్ డయ్యూ కేంద్ర పాలిత ప్రాంతం తదుపరి స్థాయిలో నిలిచాయి. అయితే ఏ రాష్ట్రం లేదా కేంద్ర పాలిత ప్రాంతం కూడా అత్యున్నత 'ఉత్కర్ష్', 'ఉత్తమ్-1', 'ఉత్తమ్-2' గ్రేడ్లను అందుకోలేకపోయింది.

**జిల్లాల పనితీరులోనూ పురోగతి**

జిల్లాల వారీగా పరిశీలించినప్పటికీ అత్యున్నత 'ఉత్కర్ష్' గ్రేడ్ ఏ జిల్లాకూ దక్కలేదు. అయితే ఒక జిల్లా 'ఉత్తమ్-1', 19 జిల్లాలు 'ఉత్తమ్-2' గ్రేడ్ సాధించాయి. గత ఏడాదితో పోలిస్తే మంచి గ్రేడ్ సాధించిన జిల్లాల సంఖ్య పెరిగినట్లు నివేదిక తెలిపింది. మొత్తం 462 జిల్లాలు తమ పనితీరును మెరుగుపరుచుకోగా, వాటిలో 50 జిల్లాలు ఒక గ్రేడ్ నుంచి మరో మెరుగైన గ్రేడ్‌కు చేరుకున్నాయి. ఉత్తమ్-2 గ్రేడ్ సాధించిన జిల్లాల్లో ఢిల్లీ నుంచి నాలుగు, పంజాబ్ నుంచి ఏడు, కేరళ నుంచి మూడు, మహారాష్ట్ర నుంచి రెండు జిల్లాలు ఉన్నాయి. చండీగఢ్, డయ్యూ, హిమాచల్ ప్రదేశ్‌లోని హమీర్‌పూర్ కూడా ఈ జాబితాలో చోటు దక్కించుకున్నాయి.

**70 సూచికల ఆధారంగా అంచనా**

పెర్ఫామెన్స్ గ్రేడింగ్ ఇండెక్స్‌లో విద్యా ఫలితాలు, పాఠశాలలకు చేరువ, మౌలిక వసతులు, సమాన అవకాశాలు, పరిపాలన, ఉపాధ్యాయుల శిక్షణ వంటి ఆరు ప్రధాన విభాగాల్లోని 70 సూచికల ఆధారంగా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల పనితీరును అంచనా వేశారు. జిల్లాల స్థాయిలో కూడా ఇదే తరహా ప్రమాణాలతో మూల్యాంకనం చేపట్టారు. ఏదేమైనా 2025-26 విద్యా సంవత్సరంలో డ్రాప్‌అవుట్ రేటు తగ్గడం, సెకండరీ స్థాయిలో చేరికలు పెరగడం, ఉపాధ్యాయుల సంఖ్య పెరగడం వంటి అంశాలు దేశ విద్యా రంగంలో సానుకూల మార్పులకు సంకేతాలుగా కేంద్ర విద్యాశాఖ నివేదిక పేర్కొంది.

## ఒక్క కారు పాడైందని నిరూపించండి



దేశంలో 20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్ (ఈ20) వినియోగం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయనే ఆరోపణలను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ తీవ్రంగా ఖండించారు. ఈ20 పెట్రోల్ కారణంగా కనీసం ఒక్క కారు పాడైందని నిరూపించాలని ఆయన విమర్శకులకు సవాల్ విసిరారు. సోషల్ మీడియాలో జరుగుతున్న ఈ ప్రచారాన్ని ఆయన "పెయిడ్ క్యాంపెయిన్"గా అభివర్ణించారు. ఇంధన దిగుమతుల కోసం దేశం ఏటా రూ. 22 లక్షల కోట్లు ఖర్చు చేస్తోందని, ఇథనాల్ ఉత్పత్తి ద్వారా రైతులకు రూ. 45,000 కోట్ల అదనపు ఆదాయం లభిస్తోందని ఆయన వివరించారు. ఇంధన దిగుమతులను తగ్గించుకుంటూ, పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ వాడకాన్ని వేగవంతం చేస్తోంది. నిర్దేశించుకున్న గడువు కంటే ముందే, 2026 ఏప్రిల్ నాటికి జు20 లక్ష్యాన్ని చేరుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం చెరకు పిప్పి, నూకలు, మొక్కజొన్నల నుంచి ఇథనాల్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. అయితే, ఈ మిశ్రమ పెట్రోల్ వాడకం వల్ల మైలేజీ తగ్గుతోందని, పాత వాహనాల ఇంజిన్లపై ఇది దీర్ఘకాలిక ప్రభావం చూపుతుందని సోషల్ మీడియా వేదికగా కొందరు వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆరోపణలను కేంద్ర ప్రభుత్వం, వాహన తయారీ సంస్థలు ముక్తకంఠంతో తోసిపుచ్చుతున్నాయి. ఇథనాల్ కలపడం వల్ల మైలేజీలో 2 నుంచి 5 శాతం వరకు స్వల్ప తగ్గుదల ఉండవచ్చని, అంతకు మించి ఇంజిన్‌కు ఎలాంటి ప్రమాదం ఉండదని పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పూరి గతంలోనే స్పష్టం చేశారు. మారుతి సుజుకి, టయోటా, హీరో మోటోకార్ప్ వంటి ప్రముఖ సంస్థలు సైతం జు20 వినియోగానికి మద్దతు తెలిపాయి. లక్షలాది పాత వాహనాలకు సర్వీసింగ్ నిర్వహించినా, ఇథనాల్ వల్ల తలెత్తిన సమస్యలు ఏవీ గుర్తించలేదని మారుతి సుజుకి వెల్లడించింది. కల్తీ ఇంధనం వల్ల పాడైన కారును చూపిస్తూ, అది జు20 ప్రభావమేనని ప్రచారం చేస్తున్న ఒక వైరల్ వీడియోను టయోటా సంస్థ ఇప్పటికే ఖండించింది.

## ఇండోనేషియాకు బ్రహ్మోస్ క్షిపణులు




రక్షణ రంగ ఎగుమతుల్లో భారత్ మరో కీలక మైలురాయిని అధిగమించింది. ఇండోనేషియాకు సుమారు 200 మిలియన్ డాలర్ల (రూ. 1,900 కోట్లు) విలువైన రెండు బ్రహ్మోస్ సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి బ్యాటరీలను సరఫరా చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. మంగళవారం ఇరు దేశాల మధ్య జరిగిన పలు కీలక రక్షణ ఒప్పందాల్లో భాగంగా ఈ డీల్ ఖరారైంది. ఈ ఒప్పందంతో బ్రహ్మోస్ క్షిపణులను కొనుగోలు చేసిన మూడో విదేశీ కస్టమర్‌గా ఇండోనేషియా నిలిచింది. ఇప్పటికే 2022లో ఫిలిప్పీన్స్ మూడు బ్యాటరీల కోసం ఒప్పందం చేసుకోగా, ఈ ఏడాదే వియత్నాం కూడా బ్రహ్మోస్ కొనుగోలుకు అంగీకరించింది. తాజా ఒప్పందంతో ఇండో-పసిఫిక్ ప్రాంతంలో భారత్ తన రక్షణ భాగస్వామ్యాన్ని మరింత పటిష్టం చేసుకుంటోంది. ఈ డీల్ కేవలం బ్రహ్మోస్ క్షిపణులకే పరిమితం కాలేదు. అస్త్రా ఎయిర్-టు-ఎయిర్ క్షిపణి వ్యవస్థలు, కీలకమైన రక్షణ సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, సముద్ర భద్రత వంటి అంశాలపై కూడా ఇరు దేశాలు అంగీకారానికి వచ్చాయి. గత ఏడాది నవంబర్‌లో జరిగిన ఇరు దేశాల రక్షణ మంత్రుల సమావేశంలోనే ఈ ఒప్పందాలపై చర్చలు మొదలయ్యాయి. భారత్‌కు చెందిన డీఆర్‌డీవో, రష్యాకు చెందిన ఎన్పీవో మషినోస్ట్రోయెనియా సంయుక్తంగా బ్రహ్మోస్ క్షిపణిని అభివృద్ధి చేశాయి. ఇది భారత త్రివిధ దళాల్లోనూ సేవలందిస్తోంది. భారత్ మరో అరడజను దేశాలతో బ్రహ్మోస్ అమ్మకాలపై చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. సాధారణంగా ఒక బ్రహ్మోస్ బ్యాటరీలో 4 లాంచర్లు ఉంటాయి. ఒక్కో లాంచర్ పై 3 రెడీ టు ఫైర్ బ్రహ్మోస్ క్షిపణులు ఉంటాయి. ఆ లెక్కన ఒక బ్యాటరీలో మొత్తం 12 క్షిపణులు ఉంటాయి. వీటిని కేవలం 30 సెకన్ల వ్యవధిలోనే వేర్వేరు లక్ష్యాలపై ప్రయోగించవచ్చు.

# ముఖ్యమంత్రి పర్యటనలను మేము నియంత్రించాలా?

కరూర్ తొక్కిసలాటపై తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ బహిరంగ ప్రకటనలు చేయకుండా నిరోధించాలని డీఎంకే వేసిన పిటిషన్?పై మంగళవారం సుప్రీంకోర్టు తీవ్రవ్యాఖ్యలు చేసింది. 'సీఎం పర్యటనలను మేము నియంత్రించాలా?' అని ఆగ్రహం వ్యక్తం చేసింది. దేశపౌరులందరికీ భావప్రకటనా స్వేచ్ఛ ఉంటుందని, దానిపై ఆంక్షలు విధించాలా? అంటూ ప్రశ్నించింది. సీఎం విజయ్? జులై 10న కరూర్ పర్యటనకు వెళ్లనున్నారు. తొక్కిసలాట సమయంలో మరణించిన వారి కుటుంబాలతో మాట్లాడనున్నారు. ఈ నేపథ్యంలోనే, సీఎం విజయ్?, మంత్రి అధవ్? అర్జున సహా ఇతర నిందితులు బహిరంగ ప్రకటనలు చేయకుండా నిరోధించాలని, బాధిత కుటుంబాలతో వారు జరిపే చర్చలను కూడా నియంత్రించాలని కోరుతూ డీఎంకే సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. అయితే ఈ పిటిషన్‌ను విచారించేందుకు జస్టిస్ కెవి విశ్వనాథన్, జస్టిస్ అలోక్‌ల ద్విసభ్య ధర్మాసనం నిరాకరించింది. దీనితో పిటిషనర్ తరఫు న్యాయవాది దీనిని ఉపసంహరించుకోవడానికి అనుమతి కోరారు. అందుకు ధర్మాసనం అంగీకరించింది. అయితే చట్టప్రకారం అందుబాటులో ఉన్న ఇతర మార్గాలను ఆశ్రయించే స్వేచ్ఛను పిటిషనర్?కు కల్పించింది. గతేడాది కరూర్? తొక్కిసలాట ఘటనపై సుప్రీంకోర్టు సీబీఐ విచారణకు ఆదేశించింది. ప్రస్తుతం ఈ కేసు దర్యాప్తు జరుగుతోంది. ఈ నేపథ్యంలో జులై 10న సీఎం విజయ్ కరూర్ తొక్కిసలాట మరణించిన వారి కుటుంబాలకు పరిహారం (ఎక్స్‌గ్రేషియా), కారుణ్య నియామక పత్రాలను పంపిణీ చేయాలని తలపెట్టారు. ఈ నేపథ్యంలోనే డీఎంకే ఈ అత్యవసర పిటిషన్?ను దాఖలు చేయడం గమనార్హం.



**కోర్టులో జరిగిన వాదోపవాదాలు**

డీఎంకే తరఫున సీనియర్ అడ్వకేట్ రంజిత్ కుమార్ తన వాదనలు వినిపించారు. తమిళనాడు మంత్రులు బహిరంగ ప్రకటనలు చేస్తూ, కరూర్ తొక్కిసలాట కేసుపై ఒక ప్రత్యేకమైన కథనాన్ని సృష్టిస్తున్నారు. ఇది ఈ కేసును సీబీఐకు బదిలీ చేస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును ఉల్లంఘించడమే అవుతుందని అన్నారు. ఈ వాదనపై జస్టిస్ విశ్వనాథన్ స్పందిస్తూ, "ముఖ్యమంత్రి పర్యటనలను సుప్రీంకోర్టు నియంత్రించాలని, ఆయన రూట్ మ్యాప్‌ను న్యాయస్థానం ఖరారు చేయాలని మీరు కోరుకుంటున్నారా" అని ప్రశ్నించారు. దీనికి రంజిత్ కుమార్ వివరణ ఇస్తూ, తాము బాధితులకు పరిహారం అందించడాన్ని వ్యతిరేకించడం లేదని, అయితే సీఎం, ఇతర మంత్రులు కేసు మెరిట్స్‌పై వ్యాఖ్యలు చేయకుండా నిలువరించాలని మాత్రమే కోరుతున్నామని చెప్పారు.

దీనిపై జస్టిస్ విశ్వనాథన్ స్పందిస్తూ, "అంటే వాక్ స్వాతంత్ర్యంపై మేము స్టే ఇవ్వాలని మీరు కోరుతున్నారా? వారి మాటలకు మీ మాటలతోనే సమాధానం ఇవ్వండి. సీబీఐ విచారణకు ఆదేశించిన కేసులో, ఒక రాజకీయ ప్రత్యర్థిని చేర్చి, ఒకదాని తర్వాత ఒకటిగా ఆదేశాలు జారీ చేయడానికి సుప్రీంకోర్టు ఎలా అనుమతిస్తుంది?"? అని ప్రశ్నించారు. బాధిత కుటుంబాలకు రూ. 10 లక్షల ఎక్స్?గ్రేషియా, కారుణ్య నియామక ఉత్తర్వులు అందించడం వల్ల విచారణ ఎలా ప్రభావితం అవుతుంది? అని న్యాయమూర్తి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. "మీరు బాగా ఆలోచించే ఈ పిటిషన్?ను వేశారా?" అని సీనియర్? అడ్వకేట్? రంజిత్ కుమార్?ను జస్టిస్? విశ్వనాథన్ ప్రశ్నించారు.

దీనికి రంజిత్ కుమార్ సమాధానమిస్తూ, విజయ్? ఈ కేసులో డ్యూయెల్ రోల్ పోషిస్తున్నారని అన్నారు. ఒక వైపు ఈ కేసులో నంబర్?-1 నిందితుడిగా ఉన్న విజయ్?, మరోవైపు ముఖ్యమంత్రిగా ఉండి బాధితులకు పరిహారం అందించడానికి సిద్ధమవుతున్నారని పేర్కొన్నారు. వెంటనే జస్టిస్ విశ్వనాథన్ ఆ వాదనలను అడ్డుకున్నారు. ఎఫ్ఐఆర్‌లోని నిందితుల పేర్లలో విజయ్ పేరు లేదని స్పష్టం చేశారు. "ఎవరు నంబర్ వన్ నిందితుడు మీ పిటిషన్‌లో కానీ, గత ప్రభుత్వం నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో గానీ విజయ్?ను నిందితుడిగా పేర్కొనలేదు. దయచేసి మీరు చెబుతున్న వివరాలను సరిచూసుకోండి" అని సూచించారు.

మరోవైపు రెస్పాండెంట్స్ (విజయ్ తరఫు న్యాయవాది) తరఫు సీనియర్ అడ్వకేట్ నీరజ్ కిషన్ కౌల్ మాట్లాడుతూ, కరూర్ తొక్కిసలాట కేసులో సీఎం విజయ్ నిందితుడు కాదని పేర్కొన్నారు. ఇది విన్న జస్టిస్ విశ్వనాథన్ డీఎంకే తరఫు న్యాయవాదితో మాట్లాడుతూ, "ఈ కేసులో నిందితులుగా ఉన్న కొందరు మంత్రులు మాత్రమే, ముఖ్యమంత్రి కాదు. మీరు కోర్టును రాజకీయ పోరాట వేదికగా ఎందుకు మారుస్తున్నారు? ఈ పిటిషన్?ను విచారణ చేయడానికి మేము సిద్ధంగా లేము. అందుకే పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని సూచిస్తున్నాం" అని అన్నారు.

దీనితో సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన జస్టిస్ (రిటైర్డ్) అజయ్ రస్తోగి నేతృత్వంలోని కమిటీ ముందు ఈ విషయాన్ని లేవనెత్తే అవకాశం ఇవ్వాలని రంజిత్ కుమార్ కోరారు. అలాగే కేసుపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన తమిళనాడు మంత్రి ఆధవ్ అర్జునపై కోర్టు ధిక్కారణ పిటిషన్? దాఖలు చేయనున్నట్లు తెలిపారు. ఈ వాదనలు అన్నీ విన్న ధర్మాసన డీఎంకే పిటిషన్?ను కొట్టివేసింది.

## మెల్‌బోర్న్‌లో మోదీ మేనియా..



ప్రధాని నరేంద్ర మోదీ ఈ వారాంతంలో ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా జూలై 9న జరిగే 'మెల్‌బోర్న్ మీట్స్ మోదీ' ప్రవాస భారతీయ కార్యక్రమానికి రికార్డు స్థాయిలో జనం హాజరవుతారని అంచనా వేస్తున్నారు. ఈ పర్యటనపై ఆస్ట్రేలియాలోని భారత సమాజంలో విపరీతమైన ఉత్సాహం నెలకొంది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియాలోని భారత హైకమిషనర్ నగేష్ సింగ్ ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ పర్యటనకు సంబంధించిన కీలక విషయాలు వెల్లడించారు. "ప్రధాని మోదీకి ఇక్కడ విపరీతమైన ఆదరణ ఉంది. మార్వెల్ ఎరీనాలో జరిగే ఈవెంట్‌కు 25,000 నుంచి 30,000 మంది హాజరవుతారని భావిస్తున్నాం. కానీ డిమాండ్ చాలా ఎక్కువగా ఉంది. ఆస్ట్రేలియాలోని అన్ని రాష్ట్రాల నుంచి ప్రజలు తరలివస్తున్నారు. పరిమిత స్థలం కారణంగా చాలా మందికి అవకాశం కల్పించలేకపోయాం" అని ఆయన వివరించారు. కొన్నేళ్ల క్రితం సిడ్నీలో జరిగిన ఇలాంటి కార్యక్రమంలో నాటి ఆస్ట్రేలియా ప్రధాని అల్బనీస్, మోదీని 'ది బాస్' అని సంబోధించిన విషయాన్ని నగేష్ సింగ్ గుర్తుచేశారు. ఈసారి మెల్‌బోర్న్ ఈవెంట్ అంతకుమించి విజయవంతం అవుతుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మోదీతో పాటు ఆస్ట్రేలియా ప్రధాని కూడా ప్రసంగిస్తారని తెలిపారు. భారత్-ఆస్ట్రేలియా సంబంధాలు ప్రజాస్వామ్యం, స్వేచ్ఛ వంటి విలువలపై ఆధారపడ్డవని, స్వేచ్ఛాయుత ఇండో-పసిఫిక్‌ను ఇరు దేశాలు కోరుకుంటున్నాయని సింగ్ అన్నారు. పర్యటనలో భాగంగా ఇరు దేశాల ప్రధానులు వార్షిక సదస్సులో పాల్గొంటారు. అదేవిధంగా, క్రికెట్‌ను దాటి ఇతర క్రీడల్లోనూ సహకారాన్ని విస్తరించాలని రెండు దేశాలు భావిస్తున్నట్లు తెలిపారు. క్రీడా విజ్ఞానం, సాంకేతికత, నిర్వహణ వంటి అంశాల్లో పరస్పరం సహకరించుకోవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు పేర్కొన్నారు. భారత్-ఆస్ట్రేలియా ద్వైపాక్షిక సంబంధాలు చాలా బలంగా ఉన్నాయని, దానిని 'క్వాడ్' కూటమితో పోల్చడం సరికాదని నగేష్ సింగ్ స్పష్టం చేశారు. వాణిజ్యం, పెట్టుబడులు, రక్షణ, భద్రత వంటి రంగాల్లో ద్వైపాక్షిక సహకారం గణనీయంగా పెరుగుతోందని, క్వాడ్ అనేది నాలుగు దేశాలతో కూడిన ప్రత్యేక ఏర్పాటు అని ఆయన వివరించారు.

## చాట్‌జీపీటీలో అంతరాయం..
## ఆగిపోయిన ఇమేజ్ జనరేషన్ సేవలు

ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వేదిక చాట్‌జీపీటీలో ఇమేజ్ జనరేషన్ సేవలకు ప్రపంచవ్యాప్తంగా అంతరాయం ఏర్పడింది. మంగళవారం వినియోగదారులు ప్రాంప్ట్‌లు నమోదు చేసినప్పటికీ, ఇమేజ్‌లు జనరేట్ కాకపోవడంతో తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ఈ సమస్యను గుర్తించామని, దీనిని పరిష్కరించేందుకు తక్షణ చర్యలు చేపడుతున్నామని మాతృసంస్థ ఓపెన్‌ఏఐ వెల్లడించింది. ఉదయం నుంచి చాట్‌జీపీటీ ఇమేజ్ జనరేషన్ విభాగంలో అధిక సంఖ్యలో సాంకేతిక లోపాలు తలెత్తినట్లు గుర్తించారు. వెంటనే అప్రమత్తమైన ఇంజినీర్లు సమస్యను చక్కదిద్దే ప్రక్రియను ప్రారంభించారు. ఈ అంతరాయం డాల్-ఈ ఆధారిత ఇమేజ్ క్రియేషన్ టూల్స్‌పై ప్రభావం చూపిందని, పరిష్కారానికి అవసరమైన చర్యలను తీసుకుంటున్నామని పేర్కొంది. కస్టమ్స్ జీపీటీ, చాట్‌జీపీటీ, ఫెడ్ రాంబ్ కోడెక్స్, ఇమేజ్ జనరేషన్, వర్క్ స్పేస్ అనలటిక్స్, కన్వర్సేషన్ సెర్చ్ వంటి సేవల్లో కూడా సమస్య వచ్చిందని కంపెనీ తెలిపింది. యూజర్ల నుంచి ఫిర్యాదులు అందినట్లు తెలిపింది. దీనిపై తమ బృందం పని చేస్తోందని పేర్కొంది. ఇప్పటికే చాట్ జీపీటీ సేవలను పునరుద్ధరించామని తెలిపింది. మిగిలిన సేవలను కూడా సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని కంపెనీ వెల్లడించింది. ఈ సాంకేతిక సమస్యపై డౌన్‌డెటెక్టర్ వంటి ప్లాట్‌ఫామ్‌లలో వినియోగదారుల నుంచి భారీగా ఫిర్యాదులు వెల్లువెత్తాయి. ఒక్క భారతదేశంలోనే వందకు పైగా ఫిర్యాదులు నమోదైనట్లు సమాచారం. ఉచిత మరియు ప్రీమియం పెయిడ్ యూజర్లు అందరూ ఈ సమస్యను ఎదుర్కొన్నారు.

VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137